బుధవారం
14-5-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 232
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

సీజేఐ జస్టిస్ ఖన్నా పదవీవిరమణ

న్యూదిల్లీ: భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సంజీవ్ ఖన్నా మంగళవారం పదవీ విరమణ చేశారు. తదుపరి సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్‌కి బాధ్యతలు అప్పగించారు. జస్టిస్ బీఆర్ గవాయ్ బుధవారం భారతదేశ 52వ ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. సుప్రీంకోర్టులో మంగళవారం ఉదయం జరిగిన వీడ్కోలు సభలో జస్టిస్ ఖన్నా మాట్లాడారు. తదుపరి ఎటువంటి అధికారిక పదవులు చేపట్టనని జస్టిస్ ఖన్నా

- మిగతా 2 లో

9 మందికి జీవితఖైదు

చెన్నై: తమిళనాడులోని పొల్లాచిలో 2019లో జరిగిన లైంగిక వేధింపుల కేసులో నిందితులుగా ఉన్న తొమ్మిది మందిని కోయబంత్తూరు సెషన్స్ కోర్టు దోషులుగా తేల్చింది. మొత్తం 9 మందికి జీవితఖైదు విధించింది. మరణించేంత వరకూ నిందితులు జైలులోనే ఉండాలని తీర్పు చెప్పింది. నిందితులు తొమ్మిది మంది 2019 నుంచి జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. వారిని మంగళవారం కట్టుదిట్టమైన భద్రతతో సెషన్స్ కోర్టుకు తీసుకొచ్చారు. ఈ కేసు విచారణలో భాగంగా న్యాయస్థానం వీరందరినీ దోషులుగా తేల్చింది. దోషులకు జీవిత ఖైదు విధించాలని

- మిగతా 2 లో

'4 పీఎం'పై నిషేధం ఎత్తివేత

న్యూదిల్లీ: యూట్యూబ్ ఛానల్ '4 పీఎం'పై నిషేధాన్ని కేంద్రం ఎత్తివేసింది. ఇదే విషయాన్ని 4 పీఎం తరపు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ మంగళవారం సుప్రీం కోర్టుకు తెలిపారు. సీజేఐ బీఆర్ గవాయి, జస్టిస్ ఏజీ మసిహ్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం 4 పీఎం ఎడిటర్ సంజయ్ శర్మ పిటిషన్‌ను విచారించింది. 73 లక్షల మంది సబ్‌స్క్రైబర్లు ఉన్న తమ ఛానల్‌పై నిషేధం ఎత్తివేయాలని కోర్టును శర్మ కోరారు. దేశ భద్రత నెపంతో తమ ఛానల్ నిషేధానికి ఉత్తర్వులు ఇచ్చారని పేర్కొన్నారు. సిబల్ వాదనలు వినిపిస్తూ నిషేధాన్ని కేంద్రప్రభుత్వం ఎత్తివేసింది కాబట్టి

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ట్రంప్ చెబితే మణిపూర్, కగార్ కూడా పరిష్కరించేస్తా!

ప్రజలపై భారం మోపకుండా

సంక్షేమం అమలు

- ధనిక రాష్ట్రాన్ని అప్పగిస్తే అప్పులు మిగిల్చారు
- గిరిజన నియోజకవర్గాల్లో అదనంగా ఇందిరమ్మ ఇళ్లు
- 18న 'ఇందిరా సౌరగిరి జల వికాసం' ప్రారంభం

విశాలాంధ్ర - హైదరాబాద్: ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా రాష్ట్ర ప్రజలపై ఒక్క రూపాయి భారం మోపకుండా రూ. వేల కోట్లతో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. అయితే ప్రజల కోసం మంచి చేస్తున్న ప్రజా ప్రభుత్వం అధికారంలో ఉండకూడదని బీఆర్ఎస్ కుట్రలు పన్నుతుందని, దీన్ని ప్రజలు గమనించాలని పేర్కొన్నారు. మహబూబాబాద్ జిల్లా ఇల్లందు నియోజకవర్గం లక్ష్మీ నరసింహపురంలో మంగళవారం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ... రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు తీసుకురాబోతున్నట్టు తెలిపారు. ధనిక రాష్ట్రాన్ని వారి చేతికి అప్పగిస్తే ఏడు లక్షల కోట్ల అప్పులు మిగిల్చారు అన్నారు. ప్రజల సొమ్మును దోపిడీ చేయడం మూలంగానే నేడు అనేక పథకాలు ప్రజలకు ఇంకా అందకుండా పోయాయన్నారు. అటవీ హక్కుల చట్టం కింద పట్టాలు పొందిన గిరిజన రైతులు సాగు చేసుకునేందుకు వెళితే... మహిళలని చూడకుండా ప్రభుత్వం చెట్టుకు కట్టేసి కొట్టిందని అన్నారు. గిరిజన నియోజకవర్గాల్లో అదనంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. గిరిజన రైతులకు భరోసా కల్పించేందుకు ఇందిరమ్మ ప్రభుత్వం ఇందిరా సౌరగిరి జల వికాసం పథకాన్ని ఈనెల 18న నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట చెంచు కాలనీలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించబోతున్నామన్నారు. రూ.12,500 కోట్లు ఖర్చు చేయనున్నట్లు వివరించారు. ప్రతి గిరిజన రైతుకు సోలార్ విద్యుత్ పంపుసెట్లు, స్ప్రింక్లర్లు, అవకాడో, పామ్ ఆయిల్ వంటి మొక్కలు ఉచితంగా అందజేస్తాం అన్నారు. పదేళ్ల కాలంలో ఒక డబుల్ బెడ్ రూం ఇవ్వలేదు, ఏ ఒక్క

- మిగతా 2 లో

అండమాన్‌కు నైరుతి

న్యూదిల్లీ: ఎండలతో మండుతున్న భారతదేశానికి చల్లని కబురు వచ్చేసింది. దేశానికి అత్యధికంగా వర్షపాతాన్నిచ్చే నైరుతి రుతుపవనాలు మరింత చురుగ్గా కదులుతున్నాయి. మంగళవారం మధ్యాహ్నం నాటికి అవి దక్షిణ అండమాన్ సముద్రం, నికోబార్ దీవులు, దక్షిణ బంగాళాఖాతానికి చేరినట్లు భారత వాతావరణ విభాగం వెల్లడించింది. రుతుపవనాల ఆగమనం దృష్ట్యా రెండు రోజులుగా నికోబార్ దీవుల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయని పేర్కొంది. రానున్న మూడు, నాలుగు రోజుల్లో అండమాన్ నికోబార్ దీవులంతటితో పాటు దక్షిణ అరేబియా సముద్రం, బంగాళాఖాతం మధ్య వరకు విస్తరించేందుకు వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని ఐఎండీ వెల్లడించింది. మే 27 నాటికి ఈ రుతుపవనాలు కేరళను తాకే అవకాశం ఉన్నట్లు ఇప్పటికే వాతావరణ శాఖ అంచనా వేసింది. సాధారణంగా జూన్ 1 నాటికి రుతుపవనాలు

- మిగతా 2 లో

ప్రధాని ప్రసంగం పేలవం

క్లిష్ట ప్రశ్నలకు సమాధానం దాటవేత

- తక్షణం పార్లమెంటును సమావేశపర్చాలి
- దేశభద్రత, సార్వభౌమాధికారం, విదేశాంగ విధానంపై చర్చించాలి
- సీపీఐ డిమాండ్

న్యూదిల్లీ: ఆపరేషన్ సిందూర్ అనంతరం జాతినుద్దేశించి ప్రధానిమంత్రి నరేంద్ర మోదీ చేసిన ప్రసంగం పేలవంగా ఉందని సీపీఐ తీవ్రంగా విమర్శించింది. దేశప్రజల్లో నెలకొన్న ఆందోళనలకు సరైన పరిష్కారాలు చూపడంలో మోదీ విఫలమయ్యారని తెలిపింది. ఈ పరిస్థితుల్లో అత్యవసరంగా పార్లమెంటును సమావేశపర్చి దేశ భద్రత, సార్వభౌమాధికారం, విదేశాంగ విధానం తదితర అంశాలపై చర్చించాలని డిమాండ్ చేసింది. పహల్గాం ఉగ్రదాడి ఘటనలో 26మంది అమాయకుల ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా చేపట్టిన దృఢమైన పోరాటంలో భారతదేశ ప్రజలు, అన్ని ప్రజాస్వామ్య శక్తులు ఐక్యంగా ఉన్నాయన్న విషయాన్ని సీపీఐ గుర్తుచేసింది. ప్రజల్లో చర్చకు దారితీసిన క్లిష్టమైన ప్రశ్నలకు ప్రధాని సమాధానాలు దాటవేశారని తెలిపింది. అణు బెదిరింపులను భారతదేశం సహించదని, ఎటువంటి ఉగ్రవాద సవాళ్లను ఎదుర్కోవటానికి సిద్ధమంటూ వాగ్దానం చేయడం తప్ప ఈ ప్రాంతంలో శాశ్వత శాంతిని సాధించడానికి విశ్వసనీయ మార్గాన్ని చూపడంలో, ప్రస్తుత పరిస్థితి అంతర్లీన సంక్లిష్టతలను పరిష్కరించడంలో ప్రధాని విఫలమయ్యారని పేర్కొంది. తెరవెనుక అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పోషించిన పాత్ర గురించి మాట్లాడకుండా ప్రధాని తెలివిగా వ్యవహరించారు.ఇది ప్రభుత్వ పారదర్శకతపై ప్రజల్లో గణనీయ ప్రశ్నలు లేవనెత్తింది. కశ్మీర్ సమస్య కచ్చితంగా ద్వైపాక్షిక అంశమని భారత్ చేస్తున్న వాదనపై అనుమానాలు బలపడతాయి. బాహ్య శక్తులతో కూడిన బ్యాక్‌చానెల్ దౌత్యం చర్చల్ని ప్రభావితం చేస్తున్నట్లయితే... అలాంటి ప్రమేయం పరిధి , స్వభావాన్ని దేశ ప్రజలకు వివరించాల్సి ఉంటుంది. శాంతికి చర్చలు మాత్రమే కాదు. వాస్తవికత, పారదర్శకత, న్యాయం అవసరమని సీపీఐ స్పష్టం చేసింది. ప్రధాని చెప్పినట్లు ఆపరేషన్ సిందూర్ పాక్‌లో, పీఓకేలో సరిహద్దు వెంబడి ఉగ్రవాద మౌలిక సదుపాయాలను ధ్వంసం చేసినప్పటికీ పాక్ ప్రతీకార దాడుల్లో భారత గడ్డపై పౌరులు, సైనికులు ప్రాణాలు కోల్పోయారు. ఆశ్చర్యకరంగా, ప్రధానమంత్రి తన ప్రసంగంలో ఈ ప్రాణనష్టం గురించి ప్రస్తావించలేదని సీపీఐ తప్పుబట్టింది. ఇక కాల్పుల విరమణ ప్రకటించిన విధానం ఏమాత్రం ఆమోదయోగ్యంగా లేదు. ఎందుకంటే భారత్-పాక్ ప్రభుత్వాలు కాకుండా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మొదట కాల్పుల విరమణను

- మిగతా 2 లో

అందగత్తెలు ఫిదా!

చార్మినార్ చూసి ముగ్ధులైన సుందరీమణులు

- అరబ్బీ మర్ఫా వాయిద్యాలకు అనుగుణంగా స్టెప్పులేసిన మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు
- ప్రపంచ రాయబారుల రాకతో పులకించిన పరిసరాలు
- చరవాణిల్లో అందాలు బంధించిన అందగత్తెలు
- సాంస్కృతిక వైభవం చాటిన హెరిటేజ్ వాక్

విశాలాంధ్ర - హైదరాబాద్: ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన చార్మినార్ సందర్శన ...110 దేశాల మిస్ వరల్డ్ కంటెస్టెంట్స్‌కు మధురానుభూతులను మిగిల్చింది. ఐదు శతాబ్దాలుగా హైదరాబాద్ మధ్య ఠీవీగా ఉన్న ఈ సొగసైన కట్టడంను చూసి సుందరాంగులు మంత్రముగ్ధులయ్యారు. సందర్శన కోసం చార్మినార్ వద్దకు పర్యాటక బస్సుల్లో చేరుకున్న మిస్ వరల్డ్ పోటీదారులకు అధికారులు రెడ్ కార్పెట్ స్వాగతం చెప్పారు. స్థానిక కళాకారులు వారికి సాంప్రదాయిక అరబ్బీ మార్ఫా వాయిద్యాలతో ఆహ్వానం పలికారు. మార్ఫా శబ్దాలు మమేకం చేస్తున్నట్లుగా కొందరు కంటెస్టెంట్స్ ప్రత్యేక స్టెప్పులతో నృత్యం చేస్తూ స్థానిక సంస్కృతిని అనుసయించారు. ఈ అందాల రాయబారులతో చార్మినార్ పరిసరాలు ఒక సరికొత్త శోభను సంతరించుకున్నాయి. చార్మినార్ వద్ద ఫోటోషూట్ కు హాజరైన సుందరీమణులు ఈ చారిత్రాత్మక వేదిక నుంచి ప్రజలకు అభివాదం చేస్తూ తమ ఆనందం, సంతోషాన్ని వ్యక్తపరిచారు. చార్మినార్ అందాలను ఈ అందగత్తెలు తమ చరవాణిల్లో బంధించారు. అనంతరం ప్రపంచ అందగత్తెలు చార్మినార్ ముందు

- మిగతా 2 లో

పేదల అభ్యున్నతికి పరితపించిన 'ఆళ్ల'

సంస్మరణ సభలో కూనంనేని

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం: పేదలు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికోసం పరితపించిన గొప్ప వ్యక్తి ఆళ్ల గురుప్రసాద రావు అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సీపీఐ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ప్రముఖ న్యాయవాది, కమ్యూనిస్టు నేత గురుప్రసాద రావు సంస్మరణ సభ మంగళవారం స్థానిక క్లబ్ లో లాయర్స్ అసోయేషన్ రాష్ట్ర నాయకులు వై.ఉదయ్ భాస్కర్ అధ్యక్షతన జరిగింది. కూనంనేని మాట్లాడుతూ... పేదల కష్టాలు గుర్తించి సేవలు అందించడం ద్వారా జననేతగా ఖ్యాతిపొందారన్నారు. ఆయన నిస్వార్థ సేవల ఫలితంగానే కొత్తగూడెం, పరిసర ప్రాంతాల్లో కమ్యూనిస్టు పార్టీకి బలమైన పునాదులు ఏర్పడ్డాయన్నారు. న్యాయవాదిగా పేద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారంకోసం ఆయన నిరంతరం శ్రమించారన్నారు. ఆళ్ల సేవా దృక్పథాన్ని ఆదర్శంగా తీసుకొని అనేక మంది కమ్యూనిస్టు పార్టీ వైపు ఆకర్షితులై నాయకులుగా ఎదిగారన్నారు. ప్రజలను చైతన్యవంతం చేసి ప్రశ్నించే తత్వం నేర్పించడం ద్వారా కమ్యూనిస్టు పార్టీ ప్రతిష్టను పెంచారని కూనంనేని అన్నారు. ఆయన మృతి కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటని వివరించారు. తొలుత వివిధ రాజకీయపక్షాల నాయకులు, న్యాయవాదులు గురుప్రసాద రావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సీపీఐ రాష్ట్ర

- మిగతా 2 లో

సుస్థిరాభివృద్ధే లక్ష్యం

- నైపుణ్య హబ్‌గా తెలంగాణ
- ప్రతి జిల్లా కేంద్రంలో శిక్షణా కేంద్రం
- డిసెంబరు 9న 'స్కిల్ వర్సిటీ' క్యాంపస్ ప్రారంభం: మంత్రి శ్రీధర్ బాబు

విశాలాంధ్ర - హైదరాబాద్: రాష్ట్రంలో ప్రతి జిల్లా కేంద్రంలో నైపుణ్య శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేసి తెలంగాణను నైపుణ్య హబ్‌గా తీర్చి దిద్దుతామని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్ పేట్ లో "యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ" నిర్మాణ పనుల పురోగతిని మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం గుత్తేదారు సంస్థ ప్రతినిధులు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పనులు సకాలంలో పూర్తి చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. తెలంగాణ యువతకు ఉపాధి కల్పించాలనే సంకల్పంతోనే అంతర్జాతీయ ప్రమాణాలతో "యంగ్ ఇండియా స్కిల్స్ వర్సిటీ"ని ఏర్పాటు చేశామని వివరించారు. యువతలో ప్రతిభకు కొదవలేదని, సానబెడితే అద్భుతాలు సృష్టిస్తారన్నారు. తొలిదశలో మీరాఖాన్‌పేట్ లోని స్కిల్స్ వర్సిటీ శాశ్వత క్యాంపస్ లో అకడమిక్ బ్లాక్, ప్రయోగశాలలు, వసతి గృహాలు, వైస్ ఛాన్సలర్ కార్యాలయాలను డిసెంబరు తొమ్మిదిన లాంఛనంగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దిగ్గజ సంస్థల భాగస్వామ్యంతో ఫార్మా, రిటైల్, లాజిస్టిక్స్, ఏవియేషన్ అండ్ ఎయిర్పోర్ట్ మేనేజ్మెంట్

- మిగతా 2 లో

కల్తీ మద్యం

17 మంది బలి

అమృత్‌సర్: పంజాబ్‌లోని అమృతసర్‌లో ఘోర విషాదం చోటు చేసుకుంది. కల్తీ మద్యం తాగి 17 మంది చనిపోయారు. మరో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉంది. అమృత్‌సర్ మజితా బ్లాక్‌లోని భంగాలి కలన్, తారీవాల్, సంఘ, మరారి కలన్ గ్రామాలకు చెందిన కొంతమంది సోమవారం మద్యం తాగిన కొద్దిసేపటికే అస్వస్థతకు గురయ్యారు. వారిని దగ్గరలోని అమృత్‌సర్ సివిల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ 17 మంది చనిపోయారు. మరో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు మంగళవారం తెలిపారు. కల్తీమద్యంతో అమాయకుల ప్రాణాలు బలిగొన్న నిందితులను వదిలేదిలేదని పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్‌మాన్ స్పష్టంచేశారు. 'ఇవి మరణాలు కాదు...హత్యలు' అని ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు. కాగా లిక్కర్ మాఫియాను అరికట్టడంలో ఆప్ ప్రభుత్వం విఫలమైందని ప్రతిపక్షాలు విమర్శించాయి. ముఖ్యమంత్రి మాన్, ఎక్సైజ్‌శాఖమంత్రి హర్పాల్ సింగ్ చీమా తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశాయి. మరోవైపు, సమాచారం అందుకున్న అమృత్‌సర్ డిప్యూటీ

- మిగతా 2 లో

సీబీఎస్ఈ 10, 12వ తరగతి

ఫలితాలు విడుదల

99.60 శాతం ఉత్తీర్ణతతో విజయవాడ అగ్రస్థానం 2 లో

ఆధిపత్యం ప్రదర్శిస్తే ఏకాకి అవుతారు

ఐక్యంగా ఉంటేనే ప్రపంచ శాంతి, సుస్థిరత సాధ్యం

సెలాక్ సదస్సు ప్రారంభోత్సవంలో జిన్‌పింగ్



బీజింగ్: ఆధిపత్యం ప్రదర్శిస్తే ఏకాకి అవుతారని, ఐక్యంగా ఉంటేనే ప్రపంచ శాంతి, సుస్థిరత సాధ్యమవుతాయని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ సందేశమిచ్చారు. చైనా రాజధాని బీజింగ్‌లోని నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం కమ్యూనిటీ ఆఫ్ లాటిన్ అమెరికన్, కరేబియన్ స్టేట్స్ (సెలాక్) సదస్సులో ఆయన ప్రారంభోపన్యాసం చేశారు. ప్రపంచ శాంతి, సుస్థిరత పరిరక్షణతో పాటు అభివృద్ధి, సౌభాగ్యం కావలంటే ఐక్యంగా ఉండాలని ప్రపంచ దేశాధినేతలకు జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. సుంకాల యుద్ధాలు, వాణిజ్య యుద్ధాలలో విజేతలు ఉండరని పునరుద్ఘాటించారు. వేధింపులకు పాల్పడుతూ ఆధిపత్య ధోరణి ప్రదర్శిస్తే ఏకాకి అవుతారని హెచ్చరించారు. లాటిన్ అమెరికా, కరేబియన్ దేశాలతో సంబంధాలను మరింతగా బలపర్చుకోవాలని చైనా భావిస్తోందని చెప్పారు. కీలక అంశాలు, ప్రధాన సమస్యలపై పరస్పర సహకారాన్ని పెంపొందించుకోవాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. పరిపాలనా అనుభవాలను పంచుకోవడం కోసం ఏటా చైనాకు వచ్చేలా 'సెలాక్' సభ్య దేశాల రాజకీయ పార్టీల ప్రతినిధులు 300 మందికి రాగల మూడేళ్లలో చైనా ఆహ్వానాలు పంపుతుందని జిన్‌పింగ్ ప్రకటించారు. చైనా, లాటిన్ అమెరికా, కరేబియన్ దేశాల మధ్య వాణిజ్యం 2024లో మొదటిసారిగా 500 బిలియన్ డాలర్ల మార్కును దాటినట్లు తెలిపారు. శతాబ్దం ఆరంభంలో జరిగిన వాణిజ్యంతో పోల్చితే 40 రెట్ల కంటే ఎక్కువగా నమోదైనట్లు చెప్పారు. గ్లోబల్ డెవలప్‌మెంట్ ఇనిషియేటివ్ అమలు కోసం లాటిన్ అమెరికా, కరేబియన్ దేశాలతో కలిసి పని చేస్తామన్నారు. బహుపాక్షిక వాణిజ్య వ్యవస్థ పరిరక్షణకు కట్టుబడి ఉన్నట్లు చెప్పారు. అంతర్జాతీయ పారిశ్రామిక, సరఫరా గొలుసుల సక్రమ -సజావు నిర్వహణ, బహిరంగ-సహకార అంతర్జాతీయ వాతావరణ పరిరక్షణ కోసం తమ వంతు కృషి చేస్తామని జిన్‌పింగ్ తెలిపారు. బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ పురోగతి, వ్యూహాత్మక అభివృద్ధి కోసం పరస్పరం మరింతగా సహకరించుకోవాలని ఆకాంక్షించారు. అమెరికా, చైనా మధ్య వాణిజ్య ఒప్పందంలో ముందడుగు... టారిఫ్‌లకు తాత్కాలిక విరామం క్రమంలో చైనా-సెలాక్ నాల్గవ మంత్రుల స్థాయి సదస్సులో జిన్‌పింగ్ చేసిన వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడింది. తొలుత ప్రపంచ దేశాధినేతలకు జిన్‌పింగ్ సాదర స్వాగతం పలికారు. సదస్సు నేపథ్యంలో ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించారు. ఆస్ట్రేలియా ప్రధానిగా తిరిగి ఎన్నికైన ఆంటోని అల్బనీస్‌కు శుభాకాంక్షలు తెలిపారు. బ్రెజిల్ అధ్యక్షుడు లులా డ సిల్వాతో భేటీ అయిన జిన్‌పింగ్ అనేక అంశాలపై చర్చించారు.

11 మంది సైనికుల మృతి

- 78 మందికి గాయాలు
- ప్రాణాలు కోల్పోయిన 40 మంది పౌరులు
- భారత్‌తో సైనిక ఘర్షణపై పాకిస్థాన్ ప్రకటన

ఇస్లామాబాద్: భారత్‌తో సాగిన భీకర పోరులో తమ సైనికులు 11 మంది చనిపోయారని పాకిస్థాన్ ప్రకటించింది. మరో 78 మందికి గాయాలు అయినట్లు మంగళవారం ఒక ప్రకటన చేసింది. అలాగే 40 మంది సామాన్య పౌరులు ప్రాణాలు కోల్పోగా 121 మంది గాయపడ్డారని వెల్లడించింది. ఈనెల 6,7 తేదీల మధ్య రాత్రి భారత్ భీకర దాడుల్లో ప్రాణ నష్టం సంభవించినట్లు అధికారి ప్రకటన పేర్కొంది. దాదాపు నాలుగు రోజులు సాగిన క్షిపణులు, డ్రోన్ల పరస్పర దాడుల అనంతరం శనివారం కాల్పుల విరమణ కోసం భారత్, పాకిస్థాన్ మధ్య సయోధ్య కుదిరిన విషయం తెలిసిందే. మాతృభూమిని రక్షించుకోవడం కోసం ప్రాణాలు త్యజించిన వీరసైనికుల్లో వైమానిక దళానికి చెందిన స్క్వాడ్రన్ లీడర్ ఉస్మాన్ యూసుఫ్, చీఫ్ టెక్నీషియన్ ఔరంగజేబ్, సీనియర్ టెక్నీషియన్లు ముబాషిర్, నజీబ్, కార్పొరల్ టెక్నీషియన్ ఫరూక్, నాయక్‌లు వకార్ ఖాలిద్, అబ్దుల్ రెహమాన్, లాన్స్ నాయక్‌లు దిలావర్ ఖాన్, ఇక్రాముల్లా, సిపాయిలు మహమ్మద్ అదీల్ అక్బర్, నిసార్ ఉన్నట్లు పేర్కొంది. దాడుల్లో చనిపోయిన సామాన్యుల్లో ఏడుగురు మహిళలు, 15 మంది పిల్లలు ఉన్నట్లు వెల్లడించింది. పాకిస్థాన్ సాయుధ దళాలు 'మర్కా ఏ హక్' బ్యానర్ కింద ఆపరేషన్ బున్యానున్ మర్సూస్ ద్వారా ప్రతిదాడులు చేసినట్లు తెలిపింది. అమరులకు సాయుధ దళాలు, పాక్ పౌరులు సంయుక్తంగా నివాళులర్పించినట్లు ప్రకటన పేర్కొంది. పాకిస్థాన్ సార్వభౌమత్వాన్ని లేక ప్రాదేశిక సమగ్రతను సవాల్ చేస్తే దీటుగా బదులిస్తామని పాకిస్థాన్ స్పష్టంచేసింది. ఇదిలావుంటే, పాక్ లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ చౌదరీ వైమానిక, నావికా దళాధికారులతో కలిసి మీడియాతో మాట్లాడుతూ 'భారత్‌తో సైనిక ఘర్షణలో యుద్ధ విమానం ఒకటి దెబ్బతిన్నట్లు చెప్పారు. అయితే ఏ మేరకు నష్టం జరిగిందో చెప్పలేదు. పాక్ యుద్ధ విమానాలను కూల్చేసినట్లు ఇటీవల మీడియాతో మాట్లాడిన భారత ఎయిర్‌మార్షల్ ఏకే భారతి ధ్రువీకరించారు. ఆ శకలాలు పాకిస్థాన్‌లోనే పడినట్లు చెప్పారు. కూలినది మిరాజ్ కావచ్చని రక్షణ రంగ నిపుణులన్నారు.

రేపు టర్కీలో పుతిన్‌తో జెలెన్‌స్కీ భేటీ

కీవ్: ఉక్రెయిన్, రష్యా యుద్ధానికి తెర దించే కసరత్తు ముమ్మరమైంది. రెండు దేశాల అధినేతలు శాంతి చర్చలకు సుముఖంగా ఉన్నారు. చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ నిర్ణయించుకున్నారు. నేరుగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను కలిసేందుకు ఆయన సిద్ధమయ్యారు. పుతిన్-జెలెన్‌స్కీ మధ్య జరగబోయే కీలక చర్చలకు టర్కీలోని ఇస్తాంబుల్ వేదిక అయింది. రష్యా బృందంతో జెలెన్‌స్కీ గురువారం భేటీ అవుతారని ఉక్రెయిన్ అధ్యక్షుడికి సలహాదారు మంగళవారం వెల్లడించారు. ఇస్తాంబుల్‌లో శాంతి చర్చలు జరుగుతాయని తెలిపారు. ఉక్రెయిన్-రష్యా శాంతి చర్చల్లో పాల్గొంటానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. అయితే ఈ చర్చలు ఏ స్థాయిలో జరుగుతాయో రష్యా స్పష్టత ఇవ్వలేదు.

గాజాలో ఆకలి చావులు

57 మంది చిన్నారుల మృతి: డబ్ల్యూహెచ్‌ఓ

గాజాసిటీ: ఇజ్రాయిల్ ముప్పేట దాడులతో గాజా ధ్వంసమైంది. ఆహారం, తాగునీరు అందక ప్రపంచంలోనే అత్యంత దారుణమైన ఆకలి సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. అక్కడి జనాభా పస్తులు ఉండాల్సిన దయనీయ పరిస్థితుల్లో ఆకలి చావులు అంతకంతకూ పెరుగుతున్నాయి. క్షుద్బాధతో 57 మంది పసి ప్రాణాలు గాల్లో కలిశాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) ప్రకటించింది. పరిస్థితులు మారకపోతే వచ్చే 11 నెలల్లో ఐదేళ్లలోపు 71వేల మంది పిల్లలు అత్యంత తీవ్ర పౌష్టికాహార లోపంతో చనిపోతారని హెచ్చరించింది. గాజాలో 5,00,000 మంది క్షుద్బాధను అనుభవిస్తున్నారని, 57 మంది పిల్లలు తీవ్రమైన పౌష్టికాహార లోపంతో మృత్యుఒడికి చేరుకున్నారని వెల్లడించింది. మార్చి2 నుంచి ఇజ్రాయిల్ దిగ్బంధం కొనసాగుతోంది. ఆకలితో చనిపోయిన వారి సంఖ్య చెప్పిన దానికంటే చాలా ఎక్కువగానే ఉండవచ్చని డబ్ల్యూహెచ్‌ఓ పేర్కొంది. జనాభా మొత్తం పస్తులు ఉంటున్నట్లు వెల్లడించింది. ఆకలి, తీవ్రమైన పౌష్టికాహార లోపం, అనారోగ్యం, మరణాలతో ప్రపంచంలోనే దారుణమైన ఆకలి సంక్షోభం గాజాలో ఉందని డబ్ల్యూహెచ్‌ఓ పేర్కొంది.

భారత్‌కు మరిన్ని 'ఎస్-400'

న్యూఢిల్లీ: భారత్-పాకిస్థాన్ మధ్య సైనిక ఘర్షణలో 'ఎస్-400 ఎయిర్ డిఫెన్స్ మిసైల్ సిస్టమ్' కీలకపాత్ర పోషించింది. ఆపరేషన్ సిందూర్ విజయానికి కారణమైంది. పాక్ డ్రోన్లు, క్షిపణులను క్షణాల్లో నేలకూల్చింది. దీనిని సుదర్శన చక్రంగా భారతీయులు వర్ణిస్తారు. ఈ అద్భుత అస్త్రాన్ని రష్యా నుంచి తెప్పించుకున్న భారత్... తాజాగా మరిన్ని సమకూర్చుకొని తమ వైమానిక రక్షణ సామర్థ్యాన్ని పెంచుకోవాలని భావిస్తోంది. ఇందుకోసం అదనంగా ఎస్-400 రక్షణ వ్యవస్థలను రష్యా నుంచి తెప్పించబోతోంది. ఈ మేరకు రష్యాకు వినతి పంపినట్లు అధికారిక వర్గాలు మంగళవారం తెలిపాయి. దీనికి రష్యా కూడా అంగీకరించినట్లు వెల్లడించాయి. ప్రపంచ ఆధునిక అస్త్రాల్లో ఒకటిగా రష్యా తయారీ 'ఎస్-400' ఉంది. 600 కిమీల దూరంలో లక్ష్యాలను గుర్తించడం, 400 కిమీల దూరంలో వాటిని ఛేదించడం దీని ప్రత్యేకత. ఏకకాలంలో నాలుగు రకాల క్షిపణులు ప్రయోగించగలదు. విమానాలు, డ్రోన్లు, క్రూయిజ్ క్షిపణులు, బాలిస్టిక్ క్షిపణులను ధ్వంసం చేయగలదు. 100 లక్ష్యాలను ఒకేసారి గుర్తించగలదు. 2018లో ఐదు ఎస్-400 రక్షణ వ్యవస్థల కోసం రష్యాతో 5.43 బిలియన్ డాలర్ల ఒప్పందం కుదిరింది. ఈ అస్త్రం 2021లో భారత అమ్ములపొదికి చేరింది.

పేదల అభ్యున్నతికి పరితపించిన 'ఆళ్ల'

(మొదటిపేజీ తరువాయి)

కార్యదర్శివర్గ సభ్యుడు భాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.అయోధ్య, రాష్ట్ర సమితి సభ్యుడు ముత్యాల విశ్వనాథం, మిరియాల రంగయ్య, సరెడ్డి పుల్లారెడ్డి, ఎస్ డి సలీం, కల్లూరి వెంకటేశ్వర్ రావు, నరాటి ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్ర నరేంద్ర కుమార్, కమటం వెంకటేశ్వరావు, సలిగంటి శ్రీనివాస్, చంద్రగిరి శ్రీనివాస్, రేసు ఎల్లయ్య, జిల్లా సమితి సభ్యులు వాసిరెడ్డి మురళి, భూక్యా దస్రు, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, ఆదుసుమల్లి సాయిబాబా, కందుల భాస్కర్, కె జమలయ్య, యూసుఫ్, పద్మజ, రత్నకుమారి, ధనలక్ష్మి, ఫహీం ఖాన్, నాగుల్ మీరా , నాగా సీతారాములు, కంచర్ల చంద్రశేఖర్, కోనేరు చిన్ని, తూము చౌదరి, దయానంద్, మద్దెల శివకుమార్, లిక్కి బాలరాజు, సురేందర్, అరుణ, పి రాధాక్రిష్ణ మూర్తి పాల్గొన్నారు.

ప్రధాని ప్రసంగం పేలవం

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటించారు. తాను మధ్యవర్తిత్వం చేశానంటూ గొప్పలు పోయారు. అంతేకాదు రెండు దేశాలతో వాణిజ్యం గణనీయంగా పెరగడానికి ప్రణాళికలను ప్రకటించారు. ఇది భారతదేశ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి, మన సార్వభౌమాధికారానికి గండి కొట్టే భయంకరమైన ప్రశ్నలను లేవనెత్తుతుంది. దీనివల్ల మూడవ పక్షం జోక్యం లేకుండా ద్వైపాక్షిక సమస్యలను పరిష్కరించడానికి ఉద్దేశించిన సిమ్లా ఒప్పందం బలహీనపడింది.

ఈ పరిణామాలలో అమెరికా ప్రమేయం స్వభావం, పరిధిపై ప్రధానమంత్రి ఎందుకు మౌనంగా ఉన్నారని సీపీఐ సూటిగా ప్రశ్నించింది. మధ్యవర్తిత్వం అని పిలవబడే నిబంధనలు ఏమిటి? ప్రతిపాదిత వాణిజ్య విస్తరణ చట్రం ఏంటి? ఇది భారత ఆర్థిక వ్యవస్థ, విదేశాంగ విధానాన్ని ఎలా ప్రభావితం చేస్తుంది? ప్రధానమంత్రి తన ప్రసంగంలో ఈ విషయాలను గుర్తించడంలో విఫలమవడం ఆమోదయోగ్యం కాదని పేర్కొంది. కాబట్టి కేంద్రప్రభుత్వం వెంటనే పార్లమెంటు అత్యవసరం సమావేశం ఏర్పాటు చేసి... ఈ అంశాలపై చర్చించాలని సీపీఐ డిమాండ్ చేసింది. దేశ అత్యున్నత ప్రజాస్వామ్య వేదిక పార్లమెంటు ద్వారా ప్రధాని ప్రజలకు జవాబుదారీగా ఉండాలని తెలిపింది.

అండమాన్‌కు నైరుతి

(మొదటిపేజీ తరువాయి)

పలకరిస్తుంటాయి. ఈ సారి మాత్రం అంతకంటే ముందుగానే వచ్చేందుకు అవకాశాలు కన్పిస్తున్నాయి. అలా జరిగితే 2009 తర్వాత రుతుపవనాలు అంచనాల కంటే ముందుగా రావడం ఇప్పుడే అవుతుంది. ఆ ఏడాది మే 23నే నైరుతి రుతుపవనాలు కేరళను తాకాయి. ఈ సారి సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. మన దేశంలో 52 శాతం నికర సాగు భూమికి ఇప్పటికీ వర్షపాతమే ప్రధాన ఆధారం. దేశం మొత్తం వ్యవసాయ ఉత్పత్తిలో ఈ సాగు భూమి నుంచి ఏకంగా 40 శాతం దిగుబడి వస్తుంది. అందుకే భారత ఆహార భద్రత, ఆర్థిక స్థిరత్వంలో నైరుతి రుతు పవనాలు కీలక పాత్ర పోషిస్తాయి. దేశవ్యాప్తంగా తాగునీరు, విద్యుత్ ఉత్పత్తికి కీలకమైన జలాశయాలను తిరిగి నింపడానికి, దేశ జీడీపీ తోడ్పాటుకు ఇది ఎంతో ముఖ్యమని భావిస్తారు.

కేటీఆర్ అధ్యక్షుడైతే స్వాగతిస్తా

కేసీఆర్ ఆదేశాలు శిరసావహిస్తా

బీఆర్ఎస్‌లో అంతర్గత విభేదాల్లేవ్: హరీశ్‌రావు

విశాలాంధ్ర -హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీలో చీలికలు ఏర్పడ్డాయని, త్వరలోనే హరీశ్‌రావు పార్టీని వీడనున్నట్లు గత కొంతకాలంగా వస్తున్న వార్తాకథనాలపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పందించారు. కేటీఆర్‌కు తనకు మధ్య ఎలాంటి మనస్పర్థలు లేవని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం మీడియా సమావేశంలో ... బీఆర్ఎస్‌లో అంతర్గత విభేదాలున్నాయంటూ సోషల్ మీడియాలో వస్తున్న ఊహాగానాలకు హరీశ్‌రావు తెరదించారు. పార్టీలో ఎలాంటి వర్గపోరు లేదని స్పష్టం చేశారు. కేటీఆర్‌కు పార్టీ బాధ్యతలు అప్పగిస్తే స్వాగతిస్తానని తెలిపారు. అధినేత కేసీఆర్ తీసుకునే ప్రతి నిర్ణయాన్ని తాను గౌరవిస్తానని, ఆయన ఆదేశాలను తూ.చ. తప్పకుండా పాటిస్తానని పేర్కొన్నారు. క్రమశిక్షణ కలిగిన కార్యకర్తనని, కేసీఆర్ మాటే నా బాట అంటూ వ్యాఖ్యానించారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ ఆ గీత దాటే ప్రసక్తి లేదని హరీశ్‌రావు చెప్పారు. ఎలాంటి వర్గ విభేదాలు లేవని, అందరం కేసీఆర్ నాయకత్వంలోనే కలిసికట్టుగా పనిచేస్తామని తెలిపారు. గతంలోనూ ఈ అంశంపై చాలాసార్లు స్పష్టతనిచ్చానని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ఎన్నికల హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. కాంగ్రెస్ చేతిలో మోసపోయామని గ్రహించిన ప్రజలు తిరిగి కేసీఆర్ పాలన కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. అన్ని వర్గాల ప్రజలను ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలంతా కాంగ్రెస్ పాలన పట్ల తీవ్ర అసంతృప్తితో ఉన్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందాల పోటీల్లో బిజీగా ఉన్నారు... అందాల పోటీలపై సమీక్షల మీద సమీక్షలు చేస్తున్నారు... వేలాదిమంది పోలీస్‌లను, ప్రభుత్వాధికారులను నియమించి అందాల పోటీలను నిర్వహిస్తున్నారు.. కానీ దేశానికి అన్నం పెట్టే రైతు కోసం, ఆరుగాలం కష్టపడే అన్నదాత కష్టం తీర్చడానికి ముఖ్యమంత్రికి సమయం లేకపోవడం చాలా దురదృష్టకరమని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. రైతుల విషయంలో స్పందించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామన్నారు. ఈ యాసంగికి 70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొంటామని ప్రభుత్వం చెప్పింది కానీ 40 లక్షల మెట్రిక్ టన్నులు కూడా దాటలేదన్నారు. వడ్లకు రూ.నాలుగు వేల కోట్లు బకాయి పడిందన్నారు. 48 గంటల్లో రైతుల ఖాతాలో డబ్బులు వేస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రగల్భాలు పలికారు... కాని పది రోజులైనా డబ్బులు దిక్కులేదని, బోనస్ ఊసే లేదని అన్నారు. యాసంగి పంటకు రూ.512 కోట్లు సన్నాలకు బోనస్ చెల్లించాల్సి ఉందన్నారు. కానీ ప్రభుత్వం ఐదు పైసలు కూడా విడుదల చేయలేదంటూ మండిపడ్డారు. చాలా మంది రైతులు చనిపోయారని.. కానీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. వరంగల్ రైతు డిక్లరేషన్ లో ఇచ్చిన ఏ ఒక్క హామీ అయినా అమలు చేశారా అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ త్వరలోనే కార్యాచరణ ప్రకటిస్తుందని తెలిపారు.

అందగత్తెలు ఫిదా!

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించిన హెరిటేజ్ వాక్ సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పింది. సందర్శనలో భాగంగా చార్మినార్ సమీపంలోని ప్రసిద్ధ చుడీ బజార్ (లాడ్ బజార్)లో కంటెస్టెంట్స్ గాజులు, ముత్యాల హారాలు, ఇతర అలంకరణ వస్తువుల షాపింగ్ చేసి స్థానిక హస్తకళల పట్ల ఆసక్తిని ప్రదర్శించారు. కొందరు గాజుల తయారీ ప్రక్రియను స్వయంగా పరిశీలించి, నిపుణులైన కారిగర్లు (కళాకారులు), శిల్పులను ప్రశంసించారు. వారి శ్రమ, నైపుణ్యం ప్రపంచ స్టేజిపై గుర్తించదగినదని భావించారు. దీని ద్వారా హైదరాబాద్ సాంస్కృతిక వారసత్వం... సౌందర్యం ప్రపంచానికి తెలియజేసినట్లయింది. మిస్ వరల్డ్ కంటెస్టెంట్స్ సందర్శన కేవలం పోటీలలో భాగంగానే కాకుండా, ప్రపంచ శాంతి, సాంస్కృతిక సామరస్యానికి ప్రతీకకగా నిలిచింది. ప్రపంచ సుందరీమణుల పట్ల లాడ్ బజార్ వ్యాపారులు తమ ఉదారత చాటుకున్నారు. ప్రతిష్టాత్మక వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చిన మిస్ వరల్డ్ కంటెస్టెంట్ల నుంచి వ్యాపారులు డబ్బులు తీసుకోలేదు. కొనుగోలు చేసిన వస్తువులను ఉచితంగానే అందజేశారు.

కల్తీ మద్యం 17 మంది బలి

(మొదటిపేజీ తరువాయి)

కమిషనర్ సాక్షి శాన్వే ఆస్పత్రికి చేరుకున్నారు. అక్కడి పరిస్థితిని సమీక్షించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ 'మజితా బ్లాక్‌లో ఈ విషాదకర ఘటన చోటుచేసుకుంది. నిన్న రాత్రి మాకు సమాచారం వచ్చింది. నిన్న మద్యం తాగి 5 గ్రామాలకు చెందిన ప్రజలు అస్వస్థతకు గురైనట్లు మాకు సమాచారం అందింది. వెంటనే మేము వైద్య బృందాలను గ్రామాలకు పంపాం. వైద్య బృందాలు బాధిత గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ఆరోగ్యం గురించి విచారించాయి. అనారోగ్య లక్షణాలు ఉన్నా లేకపోయినా మద్యం తాగిన వారిని ఆస్పత్రికి తీసుకెళుతున్నాం. అలా చేయటం వల్ల వారి ప్రాణాలు కాపాడవచ్చని భావిస్తున్నాం. ఇప్పటి వరకు 17 మంది చనిపోయారు. ప్రభుత్వం అన్ని విధాలుగా సాయం అందిస్తోంది. మరణాల సంఖ్య పెరగకూడదని దేవుడ్ని ప్రార్థిస్తున్నాం' అని అన్నారు. పరిస్థితి విషమంగా ఉన్న ఆరుగురిని రక్షించడానికి డాక్టర్లు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. మద్యం తాగి 17 మంది చనిపోయిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా కలకలం సృష్టించింది.

సుస్థిరాభివృద్ధే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

కోర్సులను అందిస్తున్నామన్నారు. ఏడాది వ్యవధిలోనే 57 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతామని స్పష్టం చేశారు. భావితరాల అవసరాల కోసం... సుస్థిరాభివృద్ధే లక్ష్యంగా అంతర్జాతీయ ప్రమాణాలతో నాలుగో నగరంగా "ఫ్యూచర్ సిటీ"ని అభివృద్ధి చేస్తామన్నారు. త్వరలోనే ఫ్యూచర్ సిటీ అథారిటీ కార్యాలయాన్ని ప్రారంభిస్తామన్నారు.

'4 పీఎం'పై నిషేధం ఎత్తివేత

(మొదటిపేజీ తరువాయి)

ఉపశమనం కోసం పెట్టుకున్న దరఖాస్తుతో ప్రయోజనం లేదని అన్నారు. అయితే ఐటీ నిబంధనలు 2009లోని నియమం 16ను సవాల్ చేస్తూ దాఖలైన పెండింగ్ పిటిషన్లతో శర్మ ఫిర్యాదును ట్యాగ్ చేయాలని న్యాయస్థానాన్ని కోరారు. బ్లాకింగ్ రూల్స్ 2009లోని నియమం 9ను కొట్టివేయాలని అన్నారు. దీంతో పెండింగ్ ఫిర్యాదులతో శర్మ పిటిషన్‌ను సుప్రీంకోర్టు ట్యాగ్ చేసింది. కాగా, జర్నలిజం స్వేచ్ఛపై దాడి అంటూ ప్రభుత్వ ఉత్తర్వులను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై కేంద్ర ప్రభుత్వ వివరణను కోరుతూ ఈనెల 5న సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చిన విషయం విదితమే.

ప్రజలపై భారం మోపకుండా 'సంక్షేమం' అమలు

(మొదటిపేజీ తరువాయి)

దళితునికి భూమి పంపిణీ చేయలేదు, ఇంటికో ఉద్యోగం ఇవ్వలేదు, ప్రతి మండలంలో కేజీ టు పీజీ పాఠశాలలో నెలకొల్పుతామని దాన్ని పక్కన పడేశారు. పెద్ద పరిశ్రమ గాని, నాగార్జునసాగర్, ఎస్సారెస్పీ వంటి ఒక భారీ నీటి ప్రాజెక్టును కేసీఆర్ ప్రభుత్వం ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. రాష్ట్ర దివాలా తీయించి బ్యాంకులకు కుదవబెట్టి తగుదునమ్మ అంటూ కేసీఆర్ కుటుంబం మాట్లాడుతుందని విమర్శించారు. ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశాం, రూ.22,500 కోట్లు ఖర్చు చేసి 4.50 లక్షల మందికి ఇళ్లు నిర్మిస్తున్నట్టు తెలిపారు. ఇంటికో ఉద్యోగం అని పదేళ్లలో ఒక్కసారి కూడా గ్రూప్-1 పరీక్ష నిర్వహించలేకపోయారన్నారు. తాము అధికారంలోకి రాగానే ఏడాదిన్నర కాలంలో 57 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. మరో 30 వేలు భర్తీ చేయబోతున్నట్టు చెప్పారు. యువతను ఆర్థికంగా ప్రోత్సహించేందుకు రూ.తొమ్మిది వేల కోట్లతో రాజీవ్ యువ వికాసం అనే స్వయం ఉపాధి పథకాన్ని ప్రవేశపెట్టినట్టు తెలిపారు. దీంతో ఐదు లక్షల మంది నిరుద్యోగులు ఉపాధి పొందుతారన్నారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన కళ్యాణ లక్ష్మి పథకాన్ని ఆపలేదు... రైతు భరోసా పథకానికి మరో రెండు వేలు అదనంగా జోడించి అందజేస్తున్నాం అన్నారు. రూ. రెండు లక్షల రుణమాఫీ మొదటి ఏడాదిలోనే చేశామన్నారు. రైతు రుణమాఫీ కోసం రూ.21,500 కోట్లు ఖర్చు చేసినట్టు తెలిపారు. రూ. 13వేల కోట్లు ఖర్చు చేసి 90 లక్షల కుటుంబాలకు ప్రతినెల ఒక్కొక్కరికి కిలోలు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నాం అని డిప్యూటీ సీఎం అన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణం చేసే సౌకర్యాన్ని కల్పించినట్టు పేర్కొన్నారు. పేద విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యను అందించేందుకు యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్స్ నిర్మిస్తున్నాం అన్నారు. 200 యూనిట్ల లోపు వాడుకునేవారికి ఉచితంగా విద్యుత్తు సరఫరా చేస్తున్నాం... అందుకు సంబంధించిన బిల్లును రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ శాఖకు చెల్లిస్తుందని ఈ పథకం ద్వారా ప్రతి గ్రామంలో 80 నుంచి 90 శాతం మంది కరెంటు బిల్లులు చెల్లించాల్సిన అవసరం లేకుండా పోయింది వివరించారు. రైతులకు 24 గంటలు ఉచిత విద్యుత్తు అందిస్తూ వారి తరపున రూ.12,500 కోట్లు విద్యుత్ సంస్థలకు చెల్లిస్తున్నట్టు తెలిపారు.

సీబీఎస్ఈ 10, 12వ తరగతి

ఫలితాలు విడుదల

న్యూఢిల్లీ: సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) 10, 12వ తరగతి ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. 10 పరీక్షలకు 23,71,939 మంది, 12వ తరగతి పరీక్షలకు 16 లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. 12వ తరగతిలో 14 లక్షలకు పైగా విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. పది ఫలితాల్లో 93.66 శాతం, 12వ తరగతి ఫలితాల్లో 88.39 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు అధికారులు తెలిపారు. 12వ తరగతిలో గతేడాదితో పోలిస్తే ఇది 0.41 శాతం ఎక్కువ. బాలురకంటే బాలికలు 91శాతం ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. బాలురకంటే 5.94 శాతం అధికం. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ 99.60 శాతం ఉత్తీర్ణతతో అగ్రస్థానంలో నిలిచింది. తర్వాత తిరువనంతపురం 99.32శాతం, బెంగళూరు 95.95 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 79.53శాతంతో యూపీలోని ప్రయాగ్‌రాజ్ అత్యల్పంగా నిలిచింది. ఫిబ్రవరి 15 నుంచి ఏప్రిల్ నాల్గవ తేదీ మధ్య సీబీఎస్ఈ 10, 12వ తరగతి పరీక్షలు జరిగాయి. దేశవ్యాప్తంగా 7,842 కేంద్రాలు... విదేశాలలో 26 ప్రాంతాల్లో ఈ పరీక్షలను సెంట్రల్ బోర్డు నిర్వహించింది.

వన్యప్రాణులను సంరక్షించండి

నీరు, ఆహారం అందజేయండి: మంత్రి కొండా సురేఖ

విశాలాంధ్ర - హైదరాబాద్: వన్యప్రాణులకు నీరు, ఆహారంలో అశ్రద్ధ వహించొద్దని మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. ప్రత్యేకంగా నీటి లభ్యత ఉన్న పండ్లను, దోస, పుచ్చకాయ వంటి వాటిని ఆహారం అందజేయాలని సూచించారు. అడవుల్లో అగ్ని ప్రమాదాలు, నివారణ, వన్యప్రాణి సంరక్షణ చర్యలపై మంగళవారం సచివాలయంలోని తన చాంబర్‌లో మంత్రి సురేఖ సంబంధిత ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ జోన్ల సీసీఎఫ్‌లు, అన్ని జిల్లాల డీఎఫ్ఓలతో వీడియో కాన్ఫరెన్స్ చేపట్టారు. అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు ఏం పరికరాలు వాడుతున్నారని ఆరా తీశారు. ఆ పరికరాలు అందుబాటులో ఉన్నాయా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. వన్యప్రాణులు అగ్నిప్రమాదాల బారిన పడకుండా ఏం చర్యలు తీసుకుంటున్నారని అడిగారు. వేసవి దృష్ట్యా అడవులు, జూలలో వన్యప్రాణులు, ఇతర జంతవులకు తగిన తాగునీటి సదుపాయం ఉందా అని తెలుసుకున్నారు. జంతువుల కోసం 2,168 నీటి గుంతలు ఏర్పాటు చేసినట్టు మంత్రికి అధికారులు వివరించారు. వాటిల్లో నీటిని ప్రతిరోజూ ట్యాంకర్ల ద్వారా నింపుతున్నట్టు మంత్రి దృష్టికి తెచ్చారు. నెహ్రూ జూ పార్కు, వరంగల్ జూ పార్కులలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని మంత్రి సురేఖ సూచించారు. డాక్టర్ సువర్ణ, ఈలు సింగ్ మేరు, జవహర్, శంకరన్, సునీల్ హీరామత్ తదితరులు పాల్గొన్నారు.

సీజేఐ జస్టిస్ ఖన్నా పదవీవిరమణ

(మొదటిపేజీ తరువాయి)

స్పష్టం చేశారు. న్యాయవ్యవస్థలోనే ఏదైనా చేయాలనుకుంటున్నానని చెప్పారు. ప్రజల విశ్వాసాన్ని ఆదేశించలేమని, దానిని సంపాదించుకోవాలని, సుప్రీంకోర్టు ప్రజల విశ్వాసాన్ని చూరగొందని అన్నారు. 'నాకు మాటలు రావడం లేదు. చాలా జ్ఞాపకాలను నాతో పాటు తీసుకువెళుతున్నాను. మీరు ఒకసారి న్యాయవాది అయిన తర్వాత ఎప్పటికీ న్యాయవాదిగానే ఉంటారు. న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని ఆదేశించలేం. సంపాదించుకోవాలి. న్యాయవ్యవస్థ అనేది ధర్మాసనం, బార్‌లను సూచించే సాధారణ పదం. బార్ అంటే న్యాయాన్ని కాపాడే వ్యక్తి' అని అన్నారు. సుప్రీంకోర్టుకు జడ్జీలు విభిన్న ప్రాంతాలు, నేపథ్యాల నుండి వస్తారని, ఈ వైవిధ్యం న్యాయపరమైన నిర్ణయాలు తీసుకోవడంలో సహాయపడుతుందని జస్టిస్ సంజీవ్ ఖన్నా వ్యాఖ్యానించారు. జస్టిస్ బీఆర్ గవాయ్ తనకు మద్దతునిచ్చారని అన్నారు. ఆయన గొప్ప సీజేఐగా నిలుస్తారని, ప్రాథమిక హక్కులు, స్వేచ్ఛను సంరక్షిస్తారని అన్నారు. పదవీవిరమణతో జస్టిస్ సంజీవ్ ఖన్నా 20 ఏళ్ల జడ్జి ప్రస్థానానికి ముగింపుపలికారు. ఆయన మొదటిసారి 2005లో దిల్లీ హైకోర్టు అదనపు జడ్జీగా నియమితులయ్యారు. ఏడాది తర్వాత శాశ్వత జడ్జీగా పదోన్నతి పొందారు.

2019లో సుప్రీంకోర్టుకు పదోన్నతి పొందిన ఆయన జడ్జీగా కొనసాగారు. గతేడాది నవంబర్‌లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. ఈ ఆరేళ్లలో సుప్రీంకోర్టులో కీలకమైన ఆర్టికల్ 370, వ్యభిచారం నేరం కాదు, ఎన్నికల బాండ్ల పథకం, ఈవీఎం-వీవీప్యాట్‌ల లెక్కింపు వంటి పలు కేసులకు సంబంధించి చారిత్రాత్మక తీర్పులలో భాగంగా ఉన్నారు.

9 మందికి జీవితఖైదు

(మొదటిపేజీ తరువాయి)

బాధితుల తరపు న్యాయవాదులు న్యాయస్థానాన్ని కోరారు. 2016-2018 మధ్య కాలంలో ఒక కళాశాల విద్యార్థిని సహా పలువురు మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసు ఇది. నిందితులు మహిళలను లైంగికంగా వేధించడమే కాకుండా వాటిని మొబైల్ ఫోన్‌లలో చిత్రీకరించారు. వాటిని ఉపయోగించి మహిళలను డబ్బు కోసం బ్లాక్ మెయిల్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసులో మొత్తం 9 మందిని పోలీసులు అరెస్టు చేశారు. తొలుత ఈ కేసును పొల్లాచి పోలీసులు విచారణ చేశారు. అనంతరం తమిళనాడు క్రైమ్ బ్రాంచ్- క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్‌కు బదిలీ చేశారు. ఆ తర్వాత సీబీఐకి బదిలీ చేశారు.

18న జాబ్ మేళా : లలిత్

విశాలాంధ్ర- సింగరేణి : ఈ నెల 18న సింగరేణి కమ్యూనిటీ హాల్ లో నిరుద్యోగ యువకులకు జాబ్ మేలా నిర్వహిస్తున్నామని సింగరేణి ఆర్జీ వన్ జి.ఎం.లలిత్ కుమార్ అన్నారు. మంగళవారం జి.ఎం కార్యాలయంలో జరిగిన మిలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గోదావరిఖని దాని పరిసర ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశములు కల్పించుటకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు మెగా జాబ్ మేళా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కే జాబ్ మేళాకు నోబుల్ ఎడ్యుకేషనల్ ఎంపవర్మెంట్ సొసైటీ హైదరాబాద్ సౌంయుక్త సౌజన్యంతో 100 కంపెనీలు ముందుకు వచ్చాయని అన్నారు. ఇందులో ఎంపికైన యువకులకు ఐటీ హార్డ్ వేర్, రిటైల్,హాస్పిటల్ డ్యూటీ,సెక్యూరిటీ జాబ్స్ హైదరాబాద్‌లో ఇవ్వడం జరుగుతుందన్నారు.అభ్యర్థులకు ఉండవలసిన కనీస అర్హతలు 7 తరగతి నుండి పోస్ట్ గ్రాడ్యుయేట్ వరకు, వయసు 18 నుండి 30 సంవత్సరాల లోపు ఉండాలన్నారు. పెద్దపెల్లి మంచిర్యాల జిల్లాలలో ఉన్న యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవాలని కోరారు. ఈ సమావేశంలో అధికారులు గోపాల్ సింగ్,కిరణ్ కుమార్‌లు పాల్గొన్నారు.

పార్టీ కార్యక్రమాలు విస్తరింప చేయాలి : నల్లు

విశాలాంధ్ర -జిల్లా బ్యూరో మహబూబాబాద్ : క్షేత్రస్థాయిలో సిపిఐ పార్టీ కార్యక్రమాలను విస్తరింప చేయడానికి ప్రజలకు అందుబాటులో ఉండి పోరాటాలు నిర్వహించాలని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నల్లు సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం సిపిఐ కొరివి గ్రామ శాఖ 9వ మహాసభ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ పేరుతో వామపక్ష భావజాలాన్ని తుడిచి పెట్టాలని, దుష్ట పన్నాగం మావోయిస్టులపై మిలిట్రీ దాడులు చేయడాన్ని వెంటనే ఆపాలని ఆయన అన్నారు. శాంతి భద్రతల సమస్యగా కాకుండా సామాజిక ఆర్థిక సమస్యగా భావించి చర్చల ద్వారానే మావోయిస్టుల సమస్యను పరిష్కరించాలని తెలిపారు.అయ్యగారి పల్లి లో ఈనెల 15 న జరిగే సిపిఐ కొరవి మండల తొమ్మిదవ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు.కొరవి గ్రామ శాఖ కార్యదర్శిగా తురక రమేష్ మూడవసారి ఏకగ్రీవంగా ఎన్నికకాగా సహాయ కార్యదర్శిగా కొనతం మహేష్ 9 మంది కమిటీ సభ్యులతో ఎన్నుకున్నారు.ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి కరణం రాజన్న, బుడమ వెంకన్న ,దూది కట్ల సారయ్య, కొనతం సత్యం, బొల్లం ఉప్పలయ్య ,నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు 'యువ వికాసం' యూనిట్స్ మంజూరు :కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో పెద్దపల్లి: అర్హులకు యువ వికాసం క్రింద స్వయం ఉపాధి యూనిట్ మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో రాజీవ్ యువ వికాసం పై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం కింద వచ్చిన దరఖాస్తుదారుల గతంలో ఏదైనా ఎన్.పి.ఏ ఉందా, వారి క్రెడిట్ హిస్టరీ పరిశీలించి అర్హులైన జాబితా బ్యాంకర్ల ద్వారా సేకరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. మే 14 వరకు ఎంపిడిఓలు మండలాల వారీగా బ్యాంకులో ఆమోదించిన అర్హుల జాబితా వివరాలను జిల్లా గ్రామీణ అభివృద్ధి గారికి సమర్పించాలని అన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా డిఆర్డిఓ అర్హుల జాబితా వివరాలను సంబంధిత ఎమ్మెల్యేలకు అప్పగించాలని, జిల్లా ఇంచార్జి మంత్రి వర్యుల ఆమోదంతో తుది జాబితా తయారు చేయడం జరుగుతుందని అన్నారు. రాజీవ్ యువ వికాసం తుది జాబితా ప్రకారం లబ్ధిదారుని పేరు మీద బ్యాంకు ఖాతా ప్రారంభించాలని, జూన్ 1 లోపల యువ వికాసం యూనిట్ మంజూరు పత్రాలు జారీ చేయాలని, రాష్ట్ర అవతరణ దినోత్సవం నుంచి యూనిట్ల గ్రౌండింగ్ పై శ్రద్ధ వహించాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం.కాళిందిని, జడ్పి సీఈఓ నరేందర్, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రంగారెడ్డి, లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకటేష్ , సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మనస్థాపంతో మహిళ ఆత్మహత్య

విశాలాంధ్ర పెనుబల్లి : తన కుమారుడు పెళ్లికి నిరాకరించాడని ఓ తల్లి ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన ఘటన పెనుబల్లి మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెనుబల్లి మండల కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన తోట అంజమ్మ(45) తన కుమారుడు తోట హరికృష్ణకు వివాహం చేయదలసి సంబంధాలు చూస్తుంది. తనకు ఇప్పుడే పెళ్లి వద్దని కరెంటు పనికి వెళ్తానని తల్లి అంజమ్మకు తెలిపాడు. పనికి వెళ్లకుండా తాను చూసిన సంబంధంతో వివాహం చేసుకోమని వారించింది. అయినా కుమారుడు పెళ్లి నిరాకరించడంతో మనస్థాపం చెందిన ఆమె సోమవారం మధ్యాహ్నం ఇంటిలో ఉన్న కొన్ని టాబ్లెట్లను మింగి స్పృహ కోల్పోయింది. స్పృహ తప్పి కింద పడిపోయి ఉన్న తల్లిని పెద్ద కుమారుడు వంశి, చిన్న కుమారుడు హరికృష్ణ హుటాహుటిన పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. సోమవారం రాత్రి చికిత్స పొందుతూ అంజమ్మ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై పెద్ద కుమారుడు తోట వంశీ వియ్యం బంజర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా ఎస్సై వెంకటేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

జ్యోతిర్మయికి ఉస్మానియా డాక్టరేట్

విశాలాంధ్ర - భద్రాచలం : భద్రాచలం డివిజన్‌కు చెందిన ఆది వాసీ బిడ్డ ఈసం జ్యోతి ర్మయి ఉస్మానియా యూని వర్సిటీలో ఫిజిక్స్ లో పిహెచ్డ్ చేసి డాక్టరేట్ పొందింది. మంగళవారం ఆమెను అభినందిస్తు బి సిఆర్ ట్రస్ట్ బాధ్యులు బండారు చంద్రరావు ఆధ్వర్యంలో ముఖ్య అతిథి డాక్టర్ పి. రాజశేఖర్ చేతుల మీదగా శాలువా కప్ , పుష్పగుచ్ఛం తో సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమానికి బిసిఆర్ ట్రస్ట్ కన్వీనర్ , బండారు శరత్ బాబు అధ్యక్షత వహించారు. డాక్టర్ పి. రాజశేఖర్ మాట్లాడుతూ జ్యోతిర్మయి ఫిజిక్స్ లో డాక్టరేట్ పొందటం భద్రాచలం ఏజెన్సీకే గర్వకారణమన్నారు. ఆమె భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరారు. వారి తల్లిదండ్రులను కూడా ఈ సందర్భంగా ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులు సంఘం నాయకులు రామ్మోహన్ రావు, కె ఎస్ ఎల్ వి ప్రసాద్, రాజబాబు తదితరులు పాల్గొని జ్యోతిర్మయకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు వైవి రామారావు, డి లక్ష్మి, కొలగాని రమేష్, ఎం లీలావతి, యు జ్యోతి, జీవనజ్యోతి, బిబిజి తిలక్, కోరాడ శ్రీనివాసరావు, ఎస్ భూపేందర్, ఎస్ అజయ్ కుమార్, కుంజా శ్రీనివాసరావు, ధనకొండ రాఘవయ్య, కే రవి ,తదితరులు పాల్గొన్నారు.

త్వరగా పనులు పూర్తి చేయాలి : భట్టి విక్రమార్క

విశాలాంధ్ర-మరిపెడ: గతేడాది వచ్చిన వరదల్లో ధ్వంసమైన వాటికి సంబంధించిన మరమ్మతు పనులకు టెండర్లు కాల్ చేయాలని, త్వరితగతిన పనులు పూర్తి అయ్యేలా చూడాలని రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచించారు. మంగళవారం మహబూబాబాద్ జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు హాజరైయ్యేందుకు వెళ్తూ 'భట్టి' మరిపెడ మండలంలోని అతిథిగృహంలో కాసేపు సేదతీరారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డా. జాటోతు రాంచంద్రునాయక్ డిప్యూటీ సీఎంను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి ఘన స్వాగతం పలికారు.అనంతరం నియోజకవర్గంలో గతేడాది వరద భీభత్సం వల్ల కలిగిన నష్టాన్ని విప్ రాంచంద్రునాయక్ వివరించగా ఆయన సానుకూలంగా స్పందించారు.వెంటనే ధ్వంసమైన రోడ్లు, చెరువులు, చెక్ డ్యాములు మరమ్మతులకు టెండర్లు కాల్ చేయాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా మరమ్మతు పనులు అధికారులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఉపముఖ్యమంత్రికి స్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులు భారీగా తరలి వచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీరారెడ్డి, పట్టణ అధ్యక్షుడు షేక్ తాజోద్దీన్, జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోతు

రవినాయక్, మూడు మండలాల ఇంచార్జీ కాలం రవీందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ పానుగోతు రాంలాల్, నాయకులు షేక్ అఫ్జల్, వీసారపు శ్రీపాల్ రెడ్డి, బోర గంగయ్య, గండి వీరభద్రం, కొండం దశరథం, గుండగాని వెంకన్న, రవికాంత్, యాకుబ్ పాషా, వల్లపు కొండయ్య, లింగయ్య, సోమ చంద్రయ్య, జాటోతు సురేష్, వాంకుడోత్ రవి, తదితరులు పాల్గొన్నారు.

విశ్వసుందరీమణుల సందర్శనకు సర్వం సిద్ధం

విశాలాంధ్ర -ములుగుజిల్లాబ్యూరో : 72వ మిస్‌వరల్డ్-2025 పోటీల్లో పాల్గొనేందుకు ప్రపంచం నలుమూలల నుంచి హైదరాబాద్ వచ్చిన సుందరిమణులు ఈనెల 14న సాయంత్రం 4:30కి ములుగు జిల్లా రామప్ప చారిత్రాత్మక ఆలయాన్ని సందర్శించనున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ములుగు జిల్లా కలెక్టర్ టిఎస్ దివాకర తెలిపారు. ఈ నెల 14న దాదాపు 35 మంది సుందరిమణులు హైదరాబాద్ నుంచి బయలుదేరి, ములుగులోని హరిత హోటల్ కు చేరుకుంటారని, అక్కడి నుండి సాంప్రదాయ వస్త్రాల్లో రామప్ప దేవాలయాన్ని సందర్శిస్తారని తెలిపారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలోని

సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షిస్తారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో చారిత్రాత్మక రామప్ప సంస్కృతిని వివరించే విధంగా, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు వివిధ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. తెలంగాణ జరూర్ ఆనా పేరుతో నిర్వహిస్తున్న ఈ సందర్శనలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు చేశామన్నారు. ఎటువంటి ఘటనలు జరగకుండా భారీ పోలీస్ బందోబస్తు ఉంటుందన్నారు. అధికారులంతా సమన్వయంతో వారికి కేటాయించిన పనులు పూర్తి చేశారన్నారు. సుందరీమణుల పర్యటన నేపథ్యంలో ఈ నెల 14న రామప్ప ఆలయానికి సందర్శకుల అనుమతి లేదన్నారు. భక్తులు ప్రజలు సహకరించాలని కోరారు. భద్రత దృష్ట్యా రామప్ప నుంచి ఐదు కిలోమీటర్ల వరకు డ్రోన్ కెమెరాలు ఎగురవేయడం పూర్తిగా నిషేధించామని అన్నారు. కార్యక్రమ విజయవంతానికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేసారు.

సంపద సృష్టించడం ప్రభుత్వ లక్ష్యం : మంత్రి

విశాలాంధ్ర బ్యూరో- సంగారెడ్డి : గ్రామాల మధ్య రోడ్ల అనుసంధానంతో గ్రామ స్థాయిలో సంపద సృష్టించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మాత్యులు దామోదరం రాజనర్సింహ అన్నారు. మంగళవారం సంగారెడ్డి నియోజక వర్గంలో రూ.90 కోట్లతో రహదారుల నిర్మాణానికి స్థానిక ఐ వి దగ్గర శంకుస్థాపన చేశారు. ఐబీ చౌరస్తా వద్ద ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను ప్రారంభించారు. పోతిరెడ్డిపల్లి (ఎన్ హెచ్ 65) రోడ్డు నుంచి భూలక్ష్మమ్మ, కలివేముల రోడ్డు, సదాశివపేట మండలం ఆత్మకూరు నుంచి సింగూరు వరకు, కొండాపూర్ మండలంలోని మరే పల్లి నుచి సీత్రంకుంటకు గల వివిధ బీటీ రోడ్డు నిర్మాణాలకు ఎంపీ రఘునందన్ రావు, జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, టీజీ ఐ ఐ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డిలతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ 15 గ్రామాల్లో రోడ్ల అనుసంధానంతో గ్రామస్థాయిలో సంపదను సృష్టించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సంగారెడ్డి నియోజకవర్గం అన్నివిధాలుగా అభివృద్ధి పరుస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి బలమైన రవాణా వ్యవస్థ అవసరం అని ఇందులో భాగంగా గ్రామాల మధ్య రోడ్లను అనుసంధానించడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో బలోపేతం అవుతుందని తెలిపారు. గ్రామాల మధ్య రోడ్ల నిర్మాణం ద్వారా వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్‌కు చేరువ అవడం, చిన్న పారిశ్రామిక యూనిట్ల స్థాపనకు అనుకూల వాతావరణం ఏర్పడటం, యువతకు ఉపాధి అవకాశాలు కలగడం వంటి పలు మార్గాల్లో సంపద సృష్టి జరుగుతుందనీ పేర్కొన్నారు.రహదారులు పూర్తయితే గ్రామాల మధ్య రవాణా వేగ వంతమవుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ

గ్రామాల మధ్య సరైన రవాణా మౌలిక సదుపాయాలు ఉంటే గ్రామీణ ప్రజల జీవనోపాధిలో గణనీయమైన మార్పు వస్తుందనీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టి జి ఐ ఐ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, సి డి సి రాంరెడ్డి, ఆర్డిఓ రవీందర్ రెడ్డి, నేషనల్ హైవే అథారిటీ అధికారులు, పంచాయతీరాజ్ శాఖ ఇంజనీరింగ్ అధికారులు,ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి : రామచంద్రనాయక్

విశాలాంధ్ర జిల్లా బ్యూరో మహబూబాబాద్: యువత వారి భవిష్యత్తు, దేశ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, జిల్లా వ్యాప్తంగా మాదకద్రవ్యాలపై ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ చేపట్టనున్న కార్యక్రమం అభినందనీయమని ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్ అన్నారు. మంగళవారం బయ్యారం మండలం లక్ష్మీ నరసింహపురం గ్రామంలో ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మానుకోట జిల్లా వ్యాప్తంగా చేపట్టనున్న మాదకద్రవ్యాలు, గుట్కా వ్యతిరేక కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను జిల్లా కలెక్టర్ అద్వైత్ సింగ్, జిల్లా ఎస్పి సుధీర్ రాంనాథ్ కేకన్‌తో కలిసి ఆవిష్కరించి జిల్లా వ్యాప్త కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామచంద్రనాయక్ మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు బానిసలై భౌతికంగా మానసికంగా క్షీణించి భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని, ఇది ఒక సామాజిక సమస్యగా దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ మరియు జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాల బానిసత్వంతో నేర ప్రవృత్తి పెరిగిపోవడంతో పాటు, చదువు ఉద్యోగం లాంటి లక్ష్యాలకు దూరమవుతున్నారని, మాదకద్రవ్యాల నిలువ, సరఫరా, రవాణా ప్రక్రియలో ఎవరైతే భాగస్వాములు అవుతారో వారికి కఠిన శిక్షలు ఉంటాయని

హెచ్చరించారు. మాదకద్రవ్యాలు మత్తుపదార్థాల వ్యతిరేక సదస్సుల నిర్వహణలో ప్రభుత్వ సహకారం తప్పనిసరిగా ఉంటుందని, మన జిల్లాను డ్రగ్స్, గుట్కారహిత జిల్లాగా మార్చడానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో మానుకోట శాసనసభ్యులు డాక్టర్ మురళి నాయక్, జిల్లా వ్యాప్త కార్యక్రమ రూపకర్త డాక్టర్ పరికిపండ్ల అశోక్, డిఎస్పి తిరుపతిరావు, భారతి చారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ ఆదెపు రాజేంద్రప్రసాద్ , ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సహజ తదితరులు పాల్గొన్నారు.

విత్తన విక్రయ కేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర-నల్లగొండ బ్యూరో : రైతులు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ఆగ్రో రైతు సేవా కేంద్రాలు, అధికృత డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. తక్కువ ధరకు ఆశపడి అనధికారిక డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దన్నారు. వ్యవసాయ సాగులో రైతులు ఇబ్బందులు పడకుండా ఉండా లన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం విత్తన కేంద్రాలను ఏర్పాటు చేసి రాయితీపై రైతులకు విత్తనాలను అందజేస్తున్నట్లు చెప్పారు. మంగళవారం ఆమె నల్గొండ జిల్లా కేంద్రంలోని క్లాక్ టవర్ వద్ద తెలంగాణ విత్తన సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విత్తన కేంద్రాన్ని ప్రారంభించి 50 శాతం సబ్సిడీ పై పచ్చిరొట్టె ఎరువుల విత్తనాల పంపిణీని ప్రారంభించారు. మీడియా ప్రతినిధులతో కలెక్టర్ మాట్లాడుతూ రైతులు కల్తీ విత్తనాలు కొని మోసపోకుండా తెలంగాణ విత్తన సంస్థ ద్వారా పంపిణీ చేసే విత్తనాలు కొనాలని చెప్పారు. వివిధ రకాల విత్తనాలు బ్లాక్ మార్కెట్లో అమ్మకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, రైతుల బయోమెట్రిక్ హాజరు తీసుకుని విత్తనాలను ఇవ్వడం జరుగు తుందని తెలిపారు. ముఖ్యంగా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన సన్న బియ్యం కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని, రానున్న వ్యవసాయ సీజన్లో సన్న బియ్యం విత్తనాలు ఎక్కువగా అవసరం అవుతాయని, ఈ డిమాండ్ ను దృష్టిలో ఉంచుకొని సన్న బియ్యం విత్తనాలను పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రైతులు తక్కువ ధరకు ఆశపడి నిబంధనలు లేని, నాణ్యత ప్రమాణాలు లేని విత్తనాలను కొనుగోలు చేసి మోసపోవద్దని కోరారు. తెలంగాణ విత్తన సంస్థ జారీ చేసిన విత్తనాలు మాత్రమే కొనుగోలు చేయాలని, ప్రత్యేకించి పత్తికి సంబంధించి అనుమతులు లేని లూజ్ విత్తనాలు కొనుగోలు చేయవద్దని కోరారు.రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై పత్తి విత్తనాల పాకెట్లు రూ.901 అమ్మడం జరుగుతున్నదని ,ఎవరైనా ఎక్కువ ధరకు అమ్మినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పత్తి విత్తనాలకు సంబంధించి ఏవైనా ఫిర్యాదులు ఉన్నట్లయితే 8977751452 నెంబర్ కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు అని తెలిపారు. మండల కేంద్రాలలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ఆగ్రో రైతు సేవా కేంద్రాల ద్వారా ఈ విత్తనాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు .రైతులు సంబంధిత వ్యవసాయ అధికారి ద్వారా ఆన్లైన్లో అనుమతులు తీసుకోవాలని ఆమె చెప్పారు. జిల్లా సహకార అధికారి పత్యా నాయక్,జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్ ,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్,డిసిసిబి డైరెక్టర్ సంపత్ రెడ్డి పాల్గొన్నారు.

సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ

విశాలాంధ్ర -ములుగుజిల్లాబ్యూరో : ములుగు జిల్లాకు నేడు మిస్ వరల్డ్ కంటెస్టెంట్ లు రామప్పకు, వస్తున్న నేపథ్యంలో, బందోబస్తుకు విచ్చేసినపోలీస్ అధికారులు, సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ పి.శబరీష్. ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం ములుగు జిల్లా కేంద్రంలో బందోబస్తు కోసం విచ్చేసిన అధికారులు, సిబ్బంది తో సమావేశంలో జిల్లా ఎస్పీ శబరిష్ మాట్లాడుతూ హోంగార్డు మొదలు పై స్థాయి అధికారి వరకు కంటెస్టెంట్ లు సందర్శించే అవకాశం ఉన్న ,ప్రతి ప్రదేశంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎవరికి వారు, వారికి వారి కేటాయించిన డ్యూటీ పాయింట్ లోనే ఉండాలని, ఎటువంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా, నిబద్ధతతో విధులు నిర్వహించాలని సూచించారు. బందోబస్తు విషయమై 1 అడిషనల్ ఎస్పీ, 1 ఏఎస్పీ, ఇద్దరు డిఎస్పి లు, 14 మంది సీఐలు, 43 మంది ఎస్ఐలు, 127 మంది ఏఎస్ఐ/హెచ్ సి లు 360 మంది కానిస్టేబుల్ లు, 160 మంది మహిళా కానిస్టేబు, 54 మంది హెూంగార్డులు, 113 మంది టీజీఎస్పీ కానిస్టేబుల్లు, 125 మంది స్పెషల్ పార్టీ కానిస్టేబుల్ లు మొత్తం వెయ్యి మంది అధికారులు, సిబ్బంది తో భారీగా బందోబస్తు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.ఎస్పీ తో పాటు అడిషనల్ ఎస్పి సదానందం, ఏటూరునాగారం ఏ ఎస్పీ శివం ఉపాధ్యాయ , డి సి ఆర్ బి డిఎస్పి కిషోర్ కుమార్,ములుగు డిఎస్పి రవీందర్, బందోబస్తుకు విచ్చేసిన సిఐలు, ఆర్ఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

శక్తి పంప్స్ గణనీయమైన వృద్ధి

విశాలాంధ్ర- హైదరాబాద్: శక్తి పంప్స్ (ఇండియా) లిమిటెడ్ మార్చి 31, 2025తో ముగిసిన త్రైమాసికం ఆర్థిక సంవత్సరానికి ఆర్థిక ఫలితాలను ప్రకటించిందని సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. శక్తి పంప్స్ (ఇండియా) లిమిటెడ్ చైర్మన్ దినేష్ పాటీదార్, కంపెనీ పనితీరుపై మాట్లాడుతూ 'అన్ని కీలక మెట్రిక్స్‌లలో గణనీయమైన వృద్ధితో గుర్తించబడిన ఎఫ్ వై 25 లో అద్భుతమైన ఆర్థిక పనితీరును నివేదించడం మాకు సంతోషంగా ఉందన్నారు. మేము మా అత్యధిక ఆదాయం రూ. 25,162 మిలియన్లు అని నివే దించా మన్నారు. ఈ ఆకట్టుకునే టాప్‌లైన్ వృద్ధి మా దేశీయ ఎగుమతి వ్యాపారాలలో బలమైన ప్రదర్శనల ద్వారా నడపబడిం దన్నారు. కార్యాచరణ సామర్థ్యాలపై మా అచంచలమైన దృష్టి ద్వారా లాభదాయకత మార్జిన్‌లు మరింత బలపడ్డాయన్నారు. స్వీకరించదగిన రోజులను తగ్గించే మా సామర్థ్యంలో మా ఆర్థిక వివేకం ప్రతిబింబిస్తుందన్నారు. ఎగుమతి వ్యాపారం బలమైన పనితీరును ప్రదర్శిస్తూనే ఉందన్నారు. మా ప్రస్తుత ఆర్డర్ బుక్ మహారాష్ట్ర, రాజస్థాన్ హర్యానా వంటి రాష్ట్రాల నుండి కొనసాగుతున్న ఇన్‌ఫ్లోలతో పాటు, మధ్యప్రదేశ్ పంజాబ్ వంటి వివిధ ఇతర రాష్ట్రాలలో ఆర్డర్‌ల కోసం మేము చురుకుగా బిడ్ చేసామన్నారు. ఈ రాష్ట్రాల్లో మా బలమైన ఉనికి మరియు మార్కెట్ వాటా గణనీయమైన కొత్త ఆర్డర్‌లను పొందేందుకు మాకు వీలు కల్పిస్తుందని మేము విశ్వసిస్తున్నామన్నారు. మా వ్యూహాత్మక కార్యక్రమాలు, బలమైన ఆర్డర్ బుక్ కార్యాచరణ శ్రేష్ఠతపై దృష్టి పెట్టడం రాబోయే సంవత్సరాల్లో మా వృద్ధి, విజయాన్ని నడిపిస్తాయన్నారు

దిశాంత్ భోజ్వానీకి గ్రాండ్ స్టీవీ అవార్డు

విశాలాంధ్ర/హైదరాబాద్: ఇన్‌టచ్ సీఎక్స్ గ్లోబల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ దిశాంత్ భోజ్వానీకి ప్రతిష్టాత్మక గ్రాండ్ స్టీవీ అవార్డు లభించింది. ప్రపంచవ్యాప్తంగా కస్టమర్ కేర్, టెక్నాలజీ సంస్థ ఇన్టచ్ సీఎక్స్ గొప్ప బ్రాండ్లను ముందుకు నడిపిస్తుందని మరోసారి రుజువు చేసింది. ఈ సంస్థ 2025 ఆసియా - పసిఫిక్ స్టీవీ అవార్డులలో 12 పురస్కారాలు గెలుచుకుంది. ముఖ్యంగా కస్టమర్ సర్వీస్ లీడర్‌షిప్ విభాగంలో ప్రతిష్టాత్మకమైన గ్రాండ్ స్టీవీ అవార్డు అందుకుంది. ఈ అవార్డును ఇన్టచ్ సీఎక్స్ గ్లోబల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ దిశాంత్ భోజ్వానీ అందుకున్నారు. ఆయనకు క్రింది పురస్కారాలు కూడా లభించాయి. గోల్డ్ స్టీవీ - మోస్ట్ ఇన్నోవేటివ్ కస్టమర్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్ ఆఫ్ ది ఇయర్, సిల్వర్ స్టీవీ - మోస్ట్ ఇన్నోవేటివ్ లీడర్ ఆఫ్ ది ఇయర్, సిల్వర్ స్టీవీ - మోస్ట్ ఇన్నోవేటివ్ థాట్ లీడర్ ఆఫ్ ది ఇయర్ అవార్డులు కూడా దక్కాయి. భారతదేశం నుంచి అత్యధిక స్కోరు సాధించిన నామినేషన్‌గా గుర్తింపు పొందింది. దీంతో దిశాంత్ భోజ్వానీకి గ్రాండ్ స్టీవీ లభించింది. ఈ సందర్భంగా దిశాంత్ భోజ్వానీ మాట్లాడుతూ ఈ అవార్డు రావడంపై ఎంతో సంతోషంగా ఉందన్నారు.

బజాజ్ గోగోను విడుదల చేసిన బజాజ్ ఆటో

విశాలాంధ్ర/హైదరాబాద్: ప్రపంచంలోనే అత్యంత విలువైన 2-వీలర్, 3-వీలర్ కంపెనీ అయిన బజాజ్ ఆటో లిమిటెడ్‌కు తమ గోగో వాహన విడుదలకు అత్యంత అనువైన నేపథ్యాన్ని హైదరాబాద్ అందించింది. దేశంలో అత్యంత కీలకమైన నగరంలో పట్టణ చలనశీలత భవిష్యత్తును పరిచయం చేసింది. 'గోగో' పేరు డ్రైవర్లు తమ మూడు చక్రాల చక్ర వాహనాలతో ఉన్న ప్రేమపూర్వక అనుబంధం, ప్రపంచవ్యాప్తంగా వినియోగదారులు మూడు చక్రాల వాహనాలను ఎలా పిలుస్తారో అనే అంశం నుండి ఇది ప్రేరణ పొందింది. వీటిని హైదరాబాద్‌లోని ఒక హెూటల్ లో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రవాణా , బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, బజాజ్ ఆటో లిమిటెడ్ ఇంట్రాసిటీ బిజినెస్ యూనిట్ అధ్యక్షుడు సమర్దీప్ సుబంధ్, వినాయక బజాజ్ మేనేజింగ్ డైరెక్టర్ కె వి బాబుల్ రెడ్డి విడుదల చేశారు. ప్యాసింజర్ వాహనాలు పీ5009 మోడల్ రూ.3,26,797కు, పీ7012, రూ.3,83,004కు లభిస్తుంది. భారతదేశ వ్యాప్తంగా అన్ని బజాజ్ ఆటో డీలర్‌షిప్‌లలో బుకింగ్‌లు ప్రారంభమయ్యాయి.

ఇండియాలో చిన్న వ్యాపారులకు మెరుగైన ఔట్‌లుక్

న్యూఢిల్లీ : ప్రపంచంలో పెద్ద అకౌంటింగ్ బాడీ అయిన సిపిఏ ఆస్ట్రేలియా నిర్వహించిన 16వ ఆసియా పసిఫిక్ చిన్న వ్యాపారుల సర్వే ప్రకారం ఇండియా చిన్న బిజినెస్ విభాగం అనేది ఆసియా పసిఫిక్ ప్రాంతంలో సానుకూల, డైనమిక్ ఎదుగుదలని అందిస్తుంది. ఇండియా సర్వే ఫలితాలు 78 శాతం భారత దేశంలో ఉన్న చిన్న వ్యాపారులను గత సంవత్సరం మెరుగుపరిచింది. అది దేశం బలమైన, ప్యాండమిక్ తరువాత రికవరీని చూపిస్తుంది. ప్రఫుల్లా చాజెడ్ సిపిఏ ఆస్ట్రేలియాలో ఒక సర్టిఫై చేసిన, అభ్యాసంలో ఉన్న అకౌంటెంట్. అతనికి ఇండియాలో 30 సంవత్సరాల ఎకౌంటింగ్, ఫినాన్స్ అనుభవం ఉంది. అతను ఈ ప్రేరణని ఉత్తేజితమైన వ్యాపార పర్యావరణం నడుపుతుంది. ఆధునీకరణ, వేగవంతమైన డిజిటల్ మార్పు మీద ఉందని అన్నారు.

మహిళలకు మిర్రోర్ సీనియర్ మిలీ డైలీ సప్లిమెంట్

ముంబయి: మహిళల ఆరోగ్యం, వెల్నెస్‌లో అగ్రగామిగా ఉన్న మిర్రోర్, మిర్రోర్ బ్లిస్, మిర్రోర్ రివైవ్ విజయం తర్వాత దాని మూడవ ఫ్లాగ్‌షిప్ ఉత్పత్తి అయిన మామ్ ఐ లవ్ యు (మిలీ - ఎంఐఎల్‌వై)ను ప్రారంభించినట్లు ప్రకటించింది. మిలీ అనేది 65 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న మహిళల కోసం ప్రత్యేకంగా రూపొందించబడిన డైలీ సప్లిమెంట్, ఇది స్వర్ణ సంవత్సరాల్లో కీళ్ల సౌకర్యం, జ్ఞాపకశక్తి, శక్తి స్థాయిలు, ఎముక బలానికి మద్దతు ఇవ్వడానికి క్లినికల్‌గా మద్దతు ఇచ్చే పోషకాలతో పురాతన మూలికా జ్ఞానాన్ని మిళితం చేస్తుంది. దీర్ఘాయువు పెరుగుతున్నప్పటికీ జీవన నాణ్యత తరచుగా వెనుకబడి ఉన్న ప్రపంచంలో, మిలీ 65 ఏళ్లు పైబడిన మహిళలకు గేమ్ ఛేంజర్‌గా అడుగు పెడుతుంది. 20 ముఖ్యమైన పదార్థాలతో నిపుణులతో రూపొందించబడిన మిలీ, సీనియర్ మహిళలు కదలడానికి, ఆలోచించడానికి, మరింత సులభంగా జీవించడానికి శక్తినిచ్చేలా రూపొందింది. అశ్వగంధ, బ్రాహ్మి, త్రిఫల వంటి ప్రకృతి శక్తివంతమైన వృక్షశాస్త్రాలను కాల్షియం సిట్రేట్, మెగ్నీషియం గ్లైసినేట్ వంటి శాస్త్రీయంగా నిరూపితమైన పోషకాలతో కలిపి, మిలీ ఎముక ఆరోగ్యం, కండరాల శక్తి, అభిజ్ఞా పదును, రోజువారీ శక్తికి సమగ్ర మద్దతును అందిస్తుంది.

ఒప్పో ఎఫ్29 సిరీస్ అమ్మకాల వృద్ధి 28%

ముంబయి : ఒప్పో ఇండియా కొత్తగా విడుదల చేసిన ఎఫ్29 సిరీస్ అద్భుతంగా విజయంతమైందని కంపెనీ ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్‌లో మొదటి 21 రోజుల అమ్మకాల కాలంలో, ఎఫ్29 సిరీస్ ఒప్పో ఎఫ్ 27 ప్రో ప్లస్ కంటే 28% అమ్మకాల వృద్ధిని సాధించింది. ఇది ఈ ప్రాంతంలో దాని పెరుగుతున్న ప్రజాదరణ, బలమైన డిమాండ్‌ను నొక్కి చెబుతుంది. ఒప్పో ఎఫ్29 సిరీస్‌ను భారతదేశం కోసం, కఠినమైన సవాళ్లను అధిగమించేలా తయారు చేశారు. ఒప్పో ఎఫ్29 సిరీస్ భారతదేశ పెరుగుతున్న గిగ్ ఎకానమీని దృష్టిలో ఉంచుకుని తయారు చేశారు. డ్రైవర్లు, డెలివరీ భాగస్వాములు, హెూం-సర్వీస్ నిపుణులు, చిన్న వ్యాపార యజమానులకు ఇది తోడుగా ఉంటుంది. మిలిటరీ-గ్రేడ్ దృఢత్వం, అధునాతన కనెక్టివిటీ, దీర్ఘకాలిక బ్యాటరీ శక్తిని కలిపి, ఎఫ్29 సిరీస్ సన్నని, స్టైలిష్ డిజైన్‌లో ఏదైనా సవాలును స్వీకరించేలా తయారు చేశారు. ఒప్పో ఎఫ్29 సిరీస్ నెట్‌వర్క్ కనెక్టివిటీలో కూడా కొత్త బెంచ్‌మార్క్‌ను సెట్ చేసిందని, పరీక్ష ఆధారంగా జియో ధృవీకరించింది. ఈ సిరీస్ రూ.20 వేలు- 30 వేలు ధరల విభాగంలో నెట్‌వర్క్ కోసం ఉత్తమ పరికరాల్లో ఒకటిగా నిలిచింది.

ఆసియా పవర్‌లిఫ్టింగ్‌లో కెఎల్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ విద్యార్థుల ప్రతిభ

హైదరాబాద్: భారతదేశంలోని ఉత్తరాఖండ్‌రాష్ట్రం డెహ్రాడూన్‌లో 2025 మే 5 నుండి 12 వరకు జరిగిన ఆసియా జూనియర్ ఉమెన్ ఎక్విప్డ్, క్లాసిక్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లతో పాటు ఆసియా యూనివర్సిటీ పవర్‌లిఫ్టింగ్ కప్‌లో తమ విద్యార్థుల అత్యుత్తమ విజయాలను కెఎల్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ (కెఎల్‌ఈఎఫ్) వేడుక జరుపుకుంది. అసాధారణ శక్తి , దృఢ సంకల్పం మరియు క్రమశిక్షణను ప్రదర్శిస్తూ, కెఎల్‌ఈఎఫ్ నుండి ముగ్గురు విద్యార్థి-అథ్లెట్లు అంతర్జాతీయ వేదికపై వివిధ విభాగాలలో బహుళ బంగారు పతకాలను గెలుచుకున్నారు, ఇది విశ్వవిద్యాలయానికి మరియు దేశానికి అపారమైన కీర్తిని తెచ్చిపెట్టింది. 84 కిలోల విభాగంలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న బిబిఏ విద్యార్థిని షేక్ షబీనా, మే 10, 2025న జరిగిన ఆసియన్ జూనియర్ ఉమెన్ ఎక్విప్డ్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ 2025లో ప్రశంసనీయమైన ప్రదర్శన ఇచ్చింది.

టిబి రోగులకు గ్రాన్యూల్స్ మద్దతు

భద్రాద్రి కొత్తగూడెం: ప్రముఖ ఔషధ సంస్థ గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్, తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 1,030 మంది క్షయ (టిబి) రోగులకు మద్దతు ఇవ్వడానికి ఈరోజు తమ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో భాగంగా , టిబి రోగులకు ఆరు నెలల పాటు పోషకాహార కిట్లను అందించడానికి కంపెనీ కట్టుబడి ఉంది. ఈ ప్రాజెక్ట్ పరిధిలో భాగంగా మొత్తం 6,180 కిట్లను పంపిణీ చేయనుంది . ప్రతి పోషకాహార కిట్‌లో బియ్యం, చిరు ధాన్యాలు, వంట నూనె , వేరుశనగలు మరియు ఇతర ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలు ఉంటాయి. ఈ కార్యక్రమం, 2025 నాటికి టిబిని నిర్మూలించే లక్ష్యంతో భారత ప్రభుత్వం ప్రారంభించిన జాతీయ కార్యక్రమమైన ప్రధాన మంత్రి టిబి ముక్త్ భారత్ అభియాన్‌లో భాగం. భారత ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ వద్ద నిక్షయ్ మిత్రగా గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్ నమోదు చేయబడింది.

అసుస్ ఆర్ఓజి ఆవిష్కరణలు జెఫైరస్, స్ట్రిక్స్ ల్యాప్‌టాప్‌లు

న్యూఢిల్లీ: భారతదేశపు నంబర్ 1 గేమింగ్ బ్రాండ్ అయిన అసుస్ ఇండియా, రిపబ్లిక్ ఆఫ్ గేమర్స్ (ఆర్ఓజి), ఎన్విడియ ఆర్టిఎక్స్ 5000 సిరీస్ తో శక్తివంతమైన దాని 2025 ఆర్ఓజి ల్యాప్‌టాప్ శ్రేణి మంగళవారం నుండి భారత మార్కెట్‌లో అందుబాటులో ఉందని వెల్లడించింది. ఈ నెల ప్రారంభంలో ఆవిష్కరించబడిన కొత్త శ్రేణిలో అధిక-పనితీరు గల ఆర్ఓజి స్ట్రిక్స్ స్కార్ 16/18, స్ట్రిక్స్ జి 16, జెఫైరస్ జి 16, జెఫైరస్ జి 14, కన్వర్టిబుల్ ఫ్లో జెడ్ 13 ఉన్నాయి, ఇవన్నీ గేమర్‌లు, క్రియేటర్ల కోసం రూపొందించిన అత్యాధునిక పనితీరు, అధునాతన శీతలీకరణ, ఏఐ -శక్తివంతమైన సామర్థ్యాలను అందించడానికి రూపొందించబడ్డాయి. కొత్త శ్రేణి గేమింగ్ ఔత్సాహికులు, సాధారణ గేమర్‌లు మరియు నిపుణులకు తమ శైలికి అనుగుణంగా వివిధ రకాల వ్యక్తిగతీకరించిన ఎంపికలను అందిస్తుంది.

సంపాదకీయం

కేంద్రం మౌనం ఎందుకు?

భారత్, పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణను ప్రకటించినందుకు విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీని లక్ష్యంగా చేసుకొని కొందరు సామాజిక మాధ్యమాల ద్వారా విపరీతంగా ట్రోలింగ్ చేయడం, బెదిరించడం ప్రారంభించారు. దీన్ని ప్రధాన పార్టీలన్నీ ఖండించాయి. ప్రజాస్వామ్యయుత దేశంలో ఉన్న మనం ఈ రకంగా ఓ అత్యున్నత స్థాయిలో ఉన్న వ్యక్తిని, కీలక ఆపరేషన్ సంబంధించిన వివరాలను వెల్లడించిన క్రమంలో విమర్శించడం తగదంటూ ఇది చాలా బాధాకరం... మనం ఏమైనా ఆటవిక రాజ్యంలో ఉన్నామా? అని ప్రశ్నించాయి. పాక్‌తో కాల్పుల విరమణ ఒప్పందం కేంద్రప్రభుత్వం నిర్ణయమైనప్పుడు సామాజిక మాధ్యమాల్లో మిస్రీని తప్పుబట్టాల్సిన అవసరం ఏమీలేదు. కానీ, కాషాయిమూకలు రెచ్చిపోతున్నా ప్రభుత్వ పెద్దలు అదుపు చేయకపోవడం విచారకరం. పహల్గాం ఉగ్ర దాడిలో మరణించిన లెఫ్టినెంట్ కల్నల్ వినయ్ నర్వాల్ భార్య హిమాన్షి నర్వాల్‌పై కూడా ఇలాగే ఆన్‌లైన్ ట్రోలింగ్ జరిగిన విషయం తెలిసిందే. భారత్, పాకిస్థాన్ మధ్య తీవ్ర ఘర్షణ జరుగుతున్న సమయంలో విక్రమ్ మిస్రీ ప్రదర్శించిన పనితీరు తప్పుపట్టలేనిది. భారత్ గొంతును వినిపించేందుకు ఆయన చాలా కష్టపడ్డారు. అంకితభావం కలిగిన దౌత్యవేత్త అయిన మిస్రీ మన దేశానికి వృత్తి నైపుణ్యం, దృఢ సంకల్పంతో సేవ చేశారు. అలాంటి అధికారిని ఎందుకు ట్రోల్ చేస్తున్నారో కమలనాథులకే తెలియాలి. మిస్రీపై విమర్శలు చేస్తున్నవారు ఆయన కంటే భిన్నంగా, మెరుగ్గా చేయగలరేమో! మిస్రీకి కేంద్ర సర్కారు బాసటగా నిలబడకపోవడం, ఆయన గౌరవాన్ని కాపాడటానికి ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం గర్హనీయం. "ఉగ్రవాదులు భారతదేశాన్ని మత ప్రాతిపదికన విభజించాలని కోరుకుంటున్నారు. భారతదేశ ప్రజలు ఐక్యతతో ఓడించారు" అని చెప్పినందుకు మిస్రీని లక్ష్యంగా చేసుకోవడం అత్యంత విచారకరం. భారత్ తరఫున మిస్రీ ప్రకటన చేసిన మరుక్షణం నుంచే ఆయనపై సామాజిక మాధ్యమాల్లో దూషణల పర్వం మొదలైంది. అనేకమంది బీజేపీ అభిమానులు ఆయన దేశభక్తిని ప్రశ్నించారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం మౌనంగా ఉండడం విమర్శలకు తావిస్తోంది. మిస్రీ ఏమీ సామాన్య వ్యక్తి కాదు, ఆయనో ఉన్నత స్థాయి అధికారి. ఆయనకే రక్షణ లేనప్పుడు ఇక ఎవరికైనా ఉంటుందని ఎలా అనుకోగలం! పాకిస్థాన్‌తో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నప్పటి నుంచి ఈ నెల 10వ తేదీ సాయంత్రం ఆకస్మికంగా కాల్పుల విరమణ ప్రకటించే వరకు మిస్రీ ప్రతిరోజు మీడియా ముందుకు వచ్చారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలను, మన సైన్యం చేపట్టిన చర్యల గురించి మీడియా ద్వారా ప్రజలకు తెలియజేశారు. భారత్-పాక్ కాల్పుల విరమణ గురించి భారత్ తరఫున విక్రమ్ మిస్రీ అధికారికంగా ధ్రువీకరిస్తూ ప్రకటన చేశారు. ఆ మరుక్షణం నుంచే ఆయనపై ట్రోలింగ్, బెదిరింపులు మొదలయ్యాయి. అక్కడితో ఆగకుండా సోషల్ మీడియా వేదికగా ఆయన కుటుంబ సభ్యులను కూడా పరుష పదజాలంతో దూషిస్తూ పోస్టులు పెట్టడం ప్రారంభించారు. కుట్రదారు, దేశద్రోహి అంటూ ఆయనపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇంకొంత మంది మరికొంచెం ముందుకు వెళ్లి మిస్రీ కుమార్తె పౌరసత్వాన్ని ప్రశ్నిస్తూ పోస్టులు పెట్టారు. ఆమెకు సంబంధించిన వ్యక్తిగత వివరాలను సోషల్ మీడియా వేదికలపై పోస్ట్ చేయడం మనుషులు చేసే పనికాదు. ఇది ముమ్మాటికి వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించే బాధ్యతారహిత చర్యే. ఈ విషయమై మోదీ ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉంటోందో అంతుబట్టడంలేదు. భారత ప్రభుత్వం తీసుకున్న వైఖరిని మాత్రమే విదేశాంగ కార్యదర్శి వెల్లడించినప్పటికీ ఆయనను ట్రోల్ చేయడం అత్యంత విచారకరం. ప్రభుత్వ నిర్ణయానికి అధికారులను బలిచేయడం ఇంతకుముందు ఎన్నడూ కనీవిని ఎరగం. ప్రభుత్వం లేదా రాజకీయ నాయకత్వం తీసుకున్న నిర్ణయాన్ని ప్రకటించినందుకు ఆయనను తప్పుపట్టడం ఏమాత్రం సమర్థనీయంకాదు. దేశం కోసం నిరంతరం శ్రమించే దౌత్యవేత్తను లక్ష్యంగా చేసుకుని బీజేపీ అభిమానులు అనేకమంది విపరీతంగా ట్రోల్ చేయడం, ఆయన దేశభక్తిని ప్రశ్నించడంలో ఏమాత్రం అర్థంలేదు. కేంద్రంలో మోదీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం అనుసరిస్తున్న విద్వేష రాజకీయాలే ఈ పరిస్థితికి దారి తీశాయనడంలో ఇసుమంతైనా అనుమానంలేదు. నిస్సందేహంగా ప్రభుత్వం రెచ్చగొడుతున్న దూకుడుతో కూడిన జాతీయవాదం ఫలితమే ఇది. దూకుడుతో కూడిన జాతీయవాద భావాలను రెచ్చగొట్టే వ్యక్తులు అడ్డూ అదుపు లేకుండా చేసే ఇలాంటి దూషణలతో కూడిన ట్రోలింగ్‌ను ఎదుర్కొంటున్న మిస్రీ తన ఎక్స్ ప్రొఫైల్‌ను నిలిపివేయాల్సి వచ్చింది. కేవలం ప్రభుత్వ విధానాలకు కట్టుబడినందుకు ఎదురయ్యే దూషణ ఛీత్కారాలను తప్పించుకునేందుకు దేశంలోనే అత్యంత సీనియర్ అయిన దౌత్యవేత్త ఇలా డిజిటల్ వేదికను నిలిపివేయడం అనూహ్యమైన, ఆందోళన కలిగించే విషయం. కాషాయమూకల ఈ చర్యలు ఎలాంటి భయం, బెదిరింపులు లేకుండా విధులు నిర్వహించుకునేందుకు ఉద్యోగులకు గల అవకాశాలు వేగంగా కుంచించుకుపోతుండడం గురించి ఒక దుష్ట సంకేతాన్ని పంపిస్తున్నాయని ప్రజాస్వామ్య హితైషులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంలో మిస్రీకి వామపక్షాలు బాసటగా నిలిచాయి. నిర్ణయం కేంద్రప్రభుత్వానిది అయినప్పుడు సామాజిక మాధ్యమాల్లో మిస్రీని తప్పుబట్టాల్సిన అవసరమేమిటని ప్రశ్నించాయి. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం ఎందుకు మౌనం వహిస్తోందని నిలదీశాయి. ఈ ట్రోలింగ్‌లు, బెదిరింపులతో మన ఐక్యత, ప్రజాస్వామ్యాన్ని ఎవరు ద్వేషిస్తారో స్పష్టమైందని పేర్కొన్నాయి. ప్రధాని తీసుకున్న నిర్ణయానికి మిస్రీని ఎందుకు ట్రోల్ చేస్తారు? ఉగ్రవాదుల, మతోన్మాద కుట్రను భగ్నం చేసినందుకు భారత ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేసినందుకా అన్న వామపక్ష నాయకుల ప్రశ్నలకు మిస్రీని ట్రోల్ చేసేవారు, కాషాయపార్టీ నేతలు సమాధానం ఇవ్వాల్సిన అవసరముంది. మిస్రీపై ట్రోలింగ్‌కు పాల్పడిన వారిపై చర్యలు తీసుకునేందుకు మోదీ సర్కారు ఆసక్తి చూపించకపోవడాన్ని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ తప్పుపట్టారు. నిర్ణయాలు ప్రభుత్వాలు మాత్రమే తీసుకుంటాయనీ, అధికారులు వ్యక్తిగత నిర్ణయాలు తీసుకోలేరనీ, ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను ప్రజలకు చేర్చే సంధానకర్తలు మాత్రమేనని అందరూ గుర్తించాలి. నిజాయితీగా విధులు నిర్వర్తిస్తున్న పౌర సేవకులపై వ్యక్తిగతంగా ఇలాంటి ట్రోల్స్ చేయడం విచారకరం. ఎటువంటి కారణంలేకుండా, హద్దులు దాటి దూషణలకు పాల్పడడం సరికాదు. ద్వేషంతో విషపూరితంగా చేసే వ్యాఖ్యలు ఇకనైనా ఆగిపోవాలి. మన దౌత్యవేత్తలకు భరోసా కల్పించేందుకు వారికి మనమంతా అండగా నిలబడాలి. ప్రధాని నరేంద్ర మోదీ ఇకనైనా మౌనం వీడి ఈ విషయమై మాట్లాడి, సమస్యను పరిష్కరిస్తారని ఆశిద్దాం.

ఆయుధ మార్కెట్లో చెలరేగుతున్న ప్రచార యుద్ధం !

డి. సోమసుందర్

భారత్ - పాక్ దేశాల మధ్య సరిహద్దుల్లో కొనసాగుతున్న కాల్పులు, సైనిక చర్యలు నిలిపివేస్తున్నట్లు మే పదో తేదీ సాయంత్రం రెండు దేశాల నుంచి అధికారిక ప్రకటనలు చేశాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎక్స్ వేదికగా 10 వ తేదీ సాయంత్రం 5.33 నిముషాలకు చేసిన పోస్టు ద్వారా ఈ విషయం ముందుగా వెల్లడి అయింది. "అమెరికా మధ్యవర్తిత్వంతో ఉభయదేశాలు ఇందుకు అంగీకరించాయి" అంటూ డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. అమెరికా విదేశాంగ మంత్రి రూబియో మార్కో కూడా 10 వ తేదీ సాయంత్రం 5.37 నిముషాలకు కాల్పుల విరమణ సంగతిని ట్వీట్ చేశారు. అందుకోసం అమెరికా 48 గంటలపాటు చేసిన దౌత్య కృషి గురించి ఆయన ప్రస్తావించారు. ఆ తర్వాత భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ మీడియా సమావేశంలో కాల్పుల నిలిపివేత ప్రకటన చేశారు. సాయంత్రం 3.15 గంటలకు పాకిస్థాన్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ నుంచి కాల్పుల నిలిపివేత ప్రతిపాదన వచ్చిందని, దానికి భారత్ అంగీకరించిందని విక్రమ్ మిస్రీ వెల్లడించారు. "కాల్పుల నిలిపివేత రెండు దేశాలు తీసుకున్న నిర్ణయం" అంటూ విదేశాంగశాఖ ట్వీట్ కూడా చేసింది.

అమెరికా మధ్యవర్తిత్వం గురించిన ప్రస్తావనే లేకుండా భారత ప్రభుత్వ ప్రకటన ఉండటం ఆశ్చర్యం కలిగించక మానదు. ట్రంప్ ఒత్తిడి మేరకు కాల్పులు నిలిపివేశారంటూ మోదీపై రాగల విమర్శలకు ఆస్కారం లేకుండా తీసుకున్న జాగ్రత్త అనుకోవాలి! ఇంత అకస్మాత్తుగా కాల్పుల నిలిపివేత వెనుక జరిగిందేమిటో మనకు అధికారికంగా ఏమీ తెలియదు. మన ప్రభుత్వం ఏమీ చెప్పలేదు. మీడియా కూడా ఏమీ చెప్పలేదు. కానీ అంతర్జాతీయ మీడియా సంస్థలు, సైనిక, ఆయుధ, రక్షణ, వ్యవహారాలపై విశ్లేషించే చానళ్ల మాత్రం మనకు తెలియని అంశాలను చర్చిస్తున్నాయి. రెండు దేశాల మధ్య చర్చలకు దారితీసిన పరిణామాల క్రమాన్ని కూడా అవి వెల్లడిస్తున్నాయి. మే 6 వ తేదీ రాత్రి భారత్ చేపట్టిన "ఆపరేషన్ సిందూర్" లో పాక్‌లోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై జరిగిన దాడులు, అక్కడి నష్టాలు, ఉగ్రవాదుల ప్రాణనష్టాల గురించి భారత్ అధికార ప్రతినిధులు మీడియా సమావేశంలో మే 7 వ తేదీన వివరించారు. అదే రోజు మీడియాతో మాట్లాడిన పాక్ అధికారులు భారత్‌కు చెందిన ఐదు జెట్ విమానాలను తాము కూల్చి వేసినట్లు చెప్పారు. అందులో మూడు రాఫెల్ జెట్ విమానాలు, ఒక సుఖోయ్, ఒక మిగ్ 29 ఉన్నాయని పాక్ పేర్కొంది. దాన్ని భారత్ ఇప్పటి వరకూ ధృవీకరించలేదు. అలాగని నిరాకరించలేదు.

మే 7 వ తేదీన రాయిటర్ వార్తాసంస్థ, సీఎన్ఎన్ ఛానెల్ పాకిస్థాన్ చేసిన ప్రకటనను పాక్షికంగా ధృవీకరించాయి. మే 7 వ తేదీ ఉదయం పంజాబ్ రాష్ట్రం భటిండా సమీపంలోని అక్లియా కుర్ద్ గ్రామం సమీపంలో పొలాల్లో కూలిన విమాన శకలాలు కనిపించాయని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ఒక వార్తా కథనాన్ని ఫోటోలతో ప్రచురించింది. మీడియా సమావేశంలో వీటిపై ప్రశ్నించిన సందర్భంలో భారత్ అధికార ప్రతినిధులు సరైన సమయంలో వాటి గురించి స్పందిస్తామని చెప్పారే తప్ప వార్తలను తోసిపుచ్చలేదు. ఆ తర్వాత పేరు చెప్పడానికి ఇష్టపడని అమెరికా మిలిటరీ ఉన్నతాధికారులు భారత్‌కు చెందిన రెండు రాఫెల్ జెట్ విమానాలు కూలిపోయాయని చెప్పినట్లు రాయిటర్ పేర్కొన్నది. కూలిన విమాన శకలాల ఫోటోలు, వీడియోలు, అంతర్జాతీయ మీడియాలో విస్తృతంగా వ్యాప్తిలోకి వెళ్లాయి. ఆ ఫోటోలను బట్టి అందులో ఒకటి భారత్‌కు చెందిన రాఫెల్ జెట్ విమానం అని తేటతెల్లం అయ్యింది. సంఖ్య విషయంలో తేడా ఉన్నప్పటికీ కనీసం ఒక్కటైనా విమానం కూలిందన్న సమాచారం విషయంలో అన్ని సంస్థల వార్తల్లో ఏకాభిప్రాయం కనిపించింది. పంజాబ్ రాష్ట్రం హోషియార్‌పూర్ సమీపంలో పీఎల్ 15 క్షిపణి శిథిలాలు

> 'భారత్-పాక్ ఉద్రిక్తతలు, సైనిక చర్యలు వారి సొంత వ్యవహారం మాకేమీ సంబంధం లేదు" అంటూ మాట్లాడిన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉపాధ్యక్షుడు జేడి వాన్స్ ఒక్క రోజులోనే మాట మార్చి 8 వ తేదీ రాత్రి నుంచే సంప్రదింపుల ప్రక్రియకు శ్రీకారం చుట్టారా? ఇవన్నీ ప్రశ్నలు! సమాధానాల కోసం కొంతకాలం వేచి చూడాల్సిందే.

దొరికాయని ఏఎన్ఐ వార్తా సంస్థ, టైమ్స్ ఆఫ్ ఇండియా వార్తలను ప్రచురించాయి. అది చైనా తయారీ క్షిపణి అనే సంగతి తెలిసిందే. బీజేపీ ఐటి సెల్ అధిపతి అమిత్ మాలవీయ దీనిపై ఒక పోస్ట్ చేశారు. "చెక్కు చెదరని స్థితిలో ఉన్న పీఎల్ 15 క్షిపణి" లభించింది, దాన్ని పాక్ వాయు సైన్యం ప్రయోగించినట్లు తెలుస్తూనే ఉంది, అయితే అది పేలడంలో విఫలం అయ్యింది" అని అమిత్ మాలవీయ వ్యాఖ్యానించారు. "చైనా సరుకు" ఇలాగే ఉంటుందని అమిత్ మాలవీయ భక్తులు సోషల్ మీడియాలో దీన్ని వైరల్ చేశారు. ఆ తర్వాత అల్ జజీరా, బీబీసీ, స్కై , సీఎన్ఎన్., టీఆర్‌టీ వరల్డ్, డోయిచ్ వెలె (డీడబ్ల్యూ) లాంటి వార్తా సంస్థలు కూలిన విమాన శకలాల గురించి తమ రిపోర్టింగ్‌లో ప్రస్తావిస్తూనే వచ్చాయి.

మే 7 వ తేదీ సాయంత్రమే అంటే సైనిక చర్యలు ప్రారంభం అయిన 24 గంటల లోపుగానే భారత భద్రతా సలహాదారు అజిత్ దోబాల్, పాక్ భద్రతా సలహాదారు లెఫ్టినెంట్ ఆసిమ్ మాలిక్ టచ్‌లో ఉన్నారని డీడబ్ల్యూ వార్తా చానల్ పేర్కొన్నది. వారిద్దరూ మాట్లాడుకున్నారని ఎనిమిదో తేదీన ప్రసారం చేసిన ఒక కథనంలో ప్రస్తావించింది. కూలిన విమానం, పేలని క్షిపణి గురించిన సమాచారం వారిద్దరూ ఇచ్చిపుచుకున్నారో లేదో మనకు తెలియదు. అసలు వారు మాట్లాడుకున్నారనే సమాచారమే మనకు తెలియదు. ఇలాంటి మాటలు జరక్కుండా ఉంటాయని మాత్రం అనుకోలేం. నిజంగా మాట్లాడి ఉంటే అది తప్పేమీ కాదు. వారి విధి నిర్వహణలో అది కూడా ఒక భాగమే కదా. మే 9 వ తేదీన "ది వైర్" కోసం కరణ్ థాపర్ చేసిన ఇంటర్వ్యూలో "ఫోర్స్" మ్యాగజైన్ సంపాదకుడు, రక్షణ వ్యవహారాల నిపుణుడు ప్రవీణ్ సాహ్నీ మాట్లాడుతూ యుద్ధ విమానాల, రాడార్ సిస్టమ్‌ల, మిస్సైళ్ల సామర్థ్యాలను గురించి విశ్లేషించారు. పాకిస్థాన్ వినియోగించిన చైనా తయారీ జే 10 సి విమానాలు, వాటిలో వినియోగించిన పీఎల్ 15 మిస్సైళ్ల సాంకేతిక సామర్థ్యం భారత్ వినియోగించిన రాఫెల్ విమానాల కంటే అధిక సామర్థ్యం కలిగినవని ప్రవీణ్ సాహ్నీ చెప్పారు. చిన్నపాటి సైనిక చర్య కోసం రాఫెల్ జెట్‌ను వినియోగించడం తప్పని ఆయన అభిప్రాయపడ్డారు. మన వాయు సామర్థ్యాన్ని మనమే తక్కువ చేసి ప్రపంచానికి చూపించామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రక్షణ వ్యవహారాలపై, ఆయుధ సామర్థ్యంపై ప్రవీణ్ సాహ్నీ అభిప్రాయాలకు ప్రామాణికత, విశ్వసనీయత ఉందని అంటారు. ఈ వివరాలతో కూడిన ఒక వీడియోను ప్రవీణ్ సాహ్నీ విడుదల చేశారు. అయితే ఆ వీడియోని ప్రభుత్వ ఆదేశాల మేరకు బ్లాక్ చేసినట్లు యూ ట్యూబ్ పేర్కొన్నది. "ది వైర్" వెబ్‌సైట్‌ను కూడా ప్రభుత్వ ఆదేశాలతో బ్లాక్ చేసినట్లు సర్వీస్ ప్రొవైడర్లు ప్రకటించారు! ప్రస్తుతం ది వైర్ తిరిగి అందుబాటులోకి వచ్చింది.

ఆ తర్వాత యుద్ధవిమాన తయారీ కంపెనీల, ఆయుధ కంపెనీల ప్రతినిధులు, మిలిటరీ నిపుణులు, మీడియా ప్రచార యుద్ధరంగంలోకి దిగిపోయారు. చైనా తయారీ జే10 సిరీస్ జెట్ విమానాలనూ, జే.ఎఫ్.17 థండర్ జెట్ విమానాలను, ఫ్రెంచ్ తయారీ రాఫెల్ యుద్ధ విమానాలను పోలుస్తూ వారు చర్చలు, వాదనలు ప్రారంభించారు. "చైనా తయారీ విమానాలను, క్షిపణులను తక్కువ అంచనా వేయవద్దు, రాఫెల్ కంటే అవి మెరుగైనవవి, భారత్ - పాక్ మధ్య జరిగిన తాజా సైనిక చర్యల ద్వారా ఈ విషయం స్పష్టం అయింది" అని అర్థం అవుతున్నట్లు రక్షణ వ్యవహారాలను మాత్రమే రిపోర్ట్ చేసే వివిధ అంతర్జాతీయ చానళ్ల విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. భారత్ వినియోగించిన రాఫెల్ జెట్ కూలిపోవడం నిజమే గానీ దానికి కారణం ఏమిటనే అంశంపై స్పష్టత లేదు. రాఫెల్ విమానాల సాంకేతిక సామర్థ్యాన్ని సందేహిస్తూ నిపుణులు కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఇంతకీ 6 వ తేదీ అర్ధరాత్రి జరిగిన సైనిక చర్యలలో రాఫెల్ విమానాలు (కనీసం రెండు విమానాలు) కూలిపోవడంతోనే భారత్ వైపు నుంచి చర్చలకు కనీస ప్రాతిపదిక ఏర్పడిందా? అందుకే ఉభయ పక్షాలూ సిద్ధమయ్యాయా? "భారత్-పాక్ ఉద్రిక్తతలు, సైనిక చర్యలు వారి సొంత వ్యవహారం మాకేమీ సంబంధం లేదు" అంటూ మాట్లాడిన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉపాధ్యక్షుడు జేడి వాన్స్ ఒక్క రోజులోనే మాట మార్చి 8 వ తేదీ రాత్రి నుంచే సంప్రదింపుల ప్రక్రియకు శ్రీకారం చుట్టారా? ఇవన్నీ ప్రశ్నలు! సమాధానాల కోసం కొంతకాలం వేచి చూడాల్సిందే. అమెరికా విదేశాంగ మంత్రి రూబియో మార్కో "48 గంటల కృషి" అన్నారు కదా. తెరవెనుక దౌత్యం ఎప్పుడూ ఇలాగే ఉంటుంది. వారెవరైనా చెబితే తప్ప మనకు నిజానిజాలు తెలియవు. కశ్మీర్ విషయంలో మధ్యవర్తిగా ఉంటానన్న ట్రంప్‌కు అలాంటి అవకాశం నిజంగానే ఇస్తే ఆయనే ఎప్పుడో ఒకప్పుడు తెరవెనుక జరిగిన విషయాలన్నీ బైట పెట్టేస్తారు కూడా. ఆయనతో అదో సౌలభ్యమూ ఉంది. కొందరికి ప్రమాదమూ ఉంది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ఆయన మాట్లాడింది విన్నాం. ఫ్రెంచ్ దేశాధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్‌తో మాట్లాడింది కూడా విన్నాం కదా. భారత్ - పాక్ దేశాల మధ్య సైనిక చర్యల ప్రారంభం, మూడు రోజుల తర్వాత నిలిపివేయడం నేపథ్యంలో అంతర్జాతీయ మీడియాలో జరుగుతున్న చర్చలు ఆసక్తికరంగా ఉన్నాయి. అర్థం కాకపోయినా కొన్ని సాంకేతిక అంశాల వివరాలు తెలుస్తున్నాయి. ఆయుధాల తయారీ కంపెనీల మధ్య సాగుతున్న ప్రచార యుద్ధాన్ని ఈ చర్చలు, వాద వివాదాలు ప్రతిబింబిస్తున్నాయి.

మే 11 వ తేదీ సాయంత్రం భారత్ సీనియర్ సైనికాధికారులు నిర్వహించిన మీడియా సమావేశంలో కూడా విమానాలు కూలిన సమాచారంపై నేరుగా వివరణ రాలేదు. "సైనిక చర్యలలో నష్టాలు కూడా ఒక భాగం, అవి మామూలే, అయితే మా పైలెట్లు క్షేమంగా తిరిగి వచ్చారు" అని డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ చెప్పారు. ఇంతకన్నా ధ్రువీకరణ అవసరమా ? ఇక ఇప్పుడు రాఫెల్ జెట్ విమానాలు సమర్థవంతమైనవా కాదా అనేది తేలాలి!

సీనియర్ పాత్రికేయుడు

భారత ఆర్థిక ప్రయాణానికి దిక్సూచి

మన ఆర్థిక వ్యవస్థ ఎలా ముందుకు సాగుతోంది? మనం సరైన దారిలోనే ఉన్నామా? సామాన్యుడి జీవితంలో మార్పులు వస్తున్నాయా? ఇలాంటి ప్రశ్నలు మన మదిని తొలుస్తూనే ఉంటాయి. అయితే, ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పే ఒక ముఖ్యమైన 'ముందస్తు సంకేతం' ఉందంటే మీరు నమ్ముతారా? అదే 'కొనుగోలు నిర్వాహకుల సూచీ' (పిఎమ్ఐ)! ఇది కేవలం ఒక సంఖ్య కాదు, మన ఆర్థిక ఆరోగ్యాన్ని ముందుగానే చెప్పే ఒక రహస్యమైన గొంతు.

పిఎమ్ఐ అంటే ఏమిటి? దాని వెనుక ఉన్న మ్యాజిక్ ఏమిటి?

ఈ సూచీని అర్థం చేసుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. ఇది ఒక సర్వే లాంటిది. వ్యాపారాల్లో వస్తువులు కొనే ముఖ్యమైన వ్యక్తుల (కొనుగోలు నిర్వాహకులు) అభిప్రాయాలను సేకరించి లెక్కిస్తారు. ఒక స్కోరును (సున్నా నుండి వంద వరకు). ఈ స్కోరును బట్టి ఆయా రంగాల్లో వ్యాపారం ఎలా ఉందో తెలుసుకోవచ్చు. ఒకవేళ స్కోరు 50 ఉంటే, వ్యాపారం నిలకడగా ఉందని అర్థం. ఎలాంటి పెద్ద మార్పులు

లేవని సూచన. స్కోరు 50 కంటే ఎక్కువ ఉంటే, అద్భుతం! వ్యాపారం పుంజుకుంటుందని, అంతా సానుకూలంగా ఉందని సంకేతం. ఆర్థిక చక్రం వేగంగా తిరుగుతోందని చెప్పవచ్చు. ఒకవేళ స్కోరు 50 కంటే తక్కువగా ఉంటే మాత్రం కాస్తంత ఆందోళన చెందాలి. వ్యాపారం మందగిస్తోందని, ఆర్థికంగా అంతంతమాత్రంగానే ఉందని అర్థం. ఈ కొలమానం ఒక రకంగా చెప్పాలంటే, మార్కెట్‌లోని వేడిని ముందుగానే పసిగట్టే ఒక 'థర్మామీటర్' లాంటిది. కొనుగోలు చేసే వ్యక్తులు మార్కెట్‌లోని మార్పులను తొందరగా గమనించగలరు కాబట్టి, వారి అభిప్రాయాలు ఆర్థికవేత్తలకు ఒక విలువైన సమాచారాన్ని అందిస్తాయి.

పిఎమ్ఐ ఎలా ఉపయోగపడుతుంది ! ఈ సూచీ ఎందుకంత ముఖ్యం అంటే, మన స్థూల దేశీయోత్పత్తి (జిడిపి) వంటి పెద్ద లెక్కలు బయటకు రాకముందే ఆర్థిక వ్యవస్థలో ఏం జరుగుతుందో ఇది చెబుతుంది. ముందుగానే భవిష్యత్తును ఊహించే శక్తి దీనికి ఉంది. అందుకే ప్రపంచవ్యాప్తంగా దీనికి అంత ప్రాధాన్యం. ఆర్థిక మార్పులను ముందుగానే గుర్తిస్తే ఏం లాభం అనుకుంటున్నారా? ప్రభుత్వం ముందుగానే మేల్కొని, ఆర్థిక వ్యవస్థను కాపాడటానికి లేదా మరింతగా పెంచడానికి కావలసిన చర్యలు తీసుకోవచ్చు. వ్యాపారాలు తమ భవిష్యత్ ప్రణాళికలను మార్చుకోవచ్చు. సామాన్యుడి జీవితం కూడా ఈ మార్పుల వల్ల ప్రభావితమవుతుంది కదా! డబ్బులెక్కడ పెట్టాలి? వడ్డీ రేట్లు ఎలా ఉంటాయి? అనే ప్రశ్నలకు పిఎమ్ఐ చెబుతుంది. పెట్టుబడి పెట్టేవారికి, ఆర్థిక నిపుణులకు ఈ సూచీ ఒక దిక్సూచిలాంటిది. దేశ ఆర్థిక పరిస్థితిని అంచనా వేసి, ఎక్కడ పెట్టుబడి పెట్టాలో ఒక స్పష్టమైన అవగాహనకు రావడానికి ఇది సహాయపడుతుంది. బ్యాంకులు వడ్డీ రేట్లు పెంచాలా లేక తగ్గించాలా అనే నిర్ణయాలు తీసుకోవడానికి కూడా ఈ సూచీ గణాంకాలను పరిశీలిస్తాయి. వ్యాపారాలు ఎంత ఉత్పత్తి చేయాలో, ధరలు ఎలా ఉండాలో కూడా దీని ఆధారంగానే నిర్ణయిస్తాయి.

పిఎమ్ఐ ముఖ్యంగా మూడు రకాలు ఉంటాయి. 1) తయారీ రంగ పిఎమ్ఐ: ఫ్యాక్టరీల్లో వస్తువులు ఎలా తయారవుతున్నాయో ఇది చెబుతుంది. కొత్త ఆర్డర్లు వస్తున్నాయా, ఉత్పత్తి పెరుగుతోందా, ఎంతమందికి ఉద్యోగాలు ఇస్తున్నారు వంటి విషయాలను పరిశీలిస్తుంది. 2) సేవల రంగ పిఎమ్ఐ: బ్యాంకులు, ఆసుపత్రులు, స్కూళ్లు వంటి సేవలు అందించే రంగాల పనితీరును ఇది అంచనా వేస్తుంది. ఇక్కడ వ్యాపారం ఎలా ఉంది, కొత్తగా ఎంతమంది వస్తున్నారు వంటి విషయాలు ముఖ్యం. 3) సంయుక్త పిఎమ్ఐ: ఈ రెండు రంగాల గణాంకాలను కలిపి, మన మొత్తం ఆర్థిక వ్యవస్థ ఎలా ఉందో ఒక అంచనాకు వస్తారు. ఏ రంగం ఎక్కువ ముఖ్యమో దానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. దీని కోసం ప్రతి నెలా కొన్ని కంపెనీల నుంచి సమాచారం సేకరిస్తారు. కొత్త ఆర్డర్లు, ఉత్పత్తి, ఉద్యోగాలు, డెలివరీ సమయం, నిల్వలు వంటి విషయాలపై వారి అభిప్రాయాలు తెలుసుకుంటారు. వచ్చిన సమాధానాలను బట్టి ఒక ప్రత్యేకమైన ఫార్ములా ఉపయోగించి ఈ సూచీని లెక్కిస్తారు.

పిఎమ్ఐ చాలా ఉపయోగకరమైనది. అయినప్పటికీ కొన్నిసార్లు ఇది తప్పుదారి పట్టించవచ్చు.. కొనుగోలు చేసేవారి వ్యక్తిగత ఆలోచనలు కూడా దీనిపై ప్రభావం చూపవచ్చు. వాతావరణంలో మార్పులు లేదా ఇతర తాత్కాలిక సమస్యల వల్ల కూడా గణాంకాలు మారవచ్చు. ఇది ఎక్కువగా తయారీ, సేవల రంగాల గురించి మాత్రమే చెబుతుంది. వ్యవసాయం వంటి ఇతర ముఖ్యమైన రంగాల గురించి అంతగా చెప్పదు. అందుకే పిఎమ్ఐ ఒక్కదాన్నే నమ్ముకుంటే సరిపోదు. మన ఆర్థిక వ్యవస్థ యొక్క పూర్తి చిత్రాన్ని చూడాలంటే జిడిపి వంటి ఇతర ముఖ్యమైన లెక్కలను కూడా పరిశీలించాలి.

ప్రపంచవ్యాప్తంగా చాలా సంస్థలు ఈ సూచీలను తయారు చేస్తాయి. మన భారతదేశంలో అయితే హెచ్ఎస్‌బీసీ ఇండియా అనే సంస్థ ఈ పని చేస్తుంది. వారు దాదాపు.400 తయారీ సంస్థలు, 400 సేవా ప్రదాత సంస్థలు, మొత్తం 800 కంపెనీల నుంచి ప్రతి నెలా సమాచారం సేకరిస్తారు. దీని ద్వారా మన దేశంలోని తయారీ, సేవల రంగాలు ఎలా పనిచేస్తున్నాయో తెలుస్తుంది. మన ప్రభుత్వం కూడా పిఎమ్ఐని చాలా ముఖ్యమైన సూచికగా భావిస్తుంది. జిడిపి కంటే ముందే సమాచారం అందుతుంది కాబట్టి, ముందుగానే జాగ్రత్తలు తీసుకోవడానికి లేదా మంచి జరిగితే మరింత ప్రోత్సహించడానికి వీలు కలుగుతుంది.

జనక మోహన రావు దుంగ
ఫోన్: 8247045230

మిత్రుడిలో అదృశ్య శత్రువు

అంజన్ రాయ్

భారత ప్రధాని నరేంద్ర మోదీకి అత్యంత సన్నిహిత మిత్రుడు ట్రంప్ అని భావిస్తున్నారు. అయితే ఈ మిత్రుడిలో అదృశ్య శత్రువు ఉన్నాడని ఆయనతో మోదీకి కష్టాలు తప్పవని అనిపిస్తోంది. ప్రధాని సోమవారం రాత్రి ఇతర ప్రపంచదేశాలకు భారతదేశం పాకిస్థాన్‌తో జరిపిన ఘర్షణాత్మక దాడులను స్పష్టం చేసేందుకు ప్రసంగించారు. పాకిస్థాన్, భారతదేశంతోనూ ట్రంప్ లోపాయికారీగా మాట్లాడి కాల్పుల విరమణ ఒప్పందాన్ని కుదిర్చినట్లుగా చెప్పుకుంటున్నారు. దీనిపై మన ప్రధాని ఇంతవరకు స్పందించలేదు. అకస్మికంగా కాల్పుల విరమణ ఒప్పందాన్ని కుదిర్చానని వెల్లడించారు. పాకిస్థాన్ అణ్వాయుధాన్ని ప్రయోగించి ఇండియా ప్రజలను తీవ్రంగా దెబ్బకొడతారని భావించి కాల్పుల విరమణను కుదర్చినట్లుగా ట్రంప్ చెప్పుకుంటున్నారు. తమ నిఘా వర్గాల సమాచారంమేరకు పాకిస్థాన్ అణ్వాయుధాలను ప్రయోగించ వచ్చునని తనకు తెలిసిందని ట్రంప్ చెప్పుకున్నారు. అయితే భారతదేశానికంటే ముందుగానే కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని చెప్పడం వల్ల మంచి స్నేహితుడని నరేంద్ర మోదీ చెప్పినప్పటికీ ఆ స్నేహితుడిలోనే శత్రువు ఉన్నాడని భావించవలసివస్తోంది. మా వద్ద కూడా అణ్వాయుధాలు ఉన్నాయని పాకిస్థాన్ ప్రయోగిస్తే అంతకంటే మిక్కిలిగా తాము ఆయుధాలను వినియోగిస్తామని మోదీ చెప్పినందున తానే ముందుగా ప్రకటించానని ట్రంప్ అంటున్నారు. తీవ్రమైన ఘర్షణలు జరిగితే వచ్చే నష్టం జ్ఞాపకాలుగా మిగిలిపోవలసిందేనని ట్రంప్ అంటున్నారు. పైగా అమెరికా అధ్యక్షుడు ప్రపంచంలో ముందుగా తన ప్రచారం అందరికీ తెలియాలని ట్రంప్ మోదీకి కష్టాలుకొని తెచ్చిపెట్టారు.

వాస్తవంగా కాల్పుల విరమణను గురించి భారతదేశం ఆలోచించినట్లయితే ముందుగా మోదీనే ప్రకటించాలి. ట్రంప్ ముందుగా ప్రకటించడం వల్ల మోదీ తీవ్ర సంకటంలోపడ్డారు. అంతర్జాతీయ మీడియా, అనేక పత్రికలు భారతదేశాన్ని తప్పుపడుతున్నాయి. దక్షిణాసియాలోని పొరుగుదేశాలమధ్య సంఘర్షణ ట్రంప్‌కి అవగాహనేలేదు. పొరుగుదేశమైన పాకిస్థాన్‌పై చిత్తశుద్ధితో దాడులు చేస్తుండగా, ట్రంప్‌లాంటి వ్యక్తి ఇండియాకు సంక్లిష్ట పరిస్థితులు కల్పించాడు. కొంతమంది టెర్రరిస్టులు కశ్మీర్‌లో బరితెగించి దారుణంగా దాడులుజరిపి 26మంది యాత్రికులను చంపివేయడం భారతదేశ ప్రజలను తీవ్రంగా కలిచివేసింది. పాకిస్తాన్‌కు సంబంధించి అన్ని విషయాలను సేకరించిన తరువాత టెర్రరిస్టు

స్థావరాలపై మాత్రమే భారత సైనికులు దాడిచేసి ధ్వంసం చేశారు. వాస్తవంగా పాకిస్థాన్ తీవ్రమైన నష్టాలను ఎదుర్కొన్నది. ఒక విధంగా ప్రేరేపకులను రక్షించడానికే ట్రంప్‌లాంటి వారు ఈ ప్రకటన చేశారని భావిస్తున్నారు. పాకిస్థాన్ చేసిన నేరాన్ని దృష్టిలో ఉంచుకుని భారతదేశం టెర్రరిస్టు స్థావరాలపై మాత్రమే దాడులు నిర్వహించింది. పరస్పర దాడులు తక్షణం నిలిపివేయాలని రెండు దేశాల నాయకులతో మాట్లాడి చెప్పానని ట్రంప్ అన్నారు. వాణిజ్యపరమైన అంశాలను చూపి బెదిరించినట్లుగా ట్రంప్ చెబుతున్నారు. కాల్పుల విరమణను ప్రకటించకపోతే వాణిజ్యాన్ని నిలిపివేస్తానని, కాల్పుల విరమణ ప్రకటించినట్లయితే వాణిజ్యం చేస్తానని కూడా చెప్పినట్లు వెల్లడించారు. ఇది చెప్పిన తరువాతనే కాల్పుల విరమణను పాటించారని ట్రంప్ అంటున్నాడు. ఆయనచెప్పే మాటలు ఎగతాళిగా ఉన్నాయి. ట్రంప్ కాల్పుల విరమణ ప్రకటించడానికి కాస్త ముందుగా పాకిస్థాన్ సైనిక సర్వాధికారి అసిమ్ మునీర్ తదితర ఉన్నతస్థాయి వ్యక్తులకు తెలిసిపోయింది. ట్రంప్ మానసికంగా సరిగ్గాలేదని, జిహాదిస్టుగా పరిగణించలేమని అంతర్జాతీయంగా మీడియా భావిస్తున్నట్లు తెలుస్తోంది. దేశాన్ని ఏలే వ్యక్తి మానసికంగా సరిగాలేనప్పుడు మానసిక నిపుణిడి వద్ద కౌన్సిలింగ్ తీసుకుని బాగుచేసుకోవాలి. మానసిక రోగి తాను సరిగ్గానే మాట్లాడుతున్నానా లేక తప్పు మాట్లాడుతున్నానా అని తెలుసుకోలేడు. నైతికతను కూడా కోల్పోతాడు. చైనాతో ట్రంప్ జగడమాడటాన్ని ఎలా తీసుకోవాలి? అమెరికాతో చైనా భారీగా మిగులు వాణిజ్యాన్ని చేస్తున్నదని, పరిశోధనా రహస్యాలను దొంగిలిస్తున్నదని అలాగే సాంకేతిక నైపుణ్యాన్నికూడా రహస్యంగా తీసుకుంటున్నదని మోదీ ఇష్టంవచ్చినట్లుగా మాట్లాడి అనంతరం సర్దుకున్నట్లుగా మాట్లాడారు. అమెరికా ఉత్పత్తి పరిశ్రమను పూర్తిగా నిర్మూలించాలని చైనా ప్రపంచ వాణిజ్య వ్యవస్థను నాశనం చేయాలని చూస్తున్నట్లు ట్రంప్ మాట్లాడుతున్నారు.

అమెరికా మార్కెట్లకు చైనా వస్తువుల దిగుమతి జరగకుండా చూస్తానని కూడా ట్రంప్ అన్నారు. అమెరికా మార్కెట్ల నుంచి చైనా సొమ్ము చేసుకుంటున్నదని, ప్రాచీనకాలంలో వినియోగించిన ఆయుధ సామగ్రిని, అణ్వాయుధాలను నిల్వ చేసుకుంటున్నదని, హైపర్‌సోనిక్ మిస్సిలీలు, యుద్ధనౌకలను పెంచుకుని ప్రపంచవ్యాప్తంగా అమెరికా శక్తిని సవాలు చేస్తున్నదని ట్రంప్ అంటున్నారు. మధ్యయుగాలనాటి యుద్ధం, భౌగోళిక, రాజకీయ పోరాటంతోపాటు ఆర్థిక యుద్ధాన్ని నేడు గమనించవలసిఉందన్నారు. రెండు భిన్నమైన భావాలు, రెండు భిన్నమైన భావజాలాలు ప్రమాదరకమైనవి. మధ్యయుగాలనాటి యుద్ధాలను బాణాలతో చేశారు. అలాగే కత్తులు, గొడ్డళ్ల ఉపయోగించారు. 21వ శతాబ్దిలో అత్యంత శక్తిమంతమైన ఆయుధాలను ఉపయోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో నరేంద్ర మోదీ నిర్దిష్టమైన అంశాలను వెల్లడించలేక ట్రంప్‌తో ఇరకాటంలో పడుతున్నారు. ట్రంప్ చేసిన ప్రకటన విషయాన్ని పట్టించుకోకుండా కాల్పుల విరమణ బైటవ్యక్తుల నిర్ణయం కాదని తాము తీసుకున్న నిర్ణయమేనని మాట్లాడుతున్నారు. కాల్పుల విరమణ ప్రకటించిన తర్వాత అత్యంత గందరగోళం ఏర్పడింది. ఉక్రెయిన్-రష్యాల మధ్య శాంతిని నెలకొల్పేందుకు ట్రంప్ కృషి చేసినప్పటికీ ఆయన ప్రతిపాదనను తిరస్కరించారు. ఈ విషయంలో ట్రంప్ దారుణంగా విఫలమయ్యారు. పాకిస్థాన్, ఇండియాల మధ్య కాల్పుల విరమణపై తాను విజయం సాధించానని చెప్పుకోవడం వల్ల ఇండియా పరిస్థితి గందరగోళాన్ని ఎదుర్కోవలసివచ్చింది.

ఒక్క పరీక్ష ఎప్పటికీ నిర్వచించలేదు: మోదీ

న్యూఢిల్లీ: సీబీఎస్ఈ 10, 12 తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం శుభాకాంక్షలు చెప్పారు. ఇది విద్యార్థుల దృఢసంకల్పం, క్రమశిక్షణ, కఠోర శ్రమకు దక్కిన ఫలితమన్నారు. ఈ పరీక్షల్లో విజయానికి దోహదం చేసిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఇతరుల పాత్రను గుర్తుంచుకొనే రోజు కూడా ఇదేనని పేర్కొన్నారు. సీబీఎస్ఈ పరీక్షల ఫలితాలు విడుదలైన అనంతరం ఆయన 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. భవిష్యత్‌లో వచ్చే అన్ని అవకాశాల్లో పరీక్షా వారియర్లు గొప్ప విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నా. ఇప్పుడు సాధించిన స్కోర్‌ల పట్ల కొంచె నిరుత్సాహంగా ఉన్న వారికి ఒక విషయం చెప్పాలనుకుంటున్నా. ఒక్క పరీక్ష మిమ్మల్ని ఎప్పటికీ నిర్వచించలేదు. మీ ప్రయాణం ఇంకా చాలా పెద్దది. మీ బలాలు మార్కుల పట్టికను మించిపోతాయి. ఎన్నో గొప్ప విషయాలు ఎదురుచూస్తున్నందున మీరు విశ్వాసంతో ముందుకు సాగండి. కొత్త విషయాలు నేర్చుకోవాలన్న ఉత్సుకతతో ఉండండి' అని సూచించారు

కోల్‌కతా విమానాశ్రయంలో హైఅలర్ట్

కోల్‌కతా: భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న వేళ కోల్‌కతాలోని ది నేతాజీ సుభాశ్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయానికి బాంబు బెదిరింపు ఫోన్ కాల్ వచ్చింది. దీంతో పరిసర ప్రాంతాల్లో హై అలర్ట్ ప్రకటించారు. కోల్‌కతా నుంచి ముంబై వెళ్తున్న ఇండిగో విమానంలో బాంబు అమర్చినట్లు గుర్తు తెలియని వ్యక్తి విమానాశ్రయ అధికారులకు ఫోన్ చేసి చెప్పాడు. అక్కడికి కొద్ది నిమిషాల్లోనే ఆ విమానం టేకాఫ్ కావాల్సి ఉంది. అప్రమత్తమైన అధికారులు వెంటనే అందులోని ప్రయాణికులు, లగేజీని కిందికి దింపేశారు. విమానాన్ని 'ఐసోలేషన్ బే'లోకి తీసుకెళ్లి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమానాస్పద వస్తువులేవీ కనిపించకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కోల్‌కతా విమానాశ్రయం నుంచి ఇండిగో విమానం మధ్యాహ్నం 1.30 గంటలకు బయల్దేరి... సాయంత్రం 4.20 గంటలకు ముంబై చేరాల్సి ఉంది. మొత్తం 195 మంది చెక్ఇన్ అయిన తర్వాత బాంబు బెదిరింపు ఫోన్ కాల్ రావడంతో అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టారు. అత్యవసర ప్రకటన చేసి...విమానాశ్రయ పరిసరాల్లో హై అలర్ట్ ప్రకటించారు. బాంబు నిర్వీర్య బృందాలు, ఇతర రక్షణ బృందాలు విమానాశ్రయంలో అణువణువూ గాలించారు. విమానాశ్రయం వద్ద సీఐఎస్ఎఫ్ బలగాలు భద్రతను కట్టుదిట్టం చేశాయి. పహల్గాం ఉగ్రదాడికి ప్రతిచర్యగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' చేపట్టిన తర్వాత ఇలా బాంబు బెదిరింపులు రావడం ఇది రెండోసారి.

అమెరికా వస్తువులపై
భారత్ ప్రతీకార సుంకాలు

న్యూఢిల్లీ: భారతదేశ వస్తువులపై అమెరికా విధించిన సుంకాలకు ప్రతీకారంగా... అమెరికా వస్తువులపై భారత్ సుంకాలు విధించాలని నిర్ణయించింది. ఈ విషయాన్ని ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) కు తెలియజేసింది. భారత స్టీల్, అల్యూమినియంపై అమెరికా విధించిన సుంకాలకు ప్రతిగా భారత్ ఈ నిర్ణయం తీసుకొన్నట్లు తెలుస్తోంది. కొన్ని ప్రత్యేకమైన అమెరికా వస్తువులకు ఇస్తున్న రాయితీలు నిలిపివేసి... దిగుమతి సుంకాలు పెంచనున్నట్లు వెల్లడించింది. అమెరికా ఇటీవల విధించిన టారిఫ్‌ల కారణంగా 7.6 బిలియన్ డాలర్ల విలువైన భారత ఎగుమతులపై ప్రతికూల ప్రభావం పడనుంది. అందుకే అగ్రరాజ్యం రక్షణాత్మక వైఖరి అవలంబిస్తోందని భారత్ తప్పుపట్టింది. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చాక ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలపై భారీఎత్తున టారిఫ్‌లు విధించారు. క్రూడ్ స్టీల్ తయారీలో ప్రపంచంలోనే భారత్ రెండో స్థానంలో ఉంది. ఇప్పుడు దీనిపై ట్రంప్ టారిఫ్‌ల ప్రభావం పడనుంది. ఇప్పుడు అమెరికా వస్తువులపై ప్రతీకార టారిఫ్‌లు విధిస్తామని ప్రపంచ వాణిజ్య సంస్థకు భారత్ తెలియజేయడం రెండుదేశాల మధ్య వాణిజ్య ఘర్షణ పెరుగుతోందనడానికి సంకేతంగా భావిస్తున్నారు. సరికొత్త వాణిజ్య ఒప్పందానికి న్యూఢిల్లీ-వాషింగ్టన్ అత్యంత సమీపానికి వచ్చినట్లు వార్తలొస్తున్న వేళ ఈ పరిణామాలు చోటుచేసుకోవడం గమనార్హం. అమెరికాకు వాణిజ్యలోటు తగ్గించడం కోసం ఈ ఒప్పందం ద్వారా భారత్ చాలా రాయితీలను ప్రతిపాదించినట్లు తెలుస్తోంది.

కుమార్తె పేరుతో నకిలీ ఖాతా
అఖిలేశ్ ఆగ్రహం

లక్నో: తన కుమార్తె పేరుతో ప్రముఖ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో నకిలీ ఖాతా ద్వారా అభ్యంతర పోస్టులు పెడుతుండటంపై సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆ ఖాతా సృష్టించిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన మంగళవారం డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ, ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ మార్ఫింగ్ ఫొటోలను పంచుకునేందుకు ఆ ఖాతాను వినియోగించారు. దీనిని ఎక్స్ మాధ్యమంగా అఖిలేశ్ ఖండించారు.

ఘటన వెలుగు చూసిన 24 గంటల తర్వాత కూడా చర్యలు ఎందుకు తీసుకోలేదని నిలదీశారు. రాజకీయ, ఆర్థిక ప్రయోజనాల కోసం కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వ సైబర్ సెక్యూరిటీ సెల్ నిజంగా చర్యలు తీసుకోవాలని అనుకుంటుందా అని ప్రశ్నించారు. వారు పై నుంచి ఆదేశాల కోసం వేచివున్నారంటూ అఖిలేశ్ దుయ్యబట్టారు. వివాదాస్పద పోస్టు స్క్రీన్‌షాట్లను తన ట్వీట్‌కు జతపర్చారు. దీనిని ఎఫ్ఐఆర్ కంటే తక్కువగా పరిగణించవద్దన్నారు. 'తీవ్ర అభ్యంతరకర పోస్టుల వైపుకు మా దృష్టి మళ్లుతోంది. మా కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు, సహచరుల పేర్లు, చిత్రాలను కొన్ని సంఘ విద్రోహ శక్తులు దుర్వినియోగిస్తున్నాయి. సామాజిక మాధ్యమాల్లో అభ్యంతరక పోస్టులు పెడుతున్నాయి. ఆ పోస్టులతో మాకు ఎలాంటి సంబంధం లేదు. ఇది తెలిసి 24 గంటలు గడిచినాగానీ ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడానికి కారణం ఏమిటి' అని ఎక్స్‌లో అఖిలేశ్ యాదవ్ ఆగ్రహం వ్యక్తంచేశారు.

ముగ్గురు ముష్కరుల హతం

వారిలో లష్కరే తొయిబా అగ్ర కమాండర్ షాహిద్

శ్రీనగర్ : జమ్మూకశ్మీర్‌కు చెందిన సోపియాన్‌లో మంగళవారం భద్రతా దళాలతో జరిగిన ఒక ఎన్‌కౌంటర్‌లో లష్కరే తోయిబా అగ్ర కమాండర్ షాహిద్ కుట్టే సహా ముగ్గురు ముష్కరులు హతమయ్యారని అధికారులు తెలిపారు. దక్షిణ కశ్మీర్ జిల్లాకు చెందిన షుక్రూ కెల్లర్ ప్రాంతంలో ఉగ్రవాదు ఉనికికి సంబంధించిన సమాచారం ఆధారంగా భద్రతా దళాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ సమయంలో ఉగ్రవాదులు కాల్పులు ప్రారంభించిన తర్వాత గాలింపు ఆపరేషన్ ఎన్‌కౌంటర్‌గా మారినట్లు వారు వివరించారు. ఈ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులను మట్టుబెట్టామన్నారు. పోలీసు ఉన్నతాధికారి ఒకరు మాట్లాడుతూ ఉగ్రవాదులు లష్కరే తొయిబాకు చెందినవారని, వారిలో ఇద్దరు షాహిద్ కుట్టే, అద్నన్ షఫీగా గుర్తించామన్నారు. మూడవ ఉగ్రవాది వివరాలు తెలియవలసి ఉందని తెలిపారు. సోపియాన్‌లోని చోటిపురా హిర్పోరాకు చెందిన షాహిద్ మార్చి 8, 2023న ఉగ్రవాద సంస్థలో చేరాడని, అతను 'ఎ' కేటగిరీ ఉగ్రవాది, లష్కరే తొయిబాకు అనుబంధంగా ఉన్నాడని అధికారులు వివరించారు. 'ఏప్రిల్ 8, 2024న డానిష్ రిసార్ట్‌లో జరిగిన కాల్పుల ఘటనలో అతను పాల్గొన్నాడు. ఈ ఘటనలో ఇద్దరు జర్మన్ పర్యాటకులు, ఒక డ్రైవర్ గాయపడ్డారు. మే 18, 2024న సోపియాన్‌లోని హీర్పోరాలో జరిగిన బీజేపీ సర్పంచ్ హత్యలో అతనికి పాత్ర ఉంది. ఫిబ్రవరి 3, 2025న కుల్గామ్‌లోని బెహిబాగ్‌లో జరిగిన టీఏ సిబ్బంది హత్యలో అతనికి పాత్ర ఉందని అనుమానిస్తున్నారు' అని చెప్పారు. ఇక గత నెల ఏప్రిల్ 26న పహల్గాం దాడి తర్వాత షాహిద్ నివాసాన్ని జమ్మూకశ్మీర్ అధికార యంత్రాంగం కూల్చివేసింది. షాహిద్ కుట్టే మూడు, నాలుగు సంవత్సరాలుగా దేశ వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటున్నాడని అధికారులు తెలిపారు. అలాగే సోపియాన్‌లోని వందున మెల్హోర్ ప్రాంతానికి చెందిన షఫీ 'సి' కేటగిరీ ఉగ్రవాది. 'అక్టోబరు 18, 2024న సోపియాన్‌లోని వాచిలో స్థానికేతర కార్మికుడిని హత్య చేశాడు' అని అన్నారు. ఇదిలాఉండగా, పహల్గాం ఉగ్రవాద దాడిలో పాల్గొన్న ఉగ్రవాదుల సమాచారం ఇచ్చిన వారికి రూ.20 లక్షల రివార్డు ప్రకటిస్తూ పుల్వామా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పోస్టర్లు కనిపించాయి. అంతకుముందు, జమ్మూకశ్మీర్ పోలీసులు పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడిలో పాల్గొన్నట్లు భావిస్తున్న ముగ్గురు ఉగ్రవాదుల రేఖాచిత్రాలు, గుర్తింపులను విడుదల చేశారు. ఈ ముగ్గురు ఉగ్రవాదులు లష్కరే తోయిబాతో అనుబంధం కలిగి ఉన్నారు.

జస్టిస్ వర్మపై అభిశంసన?
కేంద్రానికి సీజేఐ సిఫార్సు

న్యూఢిల్లీ: హైకోర్టు జడ్జిగా పనిచేసిన జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో కాలిన నోట్ల కట్టల వ్యవహారం భారీ మలుపు తీసుకుంది. మార్చి 14న జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక ఢిల్లీ నివాసంలో అగ్ని ప్రమాదం జరిగింది. ఈ అగ్నిప్రమాదంపై సుప్రీంకోర్టు నియమించిన త్రిసభ్య కమిటీ విచారణలో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో అగ్నిప్రమాదం జరిగిన ఘటనా స్థలం నుంచి భారీ ఎత్తున లభ్యమైన నోట్ల కట్టల్ని అక్కడ పనిచేసే సిబ్బంది మాయం చేసినట్లు తెలుస్తోంది. వెలుగులోకి వచ్చిన నోట్ల కట్టలపై సుప్రీం కోర్టు త్రిసభ్య కమిటీ జస్టిస్ యశ్వంత్ వర్మను విచారించింది. విచారణలో నోట్ల కట్టల విలువపై స్పష్టత లేకపోవడం, అగ్నిప్రమాదం జరిగిన తర్వాత నోట్ల కట్టల్ని ఇంట్లో పనిచేసే సిబ్బంది మాయం చేయడం, నగదు వెలుగులోకి వచ్చిన గదికి తాళం వేసి ఉండడంతో... దాన్ని బలవంతంగా తెరవాల్సి రావడం వంటి అంశాలపై త్రి సభ్య కమిటీ ... జస్టిస్ యశ్వంత్ వర్మను ప్రశ్నించింది. అయితే త్రి సభ్య కమిటీకి జస్టిస్ యశ్వంత్ వర్మ తప్పుడు సమాచారం ఇచ్చినట్లు తేలింది. ఈ వరుస పరిణామాలపై త్రిసభ్య కమిటీ నివేదికను తయారు చేసి సుప్రీంకోర్టుకు అందించింది. ఆ నివేదికను పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా...రాజీనామా చేసి తప్పుకోవడం ఉత్తమమని జస్టిస్ వర్మకు సూచించారు. అందుకు ప్రతిస్పందనగా తనపై వచ్చిన ఆరోపణలు అసత్యమని పేర్కొంటూ పదవికి రాజీనామా చేసేందుకు నిరాకరించారు. దీంతో జస్టిస్ వర్మ అభిశంసన (ఇంపీచ్‌మెంటు)కు సీజేఐ సంజీవ్‌ఖన్నా కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది. ఈ వివాదంపై త్రిసభ్య కమిటీ ఇచ్చిన నివేదికను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీలకు సీజేఐ పంపారు.

కల్నల్ సోఫియాపై బీజేపీ మంత్రి అనుచిత వ్యాఖ్యలు
కాంగ్రెస్ మండిపాటు

న్యూఢిల్లీ: కల్నల్ సోఫియా ఖురేషిపై బీజేపీ నేత, మధ్యప్రదేశ్ మంత్రి విజయ్‌షా వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఖురేషి పేరు ఇటీవల బహుళ ప్రచారంలోకి వచ్చింది. 'ఆపరేషన్ సిందూర్' వివరాలను ఎప్పటికప్పుడు మీడియా ముందు వచ్చి వివరించారు. 1999లో ఇండియన్ ఆర్మీ కార్ప్స్ ఆఫ్ సిగ్నల్‌లో చేరి క్రమంగా 2016లో మల్టీనేషనల్ మిలటరీ విన్యాసాలకు సారథ్యం వహించిన తొలి మహిళా అధికారిగా ఆమె గుర్తింపు తెచ్చుకున్నారు. తాజాగా ఆమెపై బీజేపీ నేత విజయ్ షా చేసిన వ్యాఖ్యలు సంచలనమయ్యాయి. కల్నల్ ఖురేషిని 'టెర్రరిస్టుల సోదరి'గా పేర్కొంటూ ఆమెను కించపరచేలా విజయ్ షా మాట్లాడారంటూ కాంగ్రెస్ పార్టీ తప్పుపట్టింది. మహులోని (ఇండోర్ జిల్లా) రాయ్‌కుండ గ్రామంలో జరిగిన హల్మా ఈవెంట్‌లో విజయ్ షా చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో క్లిప్‌ను కాంగ్రెస్ పార్టీ షేర్ చేసింది. 'వాళ్లు (ఉగ్రవాదులు) మన సోదరీమణులు, ఆడకూతుళ్ల సిందూరం తుడిచేసి పారిపోయారు. వారి సొంత సోదరినే వాళ్లకు గట్టి సమాధానం చెప్పమని మనం పంపాం' అని విజయ్ షా మాట్లాడినట్టు ఆ వీడియోలో ఉంది. దీనిపై కాంగ్రెస్ మండిపడింది. కల్నల్ సోఫియా ఖురేషిని టెర్రరిస్టుల సోదరిగా ఆయన సంబోధించడం ఏమిటని నిలదీసింది. సోఫియా ఖురేషిని చూసి ప్రతి భారతీయుడు గర్విస్తున్నాడని, అయినా కొందరు ఆమె గురించి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని పేర్కొంది. ఇది మన వీరజవాన్లను అవమానించడమేనని ఆక్షేపించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సన్నిహితుడిగా చెప్పుకునే విజయ్ షా తక్షణం రాజీనామా చేయాల్సిందిగా బీజేపీ కోరాలని డిమాండ్ చేసింది.

నాడు పీవోకేను ఎందుకు వదిలేశారు?
కాంగ్రెస్‌పై హిమంత బిశ్వశర్మ ఎదురుదాడి

గువహటి: పాక్‌తో కాల్పుల విరమణ అంశంపై ప్రధాని మోదీని ప్రశ్నించే హక్కు కాంగ్రెస్ పార్టీకి లేదని అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ అన్నారు. 1971లో పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో ఘన విజయం సాధించినా... పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)ను తిరిగి వశపరచుకునేందుకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు వెనకాడిందని ప్రశ్నించారు. 'చికెన్ నెక్ ఆఫ్ ఇండియా'గా పిలిచే సిలిగుడి కారిడార్‌ను కనీసం 100 మైళ్ల మేర అయినా ఎందుకు విస్తరించలేకపోయారని ప్రశ్నించారు. గువహటిలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో హిమంత బిశ్వ శర్మ మాట్లాడారు. ఒకవేళ ఇందిరాగాంధీ బతికి ఉంటే ఇవే ప్రశ్నలు ఆమెనే అడిగేవాడినని అన్నారు. '1971లో పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో భారత సైన్యం అఖండ విజయం సాధించింది. పీవోకేను తిరిగి స్వాధీనం చేసుకోవడానికి గానీ, ఈశాన్య రాష్ట్రాలను మిగతా భారతదేశానికి కలిపే 'చికెన్ నెక్'ను విస్తరించేందుకుగానీ అదే సరైన సమయం. ప్రధానిగా ఉన్న ఇందిరా గాంధీ అప్పట్లో ఆ పని ఎందుకు చేయలేదు? వివిధ దేశాల సరిహద్దులకు దగ్గరగా ఉండే ఈ వ్యూహాత్మక ప్రాంతాలను అప్పుడే భారత్ అధీనంలోకి తీసుకోవాల్సింది' అని బిశ్వశర్మ అన్నారు. తాజాగా పాకిస్థాన్‌తో కాల్పుల విరమణపై ఆయన మాట్లాడుతూ పహల్గాం ఉగ్రదాడికి పాల్పడిన వారికి తగిన బుద్ధి చెప్పేందుకు, పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలను పూర్తిగా నాశనం చేసేందుకే 'ఆపరేషన్ సిందూర్' చేపట్టినట్లు చెప్పారు. ఆ లక్ష్యం పూర్తయిందని, అందుకే పాక్‌తో కాల్పుల విరమణకు భారత్ అంగీకరించిందని తెలిపారు. ఉగ్రవాదులకు వత్తాసు పలికిన పాక్ సైన్యానికి కూడా భారత్ ఆర్మీ తగిన రీతిలో బదులిచ్చిందని పేర్కొన్నారు. భారత్ శక్తి ముందు నిలవలేమని భావించిన పాక్ కాళ్ల బేరానికి వచ్చిందని ఎద్దేవా చేశారు.

బాంబు పేలుళ్లపై ముంబై పోలీసులకు మెయిల్

న్యూఢిల్లీ: రాబోయే రెండు రోజుల్లో బాంబు పేలుళ్లు జరుగుతాయని కొందరు అగంతకులు హెచ్చరికలకు పాల్పడ్డారు. ఈ మేరకు ముంబై పోలీసులకు ఈ-మెయిల్ పంపించారు. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. అధికారుల వివరాల ప్రకారం... ముంబై పోలీస్ కంట్రోల్ రూంకు మంగళవారం ఒక ఈ-మెయిల్ వచ్చింది. అందులో రానున్న రెండు రోజుల్లో బాంబు పేలుళ్లు జరుగుతాయని నిందితులు బెదిరించారు. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు.

భద్రతాపరమైన చర్యలు చేపట్టారు. ఈ మెయిల్‌ను ఎవరు పంపించారనే విషయంపై దర్యాప్తు చేస్తున్నారు. ఇటీవల భారత్-పాక్‌ల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న క్రమంలో అనేక ప్రాంతాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. అయితే, అవన్నీ బూటకమని అధికారులు తేల్చారు. ప్రస్తుతం ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణ కొనసాగుతున్న క్రమంలో బాంబు బెదిరింపులు రావడం కలకలం సృష్టిస్తోంది.

పార్లమెంటు ప్రత్యేక సమావేశం నిర్వహించాలి
ప్రధానికి సీపీఐ(ఎంఎల్) ఎంపీ లేఖ

న్యూఢిల్లీ: భారత్-పాక్ మధ్య సైనిక ఘర్షణ-కాల్పుల విరమణపై చర్చ కోసం పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ ఎంపీ రాజా రామ్ సింగ్ డిమాండ్ చేశారు. కాల్పుల విరమణపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడం ఇబ్బందికరమంటూ పహల్గాం దాడి అనంతర పరిణామాలపై ఆందోళన వ్యక్తంచేశారు. భద్రతా వైఫల్యాలు, దాడికి కారణమైన వారిని చట్టం ముందుకు తేలేకపోవడం, తప్పుడు కథనాల వ్యాప్తి, బాధిత కుటుంబాలకు వేధింపులు వంటివి తీవ్రంగా ఇబ్బంది పెట్టే అంశాలని ఆయన మంగళవారం ప్రధాని మోదీకి ఒక లేఖ రాశారు. సంక్షోభాన్ని ఎదుర్కోవడంలో ప్రభుత్వ వైఖరి అనేక ప్రశ్నలకు తావిస్తోందన్నారు. కాల్పుల విరమణ గురించి ట్రంప్ ప్రకటించడం ద్వారా పాకిస్థాన్-భారత్ మధ్య ద్వైపాక్షిక వ్యవహారాల్లో విదేశీ జోక్యం పెరిగిందని స్పష్టమవుతోందని రామ్ సింగ్ వెల్లడించారు. ఇవన్నీ దేశానికి ముఖ్యమైన అంశాలని, వీటిపై తక్షణమే చర్చించాలని, అందుకోసం పార్లమెంటు ప్రత్యేకంగా సమావేశం కావడం అవసరమని ప్రధానికి సూచించారు. ప్రభుత్వ పారదర్శకత, జవాబుదారీతనానికి హామీ కోసం సమావేశం కావాలన్నారు. భారత్-పాక్ మధ్య సైనిక ఘర్షణ, ఆపై కాల్పుల విరమణ గురించి సమగ్రంగా చర్చించడం కోసం ఇప్పటికే పార్లమెంటు ప్రత్యేక సమావేశం నిర్వహించాలని ఆప్, కాంగ్రెస్‌తో పాటు అనేక ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేస్తుండటం విదితమే.

ఆర్మీ డ్రోన్ మిస్సింగ్... పోలీసులకు ఫిర్యాదు

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో ఆర్మీకి చెందిన ఓ డ్రోన్ జాడ కనిపించలేదు. దీంతో డ్రోన్ మిస్సయ్యిందని 'కార్ప్స్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ మెకానికల్ ఇంజినీర్స్' కు చెందిన టెక్నీషియన్ హవల్దార్ మేజర్ దీపక్ రాయ్ రైల్వేరోడ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రోజువారి శిక్షణ కార్యక్రమంలో భాగంగా డ్రోన్‌ను పైకి పంపగా కొంతసేపటి తర్వాత అది కనిపించకుండా పోయిందని తెలిపారు. మీరట్ రైల్వేస్టేషన్‌కు సమీపంలో సోమవారం సాయంత్రం డ్రోన్ మిస్సయ్యిందని దీపక్ రాయ్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు గురించి సదార్ సర్కిల్ ఆఫీసర్ సంతోష్‌కుమార్ సింగ్ మంగళవారం మీడియాకు వెల్లడించారు. 'ఆర్మీ ఫిర్యాదులో పేర్కొన్న ప్రకారం... డ్రోన్ రోహ్తా రోడ్ ఏరియాలో గాల్లో ఎగురుతూ రైల్వే లైన్ దాటింది. ఆ తర్వాత దిశను మార్చుకుని కనిపించకుండా పోయింది. ఆ తర్వాత కంట్రోల్ మానిటర్‌తో ఆ డ్రోన్‌కు సంబంధాలు తెగిపోయాయి. ఆ తర్వాత ఎంత వెతికినా డ్రోన్ జాడ దొరకలేదు' అని సర్కిల్ ఆఫీసర్ చెప్పారు. అయితే కనిపించకుండా పోయిన డ్రోన్‌కు కెమెరాగానీ, గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ గానీ లేదని, రోజువారి శిక్షణలో ఈ డ్రోన్‌ను వినియోగించేవాళ్లమని హవల్దార్ రాయ్ తెలిపారు.

భారత్‌లో 'బాయ్‌కాట్ టర్కీ'
వందలకోట్ల వ్యాపారంపై ప్రభావం

న్యూఢిల్లీ: పాకిస్థాన్‌లోని ఉగ్రవాదులు, వారి స్థావరాలను అంతం చేయడమే లక్ష్యంగా ఆపరేషన్ సిందూర్‌ను భారత్ చేపట్టగా... ఆ సమయంలో పాకిస్థాన్‌కు అనుకూలంగా వ్యవహరించిన టర్కీపై భారత్‌లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఎర్డోగాన్ ప్రభుత్వం తీరుపై మనదేశంలో తీవ్ర నిరసనలు పెల్లుబికాయి. 'బాయ్‌కాట్ టర్కీ' పేరుతో సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరిగింది. తాజాగా 'బ్యాన్ టర్కీ' అంటూ కొంతమంది వ్యాపారులు ఆ దేశం నుంచి దిగుమతి అయ్యే వస్తువులు విక్రయించేందుకు నిరాకరిస్తున్నారు. పాక్‌తో ఉద్రిక్త పరిస్థితుల వేళ దేశంలో బాయ్‌కాట్ టర్కీ నినాదం ఊపందుకుంది. తాజాగా పూనెలోని వ్యాపారులు కూడా ఆ దేశం యాపిల్‌లను బహిష్కరిస్తున్నట్లు నిర్ణయం తీసుకున్నారు. దీంతో స్థానిక మార్కెట్‌లో అవి కనిపించకుండా పోతున్నాయి. స్థానికులు కూడా ఇతర ప్రదేశాల నుంచి దిగుమతయ్యే పండ్లు తీసుకుంటున్నారు. పూనె మార్కెట్‌లో టర్కీ యాపిల్‌ల సీజన్ టర్నోవర్ రూ.1000 నుంచి రూ.1200 కోట్ల వరకు ఉంటుందని అంచనా. దీంతో వ్యాపారుల తాజా నిర్ణయం పండ్ల మార్కెట్‌పై తీవ్ర ప్రభావం చూపనున్నట్లు తెలుస్తోంది. అయినప్పటికీ వర్తకులు మాత్రం... దీన్ని ఆర్థిక నిర్ణయంగా మాత్రమే కాదని, ప్రభుత్వానికి, సాయుధ బలగాలకు సంఘీభావంగా చూస్తున్నామని పేర్కొన్నారు. యాపిల్‌లను అక్కడ నుంచి దిగుమతి చేసుకునే బదులు హిమాచల్, ఉత్తరాఖండ్, ఇరాన్, ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేస్తున్నామని చెబుతున్నారు. మరోవైపు, హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన కాంగ్రెస్ నేత కుల్‌దీప్ సింగ్ రాథోడ్ కూడా టర్కీ తీరుపై ఇటీవల తీవ్రస్థాయిలో మండిపడ్డారు. 2023లో భీకర భూకంప సమయంలో 'ఆపరేషన్ దోస్త్' ద్వారా భారత్ ఆ దేశానికి ఎంతో సాయం చేసిందని, అయినప్పటికీ ఆ దేశం దౌత్య ద్రోహానికి పాల్పడిందని ఆరోపించారు. ఈ సందర్భంగా అక్కడి దిగుమతులపై నిషేధం విధించాలని డిమాండ్ చేశారు. కాగా, ఇదిలాఉంటే, ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు సైనిక విమానాలు, యుద్ధనౌకను టర్కీ పంపించినట్లు వార్తలు వచ్చాయి. ఆ ఆయుధాలనే భారత్‌పై పాకిస్థాన్ ప్రయోగించినట్లు సమాచారం. పహల్గాం దాడి జరిగిన తర్వాత ముస్లిం దేశాల్లో టర్కీ, అజర్ బైజాన్ మాత్రమే పాక్‌కు మద్దతిస్తూ ప్రకటనలిచ్చాయి. కశ్మీర్ అంశంలో గతంలో ఎర్డోగాన్ అనేకసార్లు అంతర్జాతీయ వేదికలపై బహిరంగంగా భారత్‌పై విమర్శలు గుప్పించారు.

ట్రంప్ వ్యాఖ్యలపై కేంద్రాన్ని ప్రశ్నిస్తాం: ఖర్గే

కలబురగి (కర్నాటక): భారత్-పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణకు తానే కారణమని... ఇరు దేశాల మధ్య అణుయుద్ధం రాకుండా నివారించామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వాదనలకు సంబంధించి అఖిలపక్ష సమావేశంలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే స్పష్టం చేశారు. కాల్పుల విరమణ సహా భారత్-పాక్ సరిహద్దుల మధ్య తాజా పరిణామాలపై చర్చించేందుకు త్వరలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాల్సిందిగా తాను కేంద్రప్రభుత్వాన్ని కోరతానని ఖర్గే తెలిపారు. కర్నాటకలోని కలబురగిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... "ట్రంప్ కీర్తి ప్రతిష్టలు పొందేందుకు కొన్ని మాటలు చెబుతున్నారు. ప్రధాని, కేంద్ర ప్రభుత్వం అదేం లేదంటున్నారు. ఇది సున్నితమైన విషయం. అఖిలపక్ష సమావేశం జరిగినప్పుడు అసలేం జరిగింది? టెలిఫోన్ చర్చలేంటి తదితర విషయాలన్నీ అడుగుతాము" అని ఖర్గే పేర్కొన్నారు. ట్రంప్ మధ్యవర్తిత్వానికి ప్రధాని మోదీ లొంగిపోయారా అనే ప్రశ్నకు సమాధానంగా... దాని గురించి ఇప్పుడు నేను మాట్లాడటం సరైనది కాదన్నారు. ఈ రోజు జరిగే పార్టీ సమావేశంలో కేంద్రాన్ని అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాల్సిందిగా కోరతాం. వారేం చేస్తారో చూద్దామని అన్నారు.

వాజ్‌పేయి ప్రభుత్వ విధానం అనుసరిస్తారా? జైరామ్

భారత్-పాక్ కాల్పుల విరమణ ఒప్పందం విషయమై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రకటనపై తక్షణం అఖిలపక్ష సమావేశం, పార్లమెంటు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి... చర్చించాలని మరోసారి కాంగ్రెస్ డిమాండ్ చేసింది. రెండు దేశాల మధ్య అణు యుద్ధం నివారించడంపై ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ... కార్గిల్ యుద్ధం ముగిసిన మూడు రోజుల తర్వాత ఆనాటి వాజ్‌పేయి ప్రభుత్వం జూలై 29, 1999న కార్గిల్ సమీక్ష కమిటీ ఏర్పాటు చేసిందని, కమిటీ నివేదికను ఫిబ్రవరి 23, 2000న పార్లమెంటులో ప్రవేశపెట్టారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ గుర్తు చేశారు. ఇప్పుడు మోదీ సర్కారు ఆ విధానం అనుసరిస్తుందా అని రమేశ్ ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఆ కమిటీకి భారతదేశ వ్యూహాత్మక వ్యవహారాల నిపుణుడు కె. సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారని ఆయన పేర్కొన్నారు. ఆయన కుమారుడు ఇప్పుడు భారతదేశ విదేశాంగ మంత్రిగా పనిచేస్తున్నారన్నారు. "ఎన్ఐఏ దర్యాప్తు జరుగుతున్నప్పటికీ మోదీ ప్రభుత్వం ఇప్పుడు పహల్గాంపై కూడా ఇలాంటి కసరత్తు చేస్తుందా?" అని ఆయన ప్రశ్నించారు.

డూప్లికేట్ ఓటర్ కార్డులు తొలగించాం: ఈసీ

న్యూఢిల్లీ: ఒకే నంబరుతో ఉన్న ఓటరు కార్డుల సమస్య పరిష్కారమైందని ఎన్నికల సంఘం మంగళవారం ప్రకటించింది. డూప్లికేట్ ఓటర్ కార్డులను తొలగించి, కొత్తవి జారీ చేసినట్లు వెల్లడించింది. ఎలక్టోరల్ ఫొటో ఐడీ లేక ఒకే ఈపీఐసీ నంబరున్న కార్డులు నాలుగుగాను ఒక పోలింగ్ కేంద్రంలో గుర్తించినట్లు పేర్కొంది. అసెంబ్లీ నియోజవర్గాల్లోని వివిధ పోలింగ్ కేంద్రాల పరిధిలో నిజమైన ఓటర్ల ధ్రువీకరణకు చేపట్టిన క్షేత్రస్థాయి తనిఖీల్లో బయటపడిన డూప్లికేషన్ కార్డులను తొలగించినట్లు తెలిపింది. ఓటర్ల జాబితాలో స్థానిక ప్రతి ఓటరు పేరు ఉన్నట్లు వెల్లడించింది. ఈపీఐసీ నంబరు ఒకటే ఉన్నా వేరొక పోలింగ్ కేంద్రంలో ఓటేసే పరిస్థితి లేదు కాబట్టి ఎన్నికల ఫలితాలపై ప్రభావం శూన్యమని ఈసీ నొక్కిచెప్పింది. టీఎంసీ సహా ప్రతిపక్ష పార్టీల ఆరోపణలతో దీర్ఘకాలంగా ఉన్న ఈ సమస్యను మూడు నెలల్లో పరిష్కరిస్తామని ఎన్నికల సంఘం మార్చిలో ప్రకటించింది. దీంతో 99 కోట్ల మందికిపైగా ఓటర్లకు సంబంధించిన ఎలక్టోరల్ డేటాబేస్ మొత్తాన్ని 36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రధాన ఎన్నికల అధికారులు సోదా చేశారు. దేశంలోని 4,123 అసెంబ్లీ నియోజకవర్గాలు, 10.50 లక్షల పోలింగ్ కేంద్రాల ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు ఈ బృహత్ కార్యంలో భాగమయ్యారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో సగటున వెయ్యి మంది ఓటర్లు ఉన్నారు.

కర్నాటక హైకోర్టుకు సోనూ నిగమ్

బెంగళూరు: గాయకుడు సోనూ నిగమ్ కర్నాటక హైకోర్టును ఆశ్రయించారు. తనపై నమోదైన కేసు కొట్టివేయాలంటూ క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. జస్టిస్ శివశంకర్ అమరన్నవర్ నేతృత్వంలోని వెకేషన్ బెంచ్ మంగళవారం దీనిని విచారించింది. తదుపరి విచారణను వాయిదా వేసింది. కొన్ని రోజుల క్రితం బెంగళూరులో నిర్వహించిన కాన్సర్ట్‌లో భాషా విద్వేషం రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేశారంటూ సోనూ నిగమ్‌పై ఆరోపణలు వచ్చాయి. దీంతో ఆయనపై కేసు నమోదైంది. సోనూనిగమ్ వేదికపై పాటలు పాడుతున్న సమయంలో ఓ అభిమాని కన్నడలోనే పాడాలంటూ డిమాండ్ చేశాడు. దీంతో, సహనం కోల్పోయిన సోనూ పాడడం ఆపేసి కన్నడ ప్రేక్షకులను ఉద్దేశించి మాట్లాడారు. 'పహల్గాంలో ఏం జరిగిందో దానికి ఇదే కారణం. ఇప్పుడు మీరు ఏం చేశారో అలాంటి కారణంగానే ఆ దాడి జరిగింది' అని ఘాటుగా స్పందించారు. దీంతో గాయకుడి వ్యాఖ్యలపై కన్నడిగులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'కర్నాటక రక్షణ వేదిక' బెంగళూరు సిటీ యూనిట్ అధ్యక్షుడు ధర్మరాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.

విశాలాంధ్ర హైదరాబాద్

నియోజకవర్గ అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-మల్కాజిగిరి : మల్కాజిగిరి నియోజకవర్గ అభివృద్ధికి ప్రణాళిక బద్ధంగా కృషి చేస్తున్నామని మల్కాజిగిరి శాసన సభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. గౌతమ్‌నగర్ డివిజన్ పరిధిలోని మిర్జాలగూడ చిన్మయి మార్గ్‌లో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో స్థానిక కార్పొరేటర్ మేకల సునీతరామ యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరద ముంపునకు గురవుతున్న చిన్మయ మార్గంలో వరద నీరు సజావుగా పోవడానికి ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే చిన్మయి మార్గంలో ఉన్న 277 గజాల పార్కు స్థలంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. అనంతరం వెంకటాద్రి నగర్‌లో పర్యటించి స్థానికంగా నెలకొన్న రోడ్డు, భూగర్భ డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం హనుమాన్ పేట్‌లోనీ రైల్వేలైన్ కింది నుంచి కొనసాగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీని ఎమ్మెల్యే పరిశీలించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నుంచి మరో డ్రైనేజీ లైన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి ఏసిపి శ్రీనివాస్, డి.ఈ లౌక్య, ఏఈ దివ్య జ్యోతి, నాయకులు జేపీసీ వెంకన్న, మేకల రాము యాదవ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

డ్రైయినేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి పరిధి రాజీవ్ గాంధీనగర్‌లో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో బస్తి వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతూ గత నెల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి సదురు కమీషనర్‌తో మాట్లాడి స్పెషల్ ఫండ్స్ ద్వారా మంజూరు చేయించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయా కాలనీలో నిర్వహించిన డ్రైనేజ్ పనులను ప్రారంభోత్సవ కార్యక్రమానికి కొలను హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని ఆయన చేతుల మీదగా కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం బస్తి వాసులు సంతోషం వ్యక్తం చేస్తూ కొలను హన్మంత్ రెడ్డిని శాలు వాతో సత్కరించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎంసి జనరల్ సెక్రటరీ కోలన్ జీవన్ రెడ్డి, డివిజన్ టి సాయిరాజ్, శ్రీనివాస్ గౌడ్, మేడ్చల్-మల్కాజ్గిరి యూత్ కాంగ్రెస్ సెక్రటరీ ఏరోళ్ల విష్ణు, శ్రీశైలం, వీరేష్, గంగాధర్, ఎండి ఫరీద్, ఎండి అలీ, ఎండి ముజుబ్, కాబ్రిల్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు పరిశీలన

విశాలాంధ్ర- మేడిపల్లి: బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 7వ డివిజన్ ఆంజనేయ నగర్ కాలనీ సీసీ రోడ్ పనులను మంగళవారం ఉదయం మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ పర్యవేక్షించారు. మాజీ మేయర్ , డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ సుమన్ లకు ఏడవ డివిజన్ ప్రజల తరఫున ఆంజనేయ నగర్ కాలనీ వాసుల తరఫున బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ హరినాథ్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. మాజీ మేయర్ తోటకూర అజయ్ సీసీ రోడ్డు కాంట్రాక్టర్ తగిన సూచనలు ఇవ్వడం జరిగింది, కాలనీ వాసుల సమస్య విని సంబంధిత అధికారులకు సూచనలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆంజనేయ నగర్ కాలనీ మాజీ అధ్యక్షులు ఫణి కిషోర్ రెడ్డి, సత్యనారాయణ, ఉపాధ్యక్షులు నర్సయ్య, మాజీ ట్రెజరర్ రమేష్, భగవంతు గౌడ్, మల్లికార్జున్ రెడ్డి, గజేంద్రమోహన్, సురేష్, లింగేశ్వర రావు, సూర్య, సతీష్ , శంకర్, వాసుదేవ్, వెంకట రెడ్డి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి : సీపీఐ

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: మియాపూర్ ప్రాంతం హైటెక్ సిటీకి కొత్తపేట దూరంగా వుండడంతో మౌలిక వసతులు లేక ప్రజలు అనేక ఇబ్బందులకు పడుతున్నారు. దీంతో పాలకులు వెంటనే స్పందించి మౌలిక వసతులను కల్పించాలని సిపిఐ రామకృష్ణ అన్నారు. మియాపూర్ శాఖ ఐదవ మహాసభ అల్విన్ కాలనీలో నిర్వహించారు. ఐదో మహాసభ సందర్భంగా ముఖ్య అతిథులుగా శేర్లింగంపల్లి నియోజకవర్గం సెక్రటరీ రామకృష్ణ, ఏఐటియుసి రంగారెడ్డి జిల్లా బాధ్యులు కే చందు యాదవ్ పాల్గొని నూతన శాఖను ఏర్పాటు చేయడం జరిగింది, మియాపూర్ శాఖ కార్యదర్శిగా కొమ్ము పరమేష్, సహాయ కార్యదర్శిగా మల్లయ్యను నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని శేర్లింగంపల్లి మండల కార్యదర్శి టి.రామకృష్ణ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి మండల అధ్యక్షులు తుపాక రాములు, పార్టీ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

దేశంలో మొదటిసారి ఈవీ వాహనాలపై జీరో ట్యాక్స్

విశాలాంధ్ర - హైదరాబాద్ : కాలుష్యం కారణంగా ప్రస్తుతం ఢిల్లీ ఎదుర్కొన్న పరిస్థితులు రాష్ట్రంలో రాకుండా ఉండేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా కాలుష్య నివారణ కోసం ఎలక్ట్రిక్ వాహనాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని అయన వివరించారు. మంగళవారం బజాజ్ గోగోలో నూతన ఎలక్ట్రిక్ ఆటోలను మంత్రి పొన్నం ప్రభాకర్ అవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ 62 ఏళ్ల నుండి బజాజ్ మోటార్ ఫీల్డ్‌లో ఉందని, మారుతున్న కాలానికి అనుగుణంగా బజాజ్ వినియోగదారునికి సమాజానికి ఉపయోగపడే విధంగా ఈవి వాహనాలకు తీసుకొచ్చిందని తెలిపారు. ఢిల్లీ కాలుష్యం కారణంగా ప్రజలు నివాసయోగ్యం లేకుండా ఇబ్బందులు పడుతున్నారని, అక్కడున్న పరిస్థితులు ఇక్కడ రావద్దని తెలంగాణ ప్రభుత్వం 2026 వరకు అమలు అయ్యే విధంగా ఈవి పాలసీ తీసుకొచ్చిందని వివరించారు. దేశంలోనే మొదటిసారి అన్ని రకాల ఈవి వాహనాలకు జీరో టాక్స్ చేశామని, ఆదాయపరంగా నష్టం జరుగుతున్న కాలుష్యం పరంగా నష్టం జరగద్దని ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. ఈవి, ఎల్పీజీ, సిఎన్జీ వాహనాలు పెరుగుతున్నాయని, ట్రిపుల్ రింగ్ రోడ్డు లోపల ప్రతి వాహనం ఈవీ, సీఎన్జీ, ఎల్పీజీ చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. హైదరాబాద్ దాదాపు 2800 ఆర్టీసీ బస్సులు ఈవి చేయాలని ప్రణాళికలు నడుస్తున్నాయని, ఈవిషయం పై ఇప్పటికే కేంద్ర మంత్రి గడ్కరీ దగ్గర చర్చించినట్లు వెల్లడిరచారు. గూడ్స్, ప్రయాణికుల వాహనాలు కూడా ఈవి ఆటోలు వచ్చాయని, సూపర్ లగ్జరీ ఉండేలా కొత్త ఆటోకి రూపం ఇచ్చారన్నారు. పభుత్వం ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ఉపాధి అవకాశాల కోసం రాజీవ్ యువ వికాసం పథకం తీసుకొచ్చిందని, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం ఇచ్చిన తరువాత ఆటో వాళ్ళకి ఇబ్బందులు కదులుతున్నాయని దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. హైదరాబాద్ లో కొత్త ఆటోలకు పర్మిట్ ఇవ్వడం లేదని, దీని పై ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు. ఇప్పటికే ఉన్న పాత ఆటోలకు రెట్రో ఫిటింగ్ ఇంజన్స్ ప్రయత్నం చేయాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం వాహన సారధి తీసుకొచ్చాం, స్క్రాప్ పాలసీ తీసుకొచ్చామన్నారు.

సొంతింటి కల సాకారం : మంత్రి పొంగులేటి

విశాలాంధ్ర - హైదరాబాద్ : తరతరాలుగా సొంత ఇండ్లకు నోచుకోని ఆదిమ గిరిజన తెగలలోకి అతి బలహీన వర్గమైన చెంచుల సొంతింటి కలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం సాకారం చేయబోతోందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. రాష్ట్రంలోని ఉట్నూరు, భద్రాచలం, మున్ననూర్, ఏటూరు నాగారం నాలుగు సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థల పరిధిలో సచ్యురేషన్ పద్దతిలో దాదాపు పదివేల చెంచు కుటుంబాలను గుర్తించడం జరిగిందని వీరందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నామని వెల్లడిరచారు. ఇందిరమ్మ ఇండ్లపై మంగళవారం సచివాలయంలో అధికారులతో సమీక్షిం చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో శాశ్వత గృహాలను నిర్మించాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పలు సందర్భాలలో సూచించడం జరిగిందని అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనేక సందర్భాలలో గిరిజన ప్రాంతాలలో అభివృద్ధి, ముఖ్యంగా వారి నివాస గృహాల నిర్మాణంపై అనేక సూచనలు చేశారని గవర్నర్, ముఖ్యమంత్రి సూచనలు సలహాల మేరకు గిరిజన ప్రాంతాల్లో చెంచులకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నామని తెలిపారు. అడవులను నమ్ముకొని జీవించే గిరిజనులలో చెంచులు ఒక జాతి అని, వీరు అడవుల్లో వేటాడటం, అటవీ ఫలసాయం సేకరించి అమ్ముకొని జీవనం సాగిస్తున్నారన్నారు. చిన్నచిన్న గుడిసెలు తప్ప వీరికి పక్కా ఇల్లు ఎలా ఉంటుందో ఊహకు అందని విషయమని, అలా అని ఆ అడవి ప్రాంతాల్ని వదలి వారు బతక లేరని, అందుకే వీరు జీవించే ప్రదేశంలోనే ఇందిరమ్మ ఇళ్లు కేటాయిం చాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు వెల్లడిరచారు. దశాబ్దాలుగా ఏ ప్రభుత్వం ఈ దిశగా ఆలోచన కూడా చేయలేదన్నారు. ఉట్నూరు ఐటిడిఎ పరిధిలో ఆసిఫాబాద్ 3551, బోథ్ 695, ఖానాపూర్ 1802, సిర్పూర్ 311, అదిలాబాద్ 1430, బెల్లంపల్లి 326, భద్రాచలం ఐటిడిఎ పరిధిలో అశ్వరావుపేట 105, మున్ననూర్ చెంచు స్పెషల్ ప్రాజెక్ట్‌లో అచ్చంపేట్ 518, మహబూబ్‌నగర్ 153, పరిగి 138, తాండూర్ 184 మొత్తం 9,395 ఇండ్లను మంజూరు చేస్తున్నామని ప్రకటించారు. ఈ ఏడాది రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నామని, అయితే ఐటిడిఏ పరిధిలోని గిరిజన నియోజకవర్గాలకు అదనంగా 500 నుంచి 700 ఇండ్లు ఇవ్వాలని నిర్ణయించి నట్లు వెల్లడిరచారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ కొలిక్కి వచ్చిందని అయితే ప్రతి నియోజకవర్గంలో 3500 ఇండ్లకు గాను 20 శాతం ఇండ్లను బఫర్ కింద పెట్టుకోవడం జరుగుతుందన్నారు. పట్టణ ప్రాంతాల్లో ముఖ్యంగా జిహెచ్‌ఎంసీ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. పట్టణంలోని ముఖ్య ప్రాంతాలలోని మురికి వాడల్లో జీవనం కొనసాగిస్తున్న పేదలు అక్కడే ఉండడానికి ఇష్టపడుతున్నారని, హైదరాబాద్ కు దూరంగా ఇండ్లు నిర్మించి ఇస్తే తీసుకోవడానికి ఆసక్తి చూపడం లేదన్నారు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టకొని పేదలు గుడిసెలు వేసుకొని నివసిస్తున్న ప్రాంతంలోనే జీ ప్లస్ త్రీ పద్దతిలో అపార్ట్‌మెంట్లు నిర్మించాలని భావిస్తున్నట్లు తెలిపారు.

బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయాలి : ఎంపీ

విశాలాంధ్ర-బషీర్ బాగ్: తెలుగు రాష్ట్రాలలో లక్ష 63 వేలకు పైగా బీసీ బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయాలని రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య 'తెలుగు రాష్ట్రాల సీఎంలను డిమాండ్ చేశారు. మంగళవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏపీ ఓబీసీ సంఘం అధ్యక్షులు అంగిరేకుల వరప్రసాద్, నీల వెంకటేష్, అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ బ్యాక్లాగ్ పోస్టులు భర్తీలో 'రెండు ప్రభుత్వాలు అలసత్వాన్ని విన్నాదాలన్నారు. అదేవిధంగా ఖాళీగా ఉన్నటువంటి ఉద్యోగాలన్నిటిని భర్తీ చేసేందుకు రెండు రాష్ట్ర ప్రభుత్వాల సీఎంలు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. దీనికోసం ప్రభుత్వ శాఖల్లో శాఖల వారిగా ఖాళీగా ఉన్నటువంటి ఉద్యోగాల సంఖ్య సమగ్ర వివరాలను సీఎంలు బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1998 డీఎస్సీ మిగిలిపోయిన అభ్యర్థులకు ఎంటిఎస్ పద్ధతిలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు జరిగే విధంగా 1482 మంది రిజర్వేషన్ కేటగిరీ అభ్యర్థులకు న్యాయం చేయాలని విద్యాశాఖ మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు. తెలుగు రాష్ట్రాలలో గ్రూప్-1 సర్వీస్ కింద గత 10 సంవత్సరాలుగా పోస్టుల భర్తీ చేయలేదనీ, అలాగే గ్రూప్-2 సర్వీస్ కింద 6 సంవత్సరాలుగా నోటిఫికేషన్ లేదన్నారు. గతంలో ఇచ్చిన నోటిఫికేషన్ లో పూర్తి స్థాయి డైరెక్ట్ రిక్రూట్మెంట్ కోట భర్తీ చేయకుండా నామమాత్రంగా భర్తీ చేశారనీ పేర్కొన్నారు.అందుకే ఈ కింది అంశాలను పరిగణలోకి తీసుకొని డైరెక్ట్ రిక్రూట్మెంట్ కోటా లెక్కించాలన్నారు.గత 10 సంవత్సరాలుగా రూప్-1 స్థాయి పోస్టులు, గ్రూప్-2 పోస్టులలో ఎంతమంది రిటైర్ అయ్యారని, ఎంతమందికి ప్రమోషన్లు ఇచ్చారనీ లెక్కించి భర్తీ చేయాలన్నారు.తెలుగు రాష్ట్రాలలో గ్రూప్-4 సర్వీస్ అంటే జూనియర్ అసిస్టెంట్ పోస్టులు గత 25 సం.రాలుగా జిల్లా ఆఫీసులు, క్రింది స్థాయి ఆఫీసుల పోస్టులు భర్తీ చేయడం లేదు. కేవలం సచివాలయం. డైరెక్టరేట్ పోస్టులు మాత్రమే భర్తీ చేస్తున్నారనీ,మిగతా జిల్లా మండల స్థాయి జూనియర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీ చేయడం లేదన్నారు. ఇటీవల జారీచేసిన గ్రూప్ -4 సర్వీస్ పోస్టులలో జిల్లా పోస్టులు కలిపారనీ, మొత్తం పోస్టులు తక్కువగా ఉన్నాయని, అన్నీ జిల్లాలలో ఖాళీలు లెక్కించి భర్తీ చేయాలన్నారు.ఈ నిరుద్యోగుల సమావేశంలో, అంగరేకుల వరప్రసాద్ యాదవ్, 98, డిఎస్సి సంఘం నాయకులు శ్రీనివాస్ యాదవ్, సంజీవ్, భైరవకోనా శ్రీనివాస్, బాబయ్య రమేష్, లలిత, చిన్ని కృష్ణ, రాజశేఖర్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్ర వ్యాప్తంగా బూత్, మండల, బ్లాక్ లెవల్‌లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్క మహిళా కాంగ్రెస్ నాయకురాలు కృషి చేయాలని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఆధ్యక్షురాలు మొగిలి సునీతారావు పిలుపునిచ్చారు. మంగళవారం గాంధీ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర మహిళ కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ బాడీ సమావేవం నిర్వహించారు. ఈ సందర్భంగా సునితారావు మాడుతూ ఇటీవల జరిగిన ఏ.ఐ.సి.సి సిడబ్ల్యూసీ సమావేశంలో కూడా పార్టీ కీలక నేత రాహుల్‌గాంధీ విషయంలో స్పష్టంగా మాట్లాడారని చెప్పారు. ప్రతి ఒక్క నాయకురాలు పార్టీ సంస్థాగత నిర్మాణం కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షురాళ్లు, ఇంచార్జెస్ జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషిచేయాలని వివరించారు. రాబోయే కాలంలో స్థానిక ఎన్నికల నేపథ్యంలో పార్టీ గ్రౌండ్ లెవెల్ నుంచి పటిష్టం చేయడం ఎంతో ముఖ్యం అని సునీతారావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి భారీగా తీసుకెళ్లాలి అని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ హయాంలో కులగణన చేసి బీసీలకు 42శాతం రిజర్వేషన్ చేస్తూ బిల్ పాస్ చేయడం, అలాగే ఎస్సీ వర్గికరణ చేసి చరిత్ర సృష్టించారని అన్నారు. ప్రస్తుతం రాజీవ్ యువ వికాసం అనే పథకం ద్వారా యువకులకు స్వయం ఉపాధికి సబ్సిడీ రుణాలకు శ్రీకారం చుట్టిందన్నారు. టీపీసీసీలో మహిళా కాంగ్రెస్‌కు పెద్దపీట వేయాలని కోరడం జరిగిందని, 20 ఏండ్లకు పైన కాంగ్రెస్‌ను నమ్మి పనిచేసిన మహిళా నాయకుల లిస్ట్ చాలా సార్లు ఏ.ఐ.సి.సి, టి.పి.సి.సి కి పంపడం జరిగిందన్నారు. ఇప్పటి దాకా ఒక్కరికి కూడా నామినేటెడ్ పదవి దక్కలేదని సునీతా రావు అవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో కాస్త కాంగ్రెస్ శ్రేణుల్లో అసంతృపి ఉన్న మాట వాస్తవమే అని అయినా తన వంతు ప్రయత్నం చేస్తున్నానని చెప్పారు. పెద్దల దృష్టికి ఈ విషయం తీసుకెళ్ళి న్యాయం జరిగేలా చూస్తానని చెప్పారు.

డీఎస్పీ పార్థసారథి ఇంట్లో ఏసీబీ సోదాలు

- అక్రమంగా నిల్వ ఉంచిన లైవ్ రౌండ్స్ స్వాధీనం
- హయత్‌నగర్ సీఎస్‌లో కేసు నమోదు - దర్యాప్తు

విశాలాంధ్ర - హైదరాబాద్ : రూ.16లక్షల లంచం తీసుకుంటూ పట్టుబడ్డ సూర్యపేట డీఎస్పీ పార్థసారథి ఇంట్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం హయత్‌నగర్‌లోని ఆయన ఇంట్లో ఏసీబీ అధికారులు సోదాలు చేపట్టగా సంచలన విషయాలు బయటపడ్డాయి. హయత్‌నగర్ దత్తాత్రేయనగర్ కాలనీలోని పార్థసారథి నివాసంతో పాటు మరికొన్నిచోట్ల ఏసీబీ అధికారులు సోదాలు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ పార్థసారథి ఇంట్లో అక్రమంగా ఉన్న 21 లైవ్ రౌండ్స్, 69 ఖాళీ క్యాట్రిడ్జెలు, ఒక క్యాట్రిడ్జెల స్టాండ్‌ను ఏసీబీ అధికారులు గుర్తించారు. ఇల్లీగల్‌గా బుల్లెట్స్ ఉండడంతో ఏపీబీ అధికారి మురళీ మోహన్ హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో డీఎస్పీ పార్థసారథిపై కేసు నమోదు చేసిన హయత్ నగర్ పోలీస్‌లు దర్యాప్తు చేస్తున్నారు. అదే సమయంలో పార్థసారథి ఇంట్లో భారీగా ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లను ఏసీబీ అధికారులు గుర్తించినట్లు సమాచారం.

సార్వత్రిక సమ్మె జయప్రదం చేయండి

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: 20న జరగబోయే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని శేరిలింగంపల్లి నియోజకవర్గం మండల కార్యదర్శి టి.రామకృష్ణ, ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా నాయకులు చందు యాదవ్ పిలుపునిచ్చారు. మంళవారం జోనల్ కమిషనర్‌కు కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మున్సిపల్ సంఘం దేశంలో ఎన్నో పోరాటాలు చేసి ప్రాణ త్యాగాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టలను 29 చట్టాలను తీసేస్తూ నాలుగు లేబర్ కోడ్లు తీసుకువస్తూ, 74 లక్షల కోట్ల మంది మనోభావాలను దెబ్బతీస్తూ విధంగా కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ సంస్థల మీద ఉన్న ప్రేమ, కార్మికుల మీద లేదని బానిసలుగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం పూనుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. పని గంటలు పెంచుతూ ఈఎస్ఐపిఎఫ్ సౌకర్యాలు కల్పించకుండా కనీస వేతనాలు అమలు చేయకుండా, సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయకుండా, అధిక ధరలు విపరీతంగా పెంచుతూ కార్మికులకు పర్మనెంట్ చేయకుండా, ఈఎస్ఐపీఎఫ్లల్లు సక్రమంగా అమలు చేయడంలేదని ఈటిపై 20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కనీస వేతనాలు 26,000 ఇవ్వాలని మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కార్మికులకు సబ్బులు, నూనెలు చీపురుకట్టలు, కనీస సౌకర్యాలు కల్పించాలని, కార్మికులకు క్యాజువల్ సెలవులు వెంటనే అమలు చేయాలని పిలుపునిచ్చారు.

20న సమ్మె జయప్రదం చేయండి : వీఎస్‌బోస్

విశాలాంధ్ర-కాప్రా : కార్మిక చట్టాల పరిరక్షణ....కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ నెల 20న జరిగే దేశావ్యాపిత కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలనీ సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు విఎస్‌బోస్ పిలుపనిచ్చారు. మంగళవారం కాప్రా ఏరియాలో మున్సిపల్ కార్మికులతో కలిసి సమ్మె గోడ పత్రికను విడుదల చేసి ప్రశాంగించారు. కేంద్రలో బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను నిర్వీర్యం చేయడం పట్ల ఆవేదన వ్యక్తం చేస్తూ మోదీ ప్రభుత్వం. చేసిన 4 కోడ్స్ వల్ల శ్రమ దోపిడీ పెరిందని, గతంలో రద్దు చేసిన 44 చట్టాల ను పునరు ద్దరేంచాలని డిమాండ్ చేసారు. మూత పద్ద ప్రభుత్వ రంగ సంస్థలను తెరిపించడంతో పాటు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయడం పెరుగుతున్న ధరలకు అనుకూలంగా కనీస వేతనాలను పెంచడం, తదితర డిమాండ్లతో ఏఐటీయూసీతో పాటు అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్మికులు సమ్మెలో పెద్దఎత్తున పాల్గొంటున్నారని బోస్ చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు యాదగిరి, మహేష్, జయమ్మ, లక్ష్మి, యాదమ్మ, జనార్ధన్, హేమలత, బాలమణి, మిరియాల సాయిలు తదితరులు పాల్గొన్నారు.

విత్తన కంపనీల తనిఖీ

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : వ్యవసాయ శాఖ జిల్లా టాస్క్ ఫోర్స్ టీం ఆధ్వర్యంలో గండి మైసమ్మ దుండిగల్, కుత్బుల్లాపూర్, బాలానగర్ మండలంలో గల వివిధ విత్తన కంపెనీల్లో తనిఖీలు నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ ఆధ్వర్యంలో ఎం.శివకుమార్ విత్తన ధ్రువీకరణ అధికారి హైదరాబాద్ వారు మండల వ్యవసాయ అధికారి యాదగిరి, బాలనగర్ మండల వ్యవసాయ అధికారి సాయి రమేష్, కొంపల్లిలోని నూజివీడు సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కుత్బుల్లాపూర్ మండలంలోని తెలంగాణ స్టేట్ సీట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ విత్తన కంపెనీలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ప్రతి విత్తన కంపెనీ నాణ్యమైన విత్తనము తయారు చేయాలని స్టాక్ రిజిస్టర్, స్టాక్ బోర్డులు విత్తన నిల్వలను పరిశీలించడం జరిగింది. ఎవరైనా కంపెనీవారు అనుమతి లేని విత్తనాలు గాని, నాణ్యతలేని విత్తనాలు గానీ సరఫరా చేస్తే విత్తన చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

సమస్యలు పరిష్కరించాలి : సీపీఐ

విశాలాంధ్ర, మల్కాజిగిరి : భారత కమ్యూనిస్టు పార్టీ అల్వాల్ మండల సమితి ఆధ్వర్యంలో అస్మాన్ పేట్ శాఖ, దుబాయ్ గేట్ శాఖా మహా సభలు నిర్వహించారు. ఈ కార్యక్రమం సీపీఐ మండల సహాయ కార్యదర్శి సల్మాన్ బేగ్ అధ్యక్షతన జరిగింది. శాఖ మహా సభలలో ముఖ్య అతిథిగా మండల కార్యదర్శి కే.సహదేవ్ మాట్లాడుతూ అస్మాన్‌పేట్‌లో ఉన్నటు వంటి సమస్యలను పరిష్కరించాలని, సమస్యల మీద, ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని, గ్రామ సభల్లో పరిష్కరించాలని లేనిపక్షంలో సీపీఐ పార్టీ ముందుండి పోరాటం చేసి సాదిస్తుందని తెలియజేశారు. ఈ సమావేశంలో మండల సహాయ కార్యదర్శి పి.చంద్రయ్య, రైతు సంఘం నాయకులు జంగయ్య, సిపిఐ పార్టీ నాయకులు ఏ.బాబు, నరేంద్ర చారి తదితరులు పాల్గొన్నారు. అస్మాన్ పేట్ శాఖ కార్యదర్శిగా మోసిన్ ఖాన్, సాయి కార్యదర్శిగా ఇమ్రాన్, అదే విధంగా దుబాయ్ గేట్ సంబంధించి శాఖ శాఖ కార్యదర్శిగా కాజా పాషా, కార్యదర్శిగా ఎం.డి ఖలీల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని వినతి

విశాలాంధ్ర-బషీర్ బాగ్: నిరుద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గం శాసనమండలి సభ్యుడు అంజి రెడ్డికి నిరుద్యోగుల ఫోరం అధ్యక్షుడు అనుజ్ కుమార్ వినతి పత్రాన్ని అందజేశారు. నిరుద్యోగుల సమస్యలపై శాసన మండలిలో చర్చిస్తానని హామీ ఇచ్చినట్లు అనుజ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా నిరుద్యోగుల ఫోరమ్ క్యాలెండర్ 2025 ను అందజేశామని వెల్లడించారు. నిరుద్యోగ భృతి, గ్రూప్ - 4 బ్యాక్‌లాగ్ ఖాళీలు తక్షణమే భర్తీ చేయాలని కోరారు. నిరుద్యోగుల కోసం నైపుణ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.నిరుద్యోగుల ఫోరం విన్నపని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తానని ఎమ్మెల్సీ అంజి రెడ్డి హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

స్మశానవటిక అభివృద్ధి పరిశీలన

విశాలాంధ్ర రాజేంద్రనగర్ : రాజేంద్రనగర్ నియోజకవర్గం మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని వినాయక నగర్ ప్రాంతంలో శ్మశాన వాటిక స్థలం కబ్జాకు గురైందని వడ్డెర సంఘం సభ్యులు కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకొని రావడంతో రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ ఇంచార్జ్ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి జీహెచ్ఎంసి అధికారులతో కలిసి శ్మశాన వాటిక లో పనులపై అధికారులతో కలిసి పర్యవేక్షించడం జరిగింది. ముఖ్యంగా ప్రహరీ గోడ కాంపౌండ్ వాల్ వెయిటింగ్‌హాల్, బోర్ తాగు నీరు మరుగు దొడ్లు తదితర అంశాలపై అధికారులతో కలిసి చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ శ్మశాన వాటిక కు సంబంధించిన అభివృద్ధి పనుల మంజూరు పనులకు సంబంధించిన ప్రతిపాదనలను వెంటనే పంపించాలని అధికారులకు ఆదేశించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సంపంగి నరసింహ, సంపంగి బలరాజ్, శ్రీను, బోధస్ హరి కృష్ణ, బోధస్ శ్రీను, బోధస్ రాజు, వల్లేపూ ప్రసాద్, సురేష్, ఎన్ను శ్రీనివాస్ రెడ్డి, ఎన్ను శంకర్ రెడ్డి, దండుగుల ప్రసాద్, ఇంద్ర తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర మొయినాబాద్: ఆప్యాయ పలకరింపులు.. ఆత్మీయ కరచాలనాలు.. భావోద్వేగ సన్నివేశాలు వెరసి పూర్వ విద్యార్థుల సమ్మేళానికి వేదికయింది. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన 2009-10 పదో తరగతి బ్యాచ్ కు చెందిన విద్యార్థులు ఒకే చోట చదువు పూర్తి చేసుకున్నారు. అనంతరం 15 ఏళ్ల తరువాత పూర్వ విద్యార్థుల సమ్మేళన పేరిట ఆత్మీయ సమ్మేళాన్ని మంగళవారం మండలంలోని అజీజ్ నగర్ పరిధిలోని ఓ రిసార్టులో ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా అప్పట్లో విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఆహ్వానించి ఘనంగా సత్కారించి జ్ఞాపికలను అందజేశారు. పూర్వ విద్యార్థులు 15 ఏళ్ల తరువాత కలుసుకోవడంతో గతాన్ని నెమరేసుకొని ఆనంతంగా గడిపారు. ఒకరితో ఒకరు గతాన్ని పంచుకున్నారు.భవిష్యతులో ఎవరికి కష్టం వచ్చిన వచ్చినా తోటి స్నేహితులకు అండగా నిలబడాలనే నిర్ణయం తీసుకున్నారు. 15 ఏళ్ల తరువాత ఒకే చోట చేరడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయింది. ఈ ఆత్మీయ సమ్మేళనంలో ఉపాధ్యాయులు తాజ్ బాబు, అంజయ్య, కృష్ణారెడ్డి, కళావతి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా కృషి: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-దుండిగల్: నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని బీఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ పేర్కొన్నారు. మంగళవారం నియోజకవర్గం 126 - జగద్గిరిగుట్ట డివిజన్ భూదేవి హిల్స్‌లో నూతనంగా చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ పనులకు బీఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద మాట్లాడుతూ గత పదేళ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి పరిచామని, చేసిన అభివృద్ధిని చూసే ఆయనను మూడవ సారి భారీ మెజారిటీతో గెలిపించిన ప్రజలకు ఎల్లవేళలా కృతజ్ఞుడై ఉంటానని, రానున్న రోజుల్లో భూదేవి హిల్స్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన నియోజకవర్గంగా అభివృద్ధి పరుస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జగన్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, సీనియర్ నాయకులు బాబు గౌడ్, విఠల్, శశిధర్, జైహింద్, తిరుమల్ రెడ్డి, మల్లా చారి, తిరుపతి, దినేష్, సత్యనారాయణ, మెట్ల శ్రీను, ఎర్ర లక్ష్మయ్య, బ్రహ్మానంద చారి, మహంకాళి, వెంకటేష్, అజం, ప్రభాకర్, ఆంజనేయులు, నాగరాజు, ముంతాజ్, నవీన్, రాజు, సురేష్, మధు, సోమయ్య, తారా సింగ్, మహిళా నాయకురాలు త్రివేణి, మంజుల, పార్వతీ తదితరులు పాల్గొన్నారు.

సీబీఎస్ఈలో ఆక్స్ ఫర్డ్ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-బషీర్ బాగ్: ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ హై స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు స్కూల్ వైస్-చైర్‌పర్సన్ శ్రీమతి ప్రార్థన మణికొండ తెలిపారు. పోలెపెద్ది లాస్య శ్రీకరి(97.17), అర్షీల్ రాహుల్ షా(96.17), బండరు వి.ఐ.అగస్త్య(95.33), శ్రేయాంష్ మెహతా(95.17), జాన్వి భగవాని(94.33), ఆర్కిట్ చవన్(93.33), బౌమిక్ ఎస్.వి.ఎన్.ఎల్.నాయుడు(92.00), సంజన చౌహాన్(92.17), కునాల్ సింగ్(92.33), పప్పుల సాయి విదాత్(92.33), నేహాల్ చేతల(92.33), తిమ్మసారథి భువన కుమార్(92.00), పృథ్వీ అగర్వాల్(91.50)పునీత్ శర్మ(90.83) సాధించినట్లు తెలిపారు. స్కూల్ కరస్పాండెంట్ కట్టా ప్రభాకర్ విద్యార్థులను అభినందించారు.

రైల్వే భద్రతపై సమీక్ష

విశాలాంధ్ర, హైదరాబాద్ : దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ రైలు కార్యకలాపాల నిర్వహణలో భద్రత కోసం తీసుకోవలసిన చర్యలపై సమగ్ర సమీక్షా సమావేశాన్ని మంగళవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు జనరల్ మేనేజర్ నీరజ్ అగ్రవాల్, వివిధ శాఖలకు చెందిన ప్రధానాధిపతులతోపాటు మొత్తం 6 డివిజన్లు సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్లు, గుంటూరు మరియు, నాందేడ్ డివిజనల్ రైల్వేమేనేజర్లు (డి.ఆర్.ఎమ్‌లు) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సమావేశంలో పాల్గొన్నారు. అరుణ్ కుమార్ జైన్ జోన్ రైలు కార్యకలాపాల భద్రతపై వివరణాత్మక సమీక్ష నిర్వహించారు. ఎప్పటికప్పుడు జారీ చేసిన రైల్వే బోర్డు మార్గదర్శకాల ప్రకారం భద్రతా నియమాలు మరియు విధానాలను ఖచ్చితంగా పాటించాలని ఆయన అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. రైలు కార్యకలాపాలలో భద్రతను నిర్ధారించడంపై ఆయన నొక్కిచెప్పారు. ఎటువంటి సత్వర పద్ధతులను అనుసరించవద్దని ఆదేశించారు. విధి నిర్వహణలో ఎలాంటి చిన్న పొరపాట్లు జరగకుండా మరింత అప్రమత్తంగా ఉండాలని ఆయన అధికారులు, సిబ్బందికి సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో అరుణ్ కుమార్ జైన్ వర్షాకాలం దృష్ట్యా రుతుపవనాలు ప్రభావితమయ్యే అవకాశం ఉన్న విభాగాలు, వంతెనలు, సొరంగాలు వాటి నిర్వహణ స్థితిపై ప్రాథమిక దృష్టిని పెట్టారు. ట్రాక్‌లపై వరదలు రాకుండా రైళ్లు సజావుగా నడిచేలా సైడ్ వాటర్ డ్రెయిన్‌లు, జలమార్గాలను శుభ్రపరచడం, నిర్వహణ చేయడం, అదనపు జలమార్గం ఏర్పాటు చేయడం వంటి వాటిని నిర్ధారించాలని జనరల్ మేనేజర్ సంబంధిత అధికారులకు తెలియజేశారు. పరికరాలు సురక్షితంగా పనిచేసే స్థితిని నిర్ధారించుకోవాలని, అవసరమైన అన్ని వర్షాకాల జాగ్రత్తలు తీసుకోవా లని ఆయన అధికారులకు సూచించారు. అరుణ్ కుమార్ జైన్ అగ్నిమాపక భద్రత, సిగ్నలింగ్ వ్యవస్థలకు సంబంధించి జోన్‌లో నిర్వహిస్తున్న వివిధ భద్రతా డ్రైవ్‌ల పురోగతిని కూడా సమీక్షిం చారు. ఆరు డివిజన్లలో లోకో పైలట్లు, అసిస్టెంట్ లోకో పైలట్లు వారి కుటుంబ సభ్యుల కోసం చేపడుతున్న సమగ్ర కౌన్సెలింగ్ సెషన్‌ల స్థితిని ఆయన సమీక్షించారు.

పచ్చి రొట్ట పంటల సాగుతో లాభాలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తల సహకారంతో 566 రైతు వేదికలలో ప్రతి మండలానికి ఒకటి చొప్పున దృశ్య శ్రవణ పరికరాలు ఏర్పాటు చేసి రైతులతో నేరుగా మాట్లాడే ' రైతు నేస్తం' కార్యక్రమాన్ని ప్రారంభించింది. రైతు నేస్తం కార్యక్రమంలో ప్రస్తుతం కొనసాగుతున్న వ్యవసాయ, అనుబంధ శాఖల కార్యకలాపాలపై రైతు సమాజానికి అవగాహన కల్పించడానికి ప్రతి మంగళవారం, ఈ కార్యక్రమాన్ని నిర్వహించబడుతుంది. ఇప్పటివరకు 53 వారాలు నిర్వహించి 5,65,466 మంది రైతులకు శిక్షణ ఇవ్వడం జరిగింది. 53వ ఎపిసోడ్ కార్యక్రమములో డా.జె.ఎస్.సుధారాణి, అగ్రానమి శాస్త్రవేత పొలాలలో పచ్చి రొట్ట పంటల సాగు వలన కలిగే లాభాల గురించి వివరించినారు. జనుము, జీలుగ, పిల్లి పెసర, జిల్లేడు, గ్లైరిసీడియా, పెసర మొదలగు పప్పు జాతి పంటలను పెంచుకొని, పూత దశలో భూమిలో కలియదున్నడం వలన మొక్కలకు కావలసిన అన్ని పోషకాలను అందించడమే కాకుండా, భూమిలో మేలు చేసే సూక్ష్మ జీవులు వృద్ధి చెందుతాయని, భూమిలో సేంద్రియ పదార్థం అభివృద్ధి చెంది, నాణ్యమైన పంట వస్తుందని తెలియజేసారు. వనపర్తి జిల్లా కలెక్టరు జిల్లా వనపర్తి ఆదర్శ సురభి రైతు వేదికలో పాల్గొని వారి సందేశాన్ని ఇచ్చారు. డాక్టర్ సిహెచ్. రాజాగౌడ్, సీనియర్ సైంటిస్ట్ ఉద్యానవన పరిశోధన సంస్థ, మల్లేపల్లి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో నిమ్మ, బత్తాయి పండిరచే రైతులు ఈ ఉష్ణోగ్రతలో తీసుకొనవలసిన జాగ్రత్తలు, సమగ్ర నీటి యాజమాన్యం ఎరువులు వాడే విధానాన్ని వివరించారు. తెలంగాణ వెటర్నరీ విశ్వవిద్యాలయం డాక్టర్ జి శ్రీనివాస్, సైంటిస్ట్, పీవీ.నరసింహారావు మాట్లాడుతూ కోళ్ల పరిశ్రమ వల్ల రైతులకు కలిగే లాభాలు అందులో ముఖ్యంగా రైతు సోదరులు ప్రతి ఇంట్లో కోళ్లను ఏ విధంగా పెంచాలి, వాటి వల్లే కలిగే లాభాలు, అలాగే కోడికి వచ్చిన వ్యాధి కంటే ముందుగానే నివారించుకోవడం చాలా మంచిదని తెలియజేశారు. జాయింట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ వై. సుచరిత మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదిగానే ఈ సంవత్సరం కూడా పచ్చి రొట్ట విత్తనాలు సబ్సిడీ రూపంలో రైతులకు ప్రతి జిల్లాలో మండలంలో అందుబాటులో ఉంటాయని రైతు సోదరులు వాటిని ఉపయోగించుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని 566 రైతు వేదికల నుంచి జిల్లా వ్యవసాయ అధికారులతో పాటు వ్యవసాయ శాఖ సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు. రైతులు పలు సందేహాలను నివృత్తి చేసుకొన్నారు.

జగ్గారెడ్డి క్షమాపణ చెప్పాలి: చెన్నారావు

విశాలాంధ్ర, మల్కాజిగిరి : తెలంగాణ ఉద్యమ నేత, పార్లమెంట్ సభ్యులు, ప్రజాదరణ కలిగిన నేత ఈటల రాజేందర్‌పై కాంగ్రెస్ పార్టీకి చెందిన జగ్గారెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని జాతీయ సంగీత కళాకారుల సంఘం జాతీయ అధ్యక్షులు ఎల్.వి. చెన్నారావు పేర్కొన్నారు. మంగళవారం ఆనంద్‌బాగ్‌లోని శంకర మంఠంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ నాయకులు జగ్గారెడ్డి తన విచక్షణ కోల్పోయి ఈటెల రాజేందర్ దుషించడం జగ్గారెడ్డి అవివేకమన్నారు. రేవంత్ రెడ్డి మెప్పు పొందడానికి జగ్గారెడ్డి ఈ విధమైన వాఖ్యలు చేశారన్నారు. బీసీ వర్గాలు రాజకీయంగా ఎదగడాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు జీర్ణించుకోలేరని, కాంగ్రెస్ పార్టీలో బీసీలకు ప్రాధాన్యత లేదన్నారు. బీసీ నేతగా ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందమే కాక, ప్రజాదరణ పొందిన వ్యక్తి ఈటెల రాజేందర్ అని, ప్రజా శ్రేయస్సు కోసం, అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని మాట్లాడడే తప్ప ఏ ఒకరినో వ్యక్తి గతంగా టార్గెట్ చేసి ఈటెల రాజేందర్ ఏ రోజు కూడా మాట్లాడలేదని, అది అర్థం చేసుకోలేని వ్యక్తులు ఇలాంటి చౌకబారు వ్యాఖ్యలు చేస్తుంటారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జగ్గారెడ్డి తక్షణమే ఈటెల రాజేందర్‌కు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో వాయిద్య కళాకారుల అంతా కలిసి జగ్గారెడ్డి ఇంటి చుట్టూ వాయిద్యాలతో తాము నిరసన వ్యక్తం చేస్తామని ఆయన హెచ్చరించారు. బీజేపీ సీనియర్ నాయకులు ప్రియతం రామకృష సంఘం నాయకులు వేముల శ్రీనాద్, హుస్సేన్, శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మినారాయణ తదితరులు పాల్గన్నారు.

పోస్ట్ ఆఫీస్ సమస్య పరిష్కరించాలి

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: చందానగర్ పరిసర ప్రాంతాలలో ఉంటున్న సీనియర్ సిటిజన్స్, మహిళల అభ్యర్థన మేరకు ఈరోజు పోస్ట్ ఆఫీస్ కార్యాలయాన్ని సందర్శించి అక్కడ నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఉన్నతాధికారులను రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నియోజకవర్గ ఇన్చార్జ్ రవికుమార్ యాదవ్, సభ్యులు బుచ్చిరెడ్డిని కోరారు. రవి కుమార్ యాదవ్ మాట్లాడుతూ చందానగర్‌లో ఉంటున్నటువంటి పోస్ట్ ఆఫీస్ కార్యాలయం ఎన్నో సంవత్సరాలుగా సరైన వసతులు లేక స్థానిక ప్రజలు, సీనియర్ సిటిజన్స్ అనేక విధాలుగా ఇబ్బందులు పడడమే కాకుండా పార్కింగ్ సమస్య అక్కడ ఉన్నటువంటి సిబ్బందికి సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని రవి కుమార్ యాదవ్ తెలిపారు. ఈ విషయంపై స్థానిక పార్లమెంటు సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి ఆయన ద్వారా సంబంధిత అధికారులకు కార్యాలయ మార్పుకు చర్చించి పై అధికారులకు లెటర్ ద్వారా ఆదేశాలు జారీ చేయించామని , ఈ కార్యాలన్నీ వెంటనే ప్రజలకు ఆమోదయోగ్యమైన ప్రాంతానికి లేదా ప్రస్తుతం ఉన్న బిల్డింగ్ పై అంతస్తు నుండి గ్రౌండ్ ఫ్లోర్‌కు మార్చే విధంగా తగు చర్యలు తీసుకోవాలని స్థానిక అధికారులను కోరుతూ అవసరమైతే ఎంపీతో ఉన్నతాధికారులతో మాట్లాడి మా యొక్క పూర్తి సహాయ సహకారాలు అందించి స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలవకుండా అందరికీ అందుబాటులో ఉండే విధంగా పోస్ట్ ఆఫీస్ కార్యాలయం ఉండాలని పోస్ట్ మాస్టర్ వెంకటేష్ గౌడ్‌ని కోరుతూ వినతి పత్రం అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, రామ్ రెడ్డి, శ్రీనివాస్ ,వెంకటేష్,కృష్ణమూర్తి, శేఖర్ ముదిరాజ్ ,శంకర్ రెడ్డి, పృధ్వి గౌడ్ పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యాత ప్రమాణాలు పాటించాలి : కార్పొరేటర్

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోనీ నానక్ రామ్ గుడాలో రూ.68.00 లక్షలతో నూతనంగా చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం కాలనీ వాసులు, జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ అధికారులతో కలిసి గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ సీసీ రోడ్ నిర్మాణ పనుల్లో నాణ్యతా విషయంలో ఎక్కడా కూడా రాజీ పడకుండా నాణ్యత ప్రమాణాలను పాటించే విధంగా ఎప్పటికప్పుడు అధికారుల పర్యవేక్షణ ఉండాలని అదేవిధంగా రాబోవు కాలంలో కాలనీ వాసులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా లెవెల్స్ సరి చూసుకుంటూ వీలైనంత త్వరగా సీసీ రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని అధికారులకు వారు సూచించారు. గచ్చిబౌలి డివిజన్‌లో ప్రణాళిక బద్దంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అదేవిధంగా భవిష్యత్తులో కూడా మరిన్ని పనులు చేపట్టి కాలనీలలో మౌలిక వసతులు కల్పించి ఆదర్శవంతంగా తీర్చిదిద్దు తామన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తన దృష్టికి తీసుకు వచ్చిన వెంటనే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడిం చారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఏఈ రషీద్, గచ్చిబౌలి డివిజన్ అధ్యక్షులు శివ సింగ్, సీనియర్ నాయకులు కైలాష్ సింగ్,సుమన్,శ్రీకాంత్ రెడ్డి, బాబ్లీ సింగ్, గోపాల్, గణేష్ సింగ్, రంజిత్ సింగ్, విశాల్, విక్కీ,శంకేష్, శ్రీను, వర్క్ ఇన్స్పెక్టర్ భిక్షపతి, నానక్ రామ్ గుడా వాసులు, నేతలు, తదితరులు పాల్గొన్నారు.

అమారిస్ జ్యువెల్స్ ఫ్లాగ్‌షిప్ బోటిక్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - హైదరాబాద్ : సమకాలీన ఫైన్ జ్యువెలరీలో ప్రసిద్ధి చెందిన అమారిస్ జ్యువెల్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని బంజారా హిల్స్‌లో వేదికగా తన ఫ్లాగ్‌షిప్ స్టాండ్-ఎలోన్ బోటిక్‌ను ప్రారంభించినట్లు గర్వంగా ప్రకటించింది. ఇది దక్షిణ భారతదేశం అంతటా తన బ్రాండ్ విస్తరణలో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుంది. ఈ ప్రారంభోత్సవానికి సుధారెడ్డి, బాబీ కాందరి, అర్చి పొరంజి, డా.మంజుల అనగాని, డా.కమల అనగాని, డా.కవిత కోవి, సమన పర్చురీలు హాజరయ్యారు. ప్రముఖ డిజైనర్ ప్రేరణ రాజ్‌పాల్ స్థాపించిన అమారిస్, ఆధునిక భారతీయ విలాస వైభవాన్ని పునర్నిర్వచించడంలో ప్రసిద్ధి చెందింది. అంతర్జాతీయ డిజైన్ కోడ్‌లను భారతీయ వారసత్వంతో మిళితం చేసే విలక్షణమైన సౌందర్యంతో, వ్యక్తిత్వం, భావోద్వేగం, నిర్భయ శైలిని ప్రదర్శించే ఆభరణ సౌందర్యానికి బ్రాండ్ నమ్మకమైన అనుచరులను సంపాదించుకుంది. బోటిక్ అరంగేట్రాన్ని గుర్తుచేసేందుకు, అమరిస్ 'హైఫన్'ను ఆవిష్కరించింది. ఇది ఉత్తర, దక్షిణ ప్రపంచాల సమావేశాన్ని జరుపుకునే ఒక ప్రత్యేకమైన క్యాప్సూల్ సేకరణ. సంప్రదాయం, ఆధునికత, వారసత్వం, వ్యక్తిత్వ సమ్మేళనం. అరుదైన జాంబియన్ పచ్చలు, స్పష్టమైన కుంజైట్‌లు, టూర్‌మలైన్‌లు, ఎఫ్ జి రంగు వజ్రాలను కలిగి ఉన్న ప్రతి డిజైన్, బ్రాండ్ యొక్క సౌందర్యం, నైపుణ్యం యొక్క సిగ్నేచర్ మిశ్రమాన్ని కలిగి ఉంటుంది. 2,750 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న కొత్త అమారిస్ స్టోర్ రిటైల్ స్థలం కంటే ఎక్కువ కావడం గమనార్హం. మహిళల కోసం రూపొందించబడిన ఈ ఆధునిక అమరిస్ బోటిక్, అత్యాధునిక హస్తకళ, డిజిటల్ ఆవిష్కరణలతో పాటూ వ్యక్తిగత కథ చెప్పడంలో లోతైన విలాసవంతమైన క్యూరేటోరియల్ విధానాన్ని కలిపిస్తుంది.

ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర - ఆమనగల్లు: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు, రామ్‌రెడ్డి లయన్ ఐ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటుచేసిన ఉచిత కంటి వైద్యశిబిరాన్ని జిల్లా చెర్మన్ లయన్ బి. యాదయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా అప్తాలమిక్ ఆఫీసర్ యం చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ కళ్ళను శుచి శుభ్రత పాటించాలని 50సం దాటిన ప్రతి ఒక్కరు 6 నెలలకు కంటి పరీక్షలు విధిగా చేయించుకోవాలని కంటి శుక్లలు ఉన్నవారికి కంటి ఆపరేషన్లు చేయించి తిరిగి చూపు అందేల లయన్స్ క్లబ్ అమనగల్లు కృషి చేస్తుందన్నారు. మధుమేహ వ్యాధి గ్రస్తులు బీసీ ఉన్నవారు తప్పకుండ ప్రతి 6 నెలలకు ఒక్కసారి కంటి పరీక్షలు చేయించుకోవాలి. శిబిరంలో 72 మంది పరీక్షలు 45 మందిని ఐఓఎల్ ఆపరేషన్ నిమ్మితం రాంరెడ్డి లయన్స్ ఐ హాస్పిటల్ తరలించినట్లు క్లబ్ పిఆర్ఓ పాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ జిల్లా చెర్మన్ బి. యాదయ్య, లయన్స్ క్లబ్ సంయుక్త కార్యదర్శి ఎంగలి బాలకృష్ణ, సభ్యులు కర్నాటి కొండల్ రెడ్డి, పిఆర్ఓ పాషా ఆసుపత్రి సిబ్బంది గుజ్జరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బండారి రాజిరెడ్డి సేవలు మరువలేనివి

విశాలాంధ్ర, కాప్రా : ఉప్పల్ నియోజకవర్గానికి తన సోదరుడు దివంగత బండారి రాజిరెడ్డి చేసిన సేవలు మరువలేనివి అని ఆయన చూపిన మార్గంలో ముందుకు సాగాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. డాక్టర్ ఏఎస్ రావు నగర్ డివిజన్ పరిధిలోని సౌత్ కమలనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంతాప సభలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.తన తుదిశ్వాశ వరకు ప్రజల కోసమే ఆలోచించే వ్యక్తి రాజిరెడ్డి మరణం అందరి కీ తీరని లోటని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సోమ శేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ పావని రెడ్డి, కమల నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రాఘవ రెడ్డి, మహిపాల్ రెడ్డి,కుమార స్వామి, రహీం, మురళి, పంతులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. ప్రముఖ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, కాప్రా మున్సిపల్ మాజీ చైర్మన్, ఉప్పల్ శాసనసభ నియోజకవర్గ తొలి శాసనసభ్యుడు, టిటిడి బోర్డు మాజీ సభ్యుడు ,సంఘ సేవకుడు ,నిగర్వి ,విలువలకు ప్రాధాన్యత ఇచ్చే రాజకీయ నాయకుడు దివంగత బండారి రాజిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసిన దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ళ శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంజీ విండ్సర్ ప్రో కారు ఆవిష్కరణ

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: జేఎస్‌డబ్ల్యు ఎంజీ మోటార్ ఇండియా సంస్థ తన ఎంజీ విండ్సర్ ప్రో కారును హైదరాబాద్ ఎల్‌బీనగర్‌లని పీపీఎస్ మోటార్స్ ఎంజీ షోరూంలో ఆవిష్కరించింది. మరిన్ని సాంకేతిక, భద్రతా ఫీచర్లతో ఈ కారు బిజినెస్ క్లాస్ ప్రయాణ అనుభవాన్ని అందిస్తుంది. దాంతోపాటు కొత్త 52.9 కేడబ్ల్యుహెచ్ బ్యాటరీ ప్యాక్ ఉంటుంది. ఎంజీ విండ్సర్‌కు ఇప్పటికే కస్టమర్ల నుంచి మంచి స్పందన లభించింది. ఇప్పుడు ప్రో సిరీస్ దీని మార్కెట్ పనితీరును మరింత మెరుగుపరుస్తుంది. రూ. 12.49 లక్షలు ం కి.మీ.కి రూ.4.5 ఎక్స్ షోరూం ధరతో పాటు మొదటి 8వేల బుకింగ్‌లకు రూ. 17,49,800 ధరకు అందుబాటులో ఉంది. ఈవీలకు శరవేగంగా మారుతున్న తీరును ఎంజీ విండ్సర్ ప్రో మరింత పెంచనుంది. సరికొత్తగా బ్యాటరీ యాజ్ ఎ సర్వీస్ - బాస్ పద్ధతిని వినియోగదారులకు అందించేందుకు ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, కోటక్ మహీంద్ర ప్రైమ్ సంస్థలతో జేఎస్‌డబ్ల్యు ఎంజీ మోటార్ ఇండియా ఒప్పందం చేసుకుంది. ఇది భారతీయ వాహన కొనుగోలుదారులకు ఈ పద్ధతిని చేరువ చేస్తుంది. ఈ వినూత్నమైన పథకాన్ని 2024 సెప్టెంబరులో తొలిసారి ప్రారంభించారు. ఇప్పుడు బజాజ్ ఫిన్ సర్వ్, హెరాఫియాన్ కార్ప్, ఈకోఫై, విద్యుత్‌టెక్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, కోటక్ మహీంద్ర ప్రైమ్ వంటి ఆరు ఆర్థిక సంస్థలు మద్దతు ఇస్తున్నాయి. ఎండీ విండ్సర్ ప్రో మొదటి యజమానికి కంపెనీ జీవితకాల బ్యాటరీ వారంటీ ఇస్తుంది. దాంతోపాటు జేఎస్‌డబ్ల్యు ఎంజీ మోటార్ ఇండియా సంస్థ ఎంజీ విండ్సర్ ప్రో కోసం తన 3-60 హామీతో పాటు బైబ్యాక్ ప్రణాళికను అందించనుంది. ఇది 3 సంవత్సరాల తర్వాత కూడా కారు విలువలో 60%ను కాపాడుకుంటుందనే హామీ ఇస్తుంది.

ఉద్యాన సాగుతోనే రైతుకు అత్యధిక ఆదాయం: చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: గోదావరి, కృష్ణా డెల్టా మినహా రాష్ట్రంలో మిగిలిన అన్ని ప్రాంతాల్లోనూ ఉద్యానవన సాగును విస్తృతంగా ప్రోత్సహించాలని... రైతుకు ఎకరాకు ఏడాదికి కనీసం లక్ష రూపాయలు ఆదాయం ఆర్జించడమే లక్ష్యం కావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులతో అన్నారు. మంగళవారం సచివాలయంలో హార్టికల్చర్‌పై సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి అధికారులకు కీలక సూచనలు చేశారు. మిరప, అరటి, మామిడి, ఆయిల్ పామ్, కోకో, డ్రాగన్ ఫ్రూట్, జీడిమామిడి, కాఫీ, కొబ్బరి, టమాటా, ఉల్లి... ఈ 11 ప్రాధాన్య పంటలతో రాష్ట్రంలో 24 క్లస్టర్లు ఏర్పాటు చేసి రైతులకు తోడ్పాటు అందించాలని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో 18.23 లక్షల హెక్టార్లలో ఉన్న ఉద్యానవన సాగును, వచ్చే ఐదేళ్లలో రెట్టింపు చేయాలన్నారు. ఆయిల్ పామ్, కోకో, కొబ్బరి పంటల డిమాండ్ దృష్ట్యా రైతులకు ఈ పంటల సాగు విషయంలో అవగాహన కల్పించాలన్నారు. కోకో పంట కోసిన తర్వాత నాణ్యత విషయంలో రైతులు జాగ్రత్తలు తీసుకునేలా శిక్షణ ఇవ్వాలని సూచించారు. అలాగే వీటికి అనుబంధంగా చిన్నతరహాలో ప్రాసెసింగ్ యూనిట్లు రైతులే నెలకొల్పేలా చేస్తే మరింత ఆదాయానికి అవకాశం ఉంటుందని తెలిపారు. రైతులు పండించే పంటకు అధిక విలువ తీసుకురావడంపై దృష్టి పెట్టాలన్నారు. మైక్రో ఇరిగేషన్‌కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న సబ్సిడీని రాష్ట్రంలో రైతులు వినియోగించుకునేలా చూడాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, చిన్న రైతులకు డ్రిప్ ఇరిగేషన్‌లో ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. మరోవైపు ఉద్యానవన రంగానికి ఉన్న అవకాశాలను వివరిస్తూ ప్రతి నెలా అన్ని జిల్లాల్లో సదస్సులు నిర్వహిస్తున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. అలాగే 10 వేల హెక్టార్లలో పండ్ల సాగు చేస్తున్న రైతులకు రూ.32 కోట్ల వ్యయంతో ఫ్రూట్ కవర్లు సబ్సిడీపై అందించామని, దీంతో రైతులకు రూ.120 కోట్లు అదనంగా ఆదాయం వచ్చిందని వివరించారు. ఈ సమీక్షలో మంత్రి అచ్చెన్నాయుడు, అగ్రికల్చర్ మిషన్ కార్పొరేషన్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఏపీకి కంపెనీల 'క్యూ'

- రూ.91,839 కోట్ల పెట్టుబడులు, 1,41,407 ఉద్యోగాలు
- నెలాఖరుకు 'మనమిత్ర' ద్వారా 400 రకాల సేవలు
- మంత్రి నారా లోకేశ్

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: రాష్ట్రంలో పెద్ద ఎత్తున పరిశ్రమలు ఏర్పాటుచేయడానికి పెద్ద సంఖ్యలో కంపెనీలు వస్తున్నాయని, ఆయా కంపెనీలకు అవసరమైన అనుమతులను త్వరితగతిన మంజూరుచేసేందుకు ప్రతికంపెనీకి ఒక నోడల్ ఆఫీసర్ ను నియమించాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లి నివాసంలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల ఉన్నతాధికారులతో లోకేశ్ సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇప్పటివరకు 91 ఐటీ, ఎలక్ట్రానిక్స్ కంపెనీలు రూ.91,839 కోట్ల పెట్టుబడులతో 1,41,407 ఉద్యోగాలు కల్పించేందుకు ముందుకు వచ్చాయన్నారు. వాటికి త్వరితగతిన అనుమతులు మంజూరుచేయాలని, సాధ్యమైనంత త్వరగా కంపెనీలు ఏర్పాటుచేసేలా సంబంధిత కంపెనీల ప్రతినిధులతో సంప్రదింపులు జరపాలని సూచించారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో ఐటి, ఎలక్ట్రానిక్స్ ఉద్యోగాలు కీలకపాత్ర పోషిస్తాయని చెబుతూ... రాబోయే అయిదేళ్లలో ఐటి, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 5లక్షల ఉద్యోగాలు కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని లోకేశ్ స్పష్టం చేశారు. ఐటీ కంపెనీలకు ప్రోత్సాహక బకాయిలను వెంటనే చెల్లించాలని, రాష్ట్రవ్యాప్తంగా వీడియో కాన్ఫరెన్స్ ఎక్విప్ మెంట్ ను ఆధునీకరించాలని ఆదేశించారు. విశాఖ నగరాన్ని అత్యాధునిక సాంకేతికతల కేంద్రంగా, ఐటి హబ్ గా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకోసం ప్రణాళికలు రూపొందించాలని కోరారు.

నెలాఖరుకు 'మన మిత్ర' ద్వారా 400 రకాల పౌర సేవలు

ప్రభుత్వానికి సంబంధించిన పౌరసేవలన్నీ వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అందుబాటులో ఉంచాలని, ప్రస్తుతం అందుబాటులో ఉన్న 317రకాల సేవలను నెలాఖరుకు 400 వరకు విస్తరించాలని ఆదేశించారు. రెవిన్యూశాఖతో పాటు వివిధరకాల సేవల సమయాన్ని తగ్గించేలా చర్యలు తీసుకోవాలి. ప్రతి సర్టిఫికెట్ బ్లాక్ చెయిన్, క్యూఆర్ కోడ్ తో నిర్ధారించుకునేలా టెక్నాలజీతో అనుసంధానం చేయాలి. మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీలు, పంచాయితీల్లో పన్నుల బకాయిల వివరాలు వాట్సాప్ లో వచ్చేలా ఏర్పాట్లు చేయాలి. బకాయిలకు సంబంధించి ఎప్పటికప్పుడు అలర్ట్ మెసేజ్ లు పంపేలా చూడాలి. ఆర్టీజీఎస్ కు సంబంధించి డేటా పాయింట్లు, కేపీఈలను ఇంటిగ్రేట్ చేయాలి. భారత ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రాధాన్య పథకాలనకు సంబంధించి రియల్ టైమ్ సమాచారాన్ని ఆర్టీజీఎస్‌లో పొందుపర్చాలి. సచివాలయం నుంచి గ్రామస్థాయికి పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ ను అనుసంధానం చేసి, తుపానులు, వరదలు, పిడుగులు పడటం వంటి వాతావరణ సమాచారాన్ని రియల్ టైమ్ లో అందించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. వివిధ శాఖలకు సంబంధించి సమాచారాన్ని అంతంటినీ ఏకీకృతం చేసి ఒక వెబ్ సైట్ లో పొందుపర్చి ఎఐ ఎనేబుల్ చేసేలా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వానికి సంబంధించి అన్నిరకాల జీఓలు, యాప్ లను సింగిల్ ప్లాట్ ఫాంపైకి తెచ్చి ఒకే వెబ్ సైట్ లో అందుబాటులోకి తేవాలని మంత్రి లోకేశ్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఐటి అండ్ సి సెక్రటరీ కాటంనేని భాస్కర్, స్పెషల్ సెక్రటరీ బి.సుందర్, ఎకనమిక్ డెవలప్ మెంట్ బోర్డు సిఇఓ సాయికాంత్ వర్మ, ఏపి టెక్నాలజీ సర్వీసెస్ ఎండి సూర్యతేజ్, ఆర్టీజీఎస్ సీఈవో ప్రకార్ జైన్ పాల్గొన్నారు.

ఏపీ భవన్‌లో ఆగిన ఆక్రమణల తొలగింపు

ప్రజల మనోభావాలు దెబ్బతినే చర్యలు వద్దంటూ సీఎం ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: దిల్లీ ఏపీ భవన్‌లో బాలాజీ మందిరం కూల్చివేతను నిలిపివేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంబంధిత అదికారులను ఆదేశించారు. రాష్ట్ర విభజనలో భాగంగా ఏపీ భవన్ స్థలాన్ని రెండు తెలుగు రాష్ట్రాలు పంచుకున్న విషయం తెలిసిందే. ఈ ప్రాంతంలో కొత్త భవనం నిర్మించేందుకు అవసరమైన చర్యలను రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం చేపట్టింది. ఏపీ భవన్ ప్రాంగణంలో 0.37 ఎకరాల్లో వివిధ ఆక్రమణలు ఉన్నట్లు అధికారులు తేల్చారు. వాటి తొలగింపునకు సంప్రదింపుల ద్వారా, చట్టబద్దంగా గత నెల నుంచి తీసుకున్న చర్యలను సీఎం చంద్రబాబుకు అధికారులు వివరించారు. అక్రమ నిర్మాణాలను తొలగించడంతో పాటు అదే ప్రాంతంలో ఉన్న రెండు ప్రార్థనా మందిరాలను కూడా తొలగించే ప్రక్రియ చేపట్టాల్సి ఉందని అధికారులు తెలిపారు. మత సంస్థల విషయంలో ప్రజల మనోభావాలు దెబ్బతినే చర్యలు తీసుకోవద్దని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. అక్కడ స్థానికులు ఏర్పాటు చేసుకున్న దేవాలయం తొలగింపు విషయంలో అభ్యంతరాలపై అధికారులను సీఎం వివరణ కోరారు. ప్రార్థనా మందిరాల తొలగింపు విషయంలో సంయమనం పాటించాలన్నారు. ముఖ్యమంత్రి సూచనలతో నిర్మాణాల తొలగింపు ప్రక్రియను నిలిపివేశామని అధికారులు వెల్లడించారు.

వంశీకి ఊరట

సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో ఎస్సీ, ఎస్టీ కోర్టు బెయిల్ మంజూరు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: వైసీపీ నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టులో ఊరట లభించింది. టీడీపీ కార్యకర్త సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో అరెస్టయి ప్రస్తుతం విజయవాడ జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న వంశీకి ఎస్సీ, ఎస్టీ కోర్టు మంగళవారం బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో 90 రోజులకుపైగా వంశీ జైలులో ఉన్నారు. ఇంతకు ముందు రెండు సార్లు అనారోగ్యంగా ఉందని, బెయిల్ మంజూరు చేయాలని ఎస్సీ, ఎస్టీ కోర్టులో పిటిషన్లు దాఖలు చేయగా, రెండు సార్లు పిటిషన్లను కోర్టు తిరస్కరించింది. మూడో సారి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై ఇటీవల ఇరు వర్గాల తరపు న్యాయవాదుల వాదనలు వినిపించారు. తనకు అనారోగ్యంగా ఉందని, ఊపిరి తీసుకోవడానికి కూడా తీవ్రంగా ఇబ్బందిగా ఉందని న్యాయస్థానానికి వంశీ వివరించారు. డిఫెన్స్ వాదనలతో ఏకీభవిస్తూ న్యాయస్థానం వంశీకి బెయిల్ మంజూరు చేసింది. వంశీతో పాటు మరో నలుగురికి కూడా బెయిల్ మంజూరు చేసింది. గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో ఫిర్యాదుదారుడైన సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేశారన్న కేసులో వంశీని పోలీసులు అరెస్టు చేసిన విషయం విదితమే.

వీర జవాన్ మురళీ నాయక్ కుటుంబానికి జగన్ పరామర్శ

రూ.25 లక్షల ఆర్థిక సాయం

విశాలాంధ్ర–గోరంట్ల: దేశ రక్షణలో విధులు నిర్వహిస్తూ పాక్ సైనికుల కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన వీర జవాన్ మురళీ నాయక్ కుటుంబాన్ని మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఉదయం బెంగళూరు నుంచి రోడ్డు మార్గంలో ఆయన శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లి తండాకు చేరుకున్నారు. మురళీ నాయక్ తల్లిదండ్రులు శ్రీరామ్ నాయక్, జ్యోతిబాయిలను పరామర్శించి... ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ... మురళీ నాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. మురళీ నాయక్ చేసిన త్యాగానికి దేశం రుణపడి ఉంటుందన్నారు. వైసీపీ తరఫున వీర జవాన్ కుటుంబానికి రూ. 25లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. మురళీ నాయక్ కుటుంబానికి తమ పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని జగన్ భరోసా ఇచ్చారు. అనంతరం ఆయన తిరుగు పయనమయ్యారు. కాగా, జగన్ నివాళులు అర్పిస్తున్న సమయంలో మురళీ నాయక్ తండ్రి స్పందిస్తూ... "మురళీ... నీ కోసం జగనన్న వచ్చాడు... లేచి సార్ కి సెల్యూట్ కొట్టరా" అంటూ అనడం అక్కడున్న అందరినీ కదిలించింది. ఇక, ఇప్పటికే వీర జవాన్ కుటుంబానికి రూ. 50 లక్షల ఆర్థిక సాయం, ఐదు ఎకరాల వ్యవసాయ భూమి, 300 గజాల ఇంటి స్థలం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. అలాగే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తన వ్యక్తిగతంగా మురళీ నాయక్ కుటుంబానికి రూ. 25 లక్షలు ఇస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా ఎస్పీ వీ రత్న భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

సంక్షోభాలపై ప్రధాని మాట్లాడాలి: థరూర్

న్యూదిల్లీ: దేశం ఎప్పుడు సంక్షోభంలో ఉన్నా ప్రజలనుద్దేశించి మాట్లాడటం ప్రధాన మంత్రి కర్తవ్యమని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ నొక్కిచెప్పారు. ఆపరేషన్ సిందూర్‌ను మెచ్చుకున్నారు. భారత్, పాకిస్థాన్ మధ్య సైనిక ఘర్షణను ప్రధాని మోదీ బాగా నిర్వహించారని ప్రశంసించారు. శశిథరూర్ మంగళవారం ఎన్డీటీవీతో మాట్లాడుతూ 'ప్రధానిగా ఉన్న వారు దేశాన్ని ఉద్దేశించి కీలకాంశాలపై మాట్లాడటం ప్రాధాన్యం. అది కోవిడ్ లేక యుద్ధం కావచ్చు. దేశం ఎప్పుడు సంక్షోభాన్ని ఎదుర్కొన్నాగానీ ప్రధానిగా ఉన్న వారు ప్రజలతో టీవీ మాధ్యమంగానైనా మాట్లాడాలి. పరిస్థితులను వారికి వివరించాలి. మోదీ అలా చేయడం ప్రశంసనీయం' అని అన్నారు.

ఏజెన్సీలో ప్రత్యేక డీఎస్సీ : సీపీఎం

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: ఏజెన్సీలో జీవో నంబర్ 3 పునరుద్ధరణకు ఆర్డినెన్స్ తెచ్చి ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలని, అప్పటివరకు ఏజెన్సీలో డీఎస్సీ భర్తీ ప్రక్రియను సీఎం చంద్రబాబు వాయిదా వేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన అధికారుల సమీక్షా సమావేశంలో మూడు ఆప్షన్లను పరిశీలించినట్లుగా వార్తలు వచ్చాయని, అందులో నూరు శాతం రిజర్వేషన్లు కల్పించడం మినహా మరో ఆప్షన్ లేదని తెలిపారు. మిగతా ఇతర ఏ ఆప్షన్ తీసుకున్నప్పటికీ... అది గిరిజన నిరుద్యోగులకు అన్యాయం చేసినట్లవుతోందని, ఎన్నికల సందర్భంగా ఇటీవల అరకు సందర్శనలలోనూ జీవో నంబరు–3ని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారని వివరించారు. దానికి అనుగుణంగా సాంకేతిక లోపాలను సవరించి తిరిగి న్యాయ వివాదానికి చోటులేని విధంగా పాత జీవో స్థానంలో కొత్త ఆర్డినేషన్ తీసుకురావాలని, దరఖాస్తుల గడువు ఈ నెల 15న ముగియడంతో ఈ సమస్యను అత్యవసరంగా భావించి చర్యలు తీసుకోవాలని, ఏజెన్సీలో అప్పటిదాకా డీఎస్సీ వాయిదా వేసి తదుపరి ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలని కోరారు.

ఆర్టీసీ అవినీతి అధికారుల వేటుపై ఈయూ హర్షం

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: ఏపీఎస్ఆర్టీసీలోని కడప/విజయవాడ జోన్లలో ఆర్టీసీ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ విభాగాలపై ఇటీవల వచ్చిన అవినీతి ఆరోపణలపై ఎండీ తిరుమలరావు సమగ్ర విచారణ నిర్వహించి, బాధ్యులైన కడప విజిలెన్స్ భద్రతా అధికారిపై చర్యలు తీసుకోవడం పట్ల ఏపీ పీటీడీ(ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జీవీ నరసయ్య మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ అవినీతిలో మధ్యవర్తులుగా వ్యవహరించిన 9 మంది కడప జోన్‌కు చెందిన సెక్యూరిటీ సిబ్బందిపైనా చర్యలు తీసుకున్నారని తెలిపారు. అవినీతికి పాల్పడిన వారిని, సహకరించిన సిబ్బందిపై ఆర్టీసీ ఎండీ తీసుకున్న చర్యల పట్ల యూనియన్ రాష్ట్ర కమిటీ తరపున స్వాగతించారు. లంచాలు ఇచ్చి ఆర్థికంగా నష్టపోయిన బాధిత కుటుంబాలన్నింటినీ ఆదుకుని, ఆ డబ్బులు తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ ఎండీకి విజ్ఞప్తి చేశారు.

భారత సంకల్పానికి కార్యరూపం 'సిందూర్'

- మన డ్రోన్లు, క్షిపణులు పాక్ సైన్యానికి నిద్ర పట్టనివ్వవు
- 'భారత్ మాతా కీ జై' సైనికులు చేసే ప్రతిజ్ఞ
- ఆదంపూర్ వైమానిక స్థావరంలో ప్రధాని మోదీ

ఆదంపూర్ (పంజాబ్): పాకిస్థాన్ ఉగ్రవాదానికి పితామహుడిగా మారిందని ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. ఆపరేషన్ సిందూర్ భారతదేశ ఆత్మవిశ్వాసం, ఐక్యతను పెంచిందన్నారు. మంగళవారం పంజాబ్‌లోని జలంధర్ సమీపంలోని భారతదేశ రెండవ అతిపెద్దదైన ఆదంపూర్ వైమానిక స్థావరాన్ని మోదీ సందర్శించారు. ఇక్కడి సిబ్బందితో ఆపరేషన్ సిందూర్ విశేషాలు ముచ్చటించారు. అనంతరం సైనికులను ఉద్దేశించి ప్రసంగించారు. 'ఆపరేషన్ సిందూర్' విజయవంతమైనందుకు భారత సాయుధ దళాలకు సెల్యూట్ చేశారు. భారతదేశ డ్రోన్లు, క్షిపణులు పాక్ సైన్యానికి నిద్ర పట్టనివ్వలేదని అన్నారు. ఆపరేషన్ సిందూర్ భారత సైన్యం చేపట్టిన సాధారణ చర్య కాదని, దాని ద్వారా భారతదేశ సంకల్పం కార్యరూపం దాల్చడాన్ని ప్రపంచం మొత్తం చూడగలిగిందని తెలిపారు. పాకిస్థాన్ సైనిక అధికారులు ఉగ్రవాదుల అంత్యక్రియలకు ఎలా హాజరయ్యారో ప్రపంచం చూసింది. ఇది ఆ దేశ ప్రాయోజిత ఉగ్రవాదానికి పెద్ద నిదర్శనమన్నారు. ఉగ్రవాదులకు, వారికి సహాయం చేస్తున్న పాకిస్థాన్ సైన్యానికి నిర్ణయాత్మకంగా సమాధానం ఇవ్వడం ద్వారా భారతదేశం తన బలాన్ని నిరూపించుకుందన్నారు. ఉగ్రవాదులు ఆధారపడిన పాకిస్థాన్ సైన్యాన్ని భారత త్రివిధ దళాలు ఓడించాయన్నారు. సీమాంతర ఉగ్రవాదంపై జీరో–టాలరెన్స్ విధానాన్ని పునరుద్ఘాటిస్తూ... 'మనం వారి ఇళ్లలోకి ప్రవేశించి దాడి చేశాం. తప్పించుకునే అవకాశం కూడా వారికి ఇవ్వలేదు' అన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత 'లక్ష్మణ రేఖ' ఇప్పుడు స్పష్టంగా ఉందని చెబుతూ... మరొక ఉగ్రవాద దాడి జరిగితే, దేశం తగిన సమాధానం ఇస్తుందని ఆయన అన్నారు. 'భారత్ మాతా కీ జై' అనేది కేవలం నినాదం కాదని, దేశం కోసం తమ ప్రాణాలు పణంగా పెట్టడానికి మన సైనికులు చేసే ప్రతిజ్ఞ అని తెలిపారు. మన డ్రోన్లు, క్షిపణులు శత్రువులను తాకినప్పుడు వారు 'భారత్ మాతా కీ జై' అని వింటారని చెప్పారు. వైమానిక స్థావరంలో ఐఏఎఫ్ సిబ్బందిని ఉద్దేశించి ప్రధాని మాట్లాడుతూ 'మీ పరాక్రమ గాథలు చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతాయి. మన సైన్యం, వైమానిక దళం, నావికాదళ సిబ్బందికి నేను సెల్యూట్ చేస్తున్నాను' అన్నారు. పాకిస్థాన్ ఎంతగా ప్రయత్నించినప్పటికీ... మన వైమానిక స్థావరాలు, రక్షణ మౌలిక సదుపాయాలు ఏమాత్రం దెబ్బతినలేదన్నారు. 'మనం ఎల్లప్పుడూ అప్రమత్తంగా, సిద్ధంగా ఉండాలి. శత్రువు కొత్త భారతదేశంతో వ్యవహరిస్తున్నాడని మనం గుర్తు చేస్తూనే ఉండాలి' అని ఆయన అన్నారు. భారతదేశం ఎల్లప్పుడూ శాంతికి మద్దతు ఇస్తుంది కానీ... దాడి జరిగితే శత్రువును మట్టి కరిపించడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని ప్రధాని స్పష్టం చేశారు.

ట్రంప్ వ్యాఖ్యలపై... మోదీ జాతికి క్షమాపణ చెప్పాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: తాను చెప్పడం వల్లే భారత్–పాకిస్థాన్ యుద్ధం ఆగిందంటూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ప్రధాని నరేంద్రమోదీ జాతికి క్షమాపణ చెప్పాలని, ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు ఏర్పాటుచేసి, దీనిపై సమగ్రంగా చర్చించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దుందుడుకు వ్యాఖ్యలు వింటుంటే 140 కోట్ల భారతజాతి యావత్తూ సిగ్గుతో తలదించుకునే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. ప్రధాని మోదీకి ఎలా ఉందో అర్థం కావడంలేదని, యునైటెడ్ స్టేట్స్ యంత్రాంగం, అమెరికా వైస్ ప్రెసిడెంట్, విదేశాంగమంత్రుల చొరవ వల్లనే భారత్–పాక్ యుద్ధం ఆగిపోయినట్లుగాను, వాణిజ్య సంబంధాలు, వ్యాపార లావాదేవీలు జరగాలంటే యుద్ధాన్ని ఆపాలని హెచ్చరించడంవల్లే యుద్ధం ఆగినట్లు ట్రంప్ చెబుతున్నారని పేర్కొన్నారు. ఇంతకంటే సిగ్గుచేటయిన విషయం ఏమైనా ఉందా అని ప్రశ్నించారు. గుజరాత్‌కు చెందిన వ్యాపారుల మద్దతు, వారు ఇస్తున్న డబ్బుతో ప్రభుత్వాన్ని నడుపుతున్న మోదీ... చివరకు వ్యాపార లావాదేవీల కోసం ట్రంప్ చెబితే యుద్ధాన్ని ఆపేశారా... ట్రంప్ వ్యాఖ్యలను మోదీ ఎందుకు ఖండించడం లేదు... ఇది దేశ ప్రతిష్టను మంటగలపడం కాదా అని ప్రశ్నించారు. మోదీకి ధైర్యం ఉంటే ట్రంప్ చేసిన మాటలను ఖండించాలని, జాతికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం చంద్రబాబు... అయినదానికీ, కానిదానికీ మోదీని పదేపదే ఎందుకు పొగుడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. ట్రంప్ బెదిరిస్తే యుద్ధం ఆపారని చెబుతుంటే, భారతదేశాన్ని మోదీపైన నిలబెట్టారని చంద్రబాబు చెబుతున్నారని పేర్కొన్నారు. 'ట్రంప్ వ్యాఖ్యలు నిజం కాదని, భారత ప్రభుత్వమే ఆలోచించి స్వతంత్రంగా నిర్ణయం తీసుకోవడం ద్వారా యుద్ధం ఆగిందని' చంద్రబాబు చెప్పగలరా అని ప్రశ్నించారు. 'ఇండియా–పాకిస్థాన్‌ల మధ్య వివాదాల అంశాలలో మూడో దేశ ప్రమేయం అవసరంలేదని నాటి ప్రధానులు ఇందిరాగాంధీ, మన్మోహన్‌సింగ్ స్పష్టం చేశారన్నారు. సిమ్లా ఒప్పందం ప్రకారం భారత్–పాక్ మధ్య సమస్యలు కేవలం ఇరుదేశాలే మాట్లాడుకోవాలిగాని, మరొకరి ప్రమేయం ఉండకూడదని సూచించారు. భారతదేశ ఔన్నత్యం అమెరికాకు దాసోహమనే పద్ధతుల్లో కేంద్రం వ్యవహరించడాన్ని తప్పుబట్టారు. ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు ఏర్పాటుచేసి భారత్–పాక్ యుద్ధంపైన, డోనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలపైన పూర్తిస్థాయి చర్చ జరపాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురు కూలీలు దుర్మరణం

విశాలాంధ్ర–బొల్లాపల్లి: పల్నాడు జిల్లా వినుకొండ మండల పరిధిలోని శివపురం–రామిరెడ్డి పాలెం గ్రామాల మధ్య జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో నలుగురు మృతి చెందగా పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం మండలం గడ్డమీద పల్లె గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు నరసరావుపేట ప్రాంతంలోని బొప్పాయి తోటలో పనుల నిమిత్తం బొలెరో వాహనంలో వెళ్తుండగా ఎదురుగా కొబ్బరికాయల లోడుతో వస్తున్న లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. బొలెరోలో ప్రయాణిస్తున్న పగడాల రామిరెడ్డి, సుబ్బులు, బొట్టు రామాంజి, అంకమ్మ మృతిచెందారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. క్షతగాత్రులను సమీప ఆసుపత్రికి , మృతదేహాలను

పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద ఘటన తెలుసుకున్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, జీడీసీసీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, ఎర్రగొండపాలెం టీడీపీ నాయకులు గూడూరు ఎలక్షన్ బాబు తదితరులు భౌతికకాయాలను సందర్శించి సంతాపం తెలిపారు. మృతుల కుటుంబాలకు ఓదార్చారు. కాగా, ఈ రోడ్డు ప్రమాదంపై మంత్రి నారా లోకేశ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాల అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు.

పీవోకేకు ద్వైపాక్షిక పరిష్కారం

- సీమాంతర ఉగ్రవాదం అంతమే లక్ష్యం
- దానిపైనే దృష్టి – కశ్మీర్‌పై మధ్యవర్తిత్వం ఉండదు
- పాక్‌తో అణు యుద్ధం కోణమే లేదు
- ట్రంప్‌తో చర్చల్లో వాణిజ్యం ఊసే రాలేదు
- రణధీర్ జైస్వాల్ వెల్లడి

న్యూదిల్లీ: పాకిస్థాన్‌తో అణు యుద్ధాన్ని తప్పించినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పుకోవడాన్ని భారత్ వ్యతిరేకించింది. పక్క దేశంతో సంప్రదాయ పద్ధతిలోనే సైనిక ఘర్షణ సాగిందని స్పష్టంచేసింది. అసలు అణు యుద్ధం ప్రస్తావనే లేదని తేల్చిచెప్పింది. ట్రంప్‌తో చర్చల్లో వాణిజ్యం మాటే రాలేదని తెలిపింది. కాల్పులు విరమించుకోకపోతే వాణిజ్యాన్ని ఆపేస్తామని ట్రంప్ బెదిరించినట్లు వచ్చిన వార్తలను ఖండించింది. ట్రంప్ మాటలను తిప్పికొట్టింది. అణ్వస్త్రాల పేరిట బెదిరింపులకు పాల్పడితే భారత్ ఊరుకోదని కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో స్పష్టం చేశారు. 'అణు యుద్ధాన్ని నివారించామన్న ట్రంప్ మాటలను కొట్టిపడేశారు. ఆయనతో చర్చల్లో వాణిజ్యం ఊసే రాలేదన్నారు. అణు యుద్ధం కోణమే లేదని, పాక్ విదేశాంగ శాఖ కూడా దీనిని స్పష్టంచేసిందని జైస్వాల్ అన్నారు. 'కశ్మీర్' ద్వైపాక్షిక అంశమని, దీనిపై మధ్యవర్తిత్వానికి తావులేదని అన్నారు. ద్వైపాక్షిక చర్చలతోనే పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే) సమస్య పరిష్కారం కాగలని నొక్కిచెప్పారు. జమ్మూకశ్మీర్ విషయంలో భారత్ వైఖరిలో మార్పు లేదన్నారు. పీవోకేను పాక్ ఖాళీ చేయడమే మిగిలి ఉందని చెప్పారు. పహల్గాం దాడికి బాధ్యత వహించిన 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్)పై ఆంక్షలతో పాటు ఉగ్రవాద సంస్థగా ముద్ర వేయించేందుకు ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి (యూఎన్ఎస్‌సీ)ని భారత్ ఆశ్రయించనున్నట్లు జైస్వాల్ తెలిపారు. ఓటమిని అంగీకరించకపోవడం, విజయం సాధించినట్లు డప్పులు కొట్టుకోవడం పాక్ నైజమని విమర్శించారు. గతంలో 1971, 1975 యుద్ధాలే కాకుంగా 1999లో జరిగిన కార్గిల్ యుద్ధంలోనూ పాక్ ఇదే విధంగా ప్రచారం చేసుకుందని ఎద్దేవా చేశారు. అణ్వస్త్రాల పేరిట బ్లాక్‌మెయిల్, సీమాంతర ఉగ్రవాదాన్ని భారత్ ఏ మాత్రం ఉపేక్షించదని స్పష్టంచేశారు. పాకిస్థాన్ స్థావరాలపై భారత వైమానిక దాడుల నేపథ్యంలో డీజీఎంఓలతో చర్చల కోసం పాకిస్థాన్ ప్రతిపాదించిందని, ఆ క్రమంలోనే కాల్పుల విరమణ జరిగిందని అన్నారు. భారత్ ధ్వంసం చేసిన ఉగ్రవాద మౌలిక వసతుల వల్ల భారతీయులే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా అనేక మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారని జైస్వాల్ తెలిపారు. ఉగ్రవాదాన్ని పెంచిపోషించిన పాకిస్థాన్ పర్యవసానాలను ఎదుర్కోక తప్పదని భారత్ స్పష్టం చేసిందన్నారు. సీమాంతర ఉగ్రవాదానికి పాక్ మద్దతు నిలిపివేసే వరకు సింధూ జల సంధిని పునరుద్ధరించే ప్రస్తావనే లేదని జైస్వాల్ తేల్చి చెప్పారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.